ఇస్లాం

సరళమైన మార్గదర్శి

ప్రజలకు వారి భాషలో – సరళమైన శైలిలో ఆధునిక పద్ధతిని అనుసరించి ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేయడానికి అందమైన చిత్రాలతో కూర్చబడిన చిరు పుస్తకం.

అనువాదం

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమరీ

The Simplest Guide to ISLAM

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

మొదటి ప్రచురణ

ఇస్లాం సరళమైన మార్గదర్శి

The Simplest Guide to ISLAM

కాపీరైట్ ప్రత్యేకించబడింది
ప్రచురణ హక్కు © IPC, కువైట్, 2023
హెచ్చరిక
IPC కువైట్ మరియు ఉసూల్ సెంటర్ నుండి వ్రాతపూర్వక అనుమతి లేకుండా ఈ బుక్‌లెట్ లేదా దానిలోని భాగాలను బదిలీ చేయడానికి లేదా తిరిగి ముద్రించడానికి అనుమతి లేదు.

వివరాల కోసం, లేదా సలహాల కోసం, దయచేసి క్రింది వాటికి సందేశం పంపండి:
ipce@alnajat.com.kw
info@guidetoislam.com
muhammadpocketguide@gmail.com

డిపాజిట్ నంబర్: 6835/1443
అంతర్జాతీయ ప్రచురణ నంబర్: 6-19-8366-603-978
మొదటి ప్రచురణ: జనవరి 2026

GUIDE TO ISLAM
www.guidetoislam.com
LiveChat
IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఇస్లాం

సరళమైన మార్గదర్శి

وَمَنْ أَحْسَنُ دِينًا مِّمَّنْ أَسْلَمَ وَجْهَهُ لِلَّهِ وَهُوَ مُحْسِنٌ وَاتَّبَعَ مِلَّةَ إِبْرَاهِيمَ حَنِيفًا وَاتَّخَذَ اللَّهُ إِبْرَاهِيمَ خَلِيلًا (سورة النساء: ١٢٥)

ఒక వ్యక్తి తనను తాను అల్లాహ్ కు పూర్తిగా సమర్పించుకొని తదనుగుణంగా తన నడవడికను సరిదిద్దుకున్నాడు. అతను ఇబ్రాహీం సంప్రదాయాన్ని కూడా పాటిస్తున్నాడు, అల్లాహ్ తన మిత్రుడిగా చేసుకున్న ఇబ్రాహీం సంప్రదాయాన్ని. ఇలాంటి వ్యక్తి జీవితం కంటే మరెవరి జీవిత విధానం శ్రేష్ఠమైనదవుతుంది? (సూరత్ అన్–నిసా: 125)

భిన్న వయస్సు గల ప్రజలకు వారి భాషలో, సరళమైన శైలిలో ఆధునిక పద్ధతిని అనుసరించి ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేయడానికి అందమైన చిత్రాలతో కూర్చబడిన చిరు పుస్తకం.

ఈ పుస్తకం ఇస్లాంను పరిచయం చేయడం కోసం అత్యుత్తమ ప్రమాణాలతో కూర్చబడిన పుస్తకం.

మీరు ఇస్లాం ధర్మాన్ని సులభంగా చదివి, అర్థం చేసుకోవడానికి అవసరమైన కొన్ని మంచి పుస్తకాలలో మేము మీ కోసం సేకరించిన ఈ పుస్తకం చాలా ఉత్తమమైనది.

మాకన్నా ముందు ఇస్లాం ధర్మాన్ని పరిచయం చేయడానికి కలం పట్టిన మన పండితులందరికి అల్లాహ్ గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదించాలి.

అలాగే మా ఈ చిరు కృషిని స్వీకరించి ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చాలని సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ ను వేడుకుంటున్నాము!

بسم الله الرحمن الرحيم

అనంత కరుణామయుడు అపార దయాళువు అయిన అల్లాహ్ పేరుతో
ప్రారంభిస్తున్నాను.

"స్తుతిస్తోత్రాలకు అలాహ్ మాత్రమే అర్హుడు. ఆయన ఎవర్నీ కొడుకుగా చేసుకోలేదు. విశ్వసార్వభౌమత్వంలో ఆయనకు ఎవరూ భాగస్వాములు లేరు. ఒకరి సహాయసహకారాలపై ఆధారపడటానికి ఆయన ఎంత మాత్రం అశక్తుడు కాదు." ఔన్నత్యం, అద్భుత శక్తిసామర్థ్యాలరీత్యా ఆయన ఎంతో మహోన్నతుడు, ఘనాఘనుడు. ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై అల్లాహ్ కృపా కటాక్షాలు కురియుగాక! ఆయన అల్లాహ్ సందేశమైన ఖుర్ఆన్ గ్రంథాన్ని భూవాసుల వరకు చేరవేశారు. అది అంతకు ముందు వచ్చిన దైవ గ్రంథాలను ధృవీకరిస్తుంది, వాటి సారాంశాన్ని సంరక్షిస్తుంది.

సర్వలోక సృష్టికర్త అయిన అల్లాహ్ తన అపారమైన జ్ఞానంతో విశ్వాన్ని సృష్టించి, అందులోని ప్రతి వస్తువుకు సంబంధించిన విధి విధానాలను నిర్ధారించాడు. ముఖ్యంగా మానవులకు మంచీ చెడులనే రెండు మార్గాలను చూపాడు. దానికోసం ఆయన వారిని వినేవారుగా, చూసేవారుగా రూపొందించాడు. అర్థం చేసుకోవడానికి హృదయాన్ని అనుగ్రహించాడు. వారి మార్గదర్శనార్థం – అనేక మంది ప్రవక్తలను ప్రభవింపజేశాడు. వారు అల్లాహ్ సందేశాన్ని ప్రజల వరకు చేరవేసేవారు. ఇక ప్రజల్లో ఎవరయితే దైవ ప్రవక్తలను విశ్వసించి, వారి బాటన సాగిపోతారో వారు సన్మార్గం పొందుతారు, వారు వారి ప్రభువు ప్రసన్నతను చూరగొనడం తోపాటు, ఆయన వారి కోసం సిద్ధం చేసి ఉంచిన స్వర్గవనాలను సొంతం చేసుకుంటారు. అలా నడుచుకునే ప్రతి వ్యక్తి – అల్లాహ్ ఆదేశపాలన మూలంగా ఆత్మశాంతితో ప్రశాంత జీవితం గడుపుతాడు. మరెవరయితే, దైవ ప్రవక్తల మార్గాన్ని కాదని ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తూ, తప్పు త్రోవలు త్రొక్కి, చెడు బాటన నడుస్తాడో, అతను ఘోరమైన నష్టానికి గురవుతాడు. అతను చేసిన కృషి, పడిన శ్రమంతా వృధా అవుతుంది.

అల్లాహ్ మానవాళికి చేసిన మేళ్లు అగణ్యం. ఆయన మానవాళికి చేసిన మేళ్లలో మహా గొప్ప మేలు దైవ ప్రవక్తలను ప్రభవింపజేసి, దైవ గ్రంథాలను అవతరింపజేయడం. తన దాసుల యెడల అల్లాహ్ కారుణ్యం ఏమిటంటే, వారు ఎప్పుడప్పుడు సన్మార్గం తప్పారో అప్పుడప్పుడు – దైవ ప్రవక్తలు పంపిన మరచిన మార్గాన్ని గుర్తు చేసి సన్మార్గం మీద నడిచేలా సుశిక్షణ ఇచ్చే ఏర్పాటు చేశాడు. అలా వచ్చిన యావన్మంది ప్రవక్తలు దైవాదేశాల ప్రకారం జీవించి అనేక గొప్ప ఆదర్శాలను నెలకొల్పి వెళ్లారు. ఆ ప్రవక్తల పరంపరలో – చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (స). ఆయన గ్రంథాలలో కట్టకడపటి గ్రంథం ఖుర్ఆన్ . ఆయన ధర్మశాస్త్రాలలో అంతిమ శాస్త్రం–ఇస్లాం ధర్మ శాస్త్రం.

భూమండలం మీద నివసించే ఏ మానవుడయినా–అల్లాహ్ తన దాసుల కోసం సమ్మతించి ఆమోదించిన సత్య దఁర్మాన్ని అనుసరించడం తప్ప మార్గాం తరం లేదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

ఆయన నూహ్‌కు ఆదేశించిన జీవనమార్గాన్నే మీకోసం నిర్దేశించాడు. (ప్రవక్తా!) దానినే ఇప్పుడు దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపించాడు. ఈ జీవన మార్గాన్నే మేము ఇంతకు పూర్వం ఇబ్రాహీం, మూసా, ఈసాలక్కూడా అందజేస్తూ అందులోనే (జీవితాంతం) స్థిరంగా ఉండాలని, వర్గభేదాలు సృష్టించకూడదని హెచ్చరించాం. ఈ విషయాన్ని గురించే నీవు బోధిస్తున్నప్పుడు బహుదైవారాధకులు బెదిరి పోతున్నారు. అల్లాహ్ తాను కోరిన మనిషిని తనవాడిగా చేసుకుంటాడు. తన వైపు మరలేవాడికే ఆయన తన సాన్నిధ్యానికి చేరుకునే మార్గం చూపిస్తాడు. (అష్–షూరా: 13)

ఈ పుస్తకంలో ఇస్లాం ధర్మానికి సంబంధించిన అందమైన విషయాలన్నీ స్పష్టంగా పేర్కొనబడ్డాయి. ఇస్లాం ఇచ్చే సుశిక్షణ గురించి, ఇస్లాం చెప్పే యదార్థ విషయాల గురించి సంక్షిప్తంగా తెలియజేయడం జరిగింది. తద్వారా ప్రజలు – వారి నిజ ప్రభును గుర్తించి, ఆయన ఆదేశాలకనుగుణంగా జీవించి, ఆయన పంపిన ప్రవక్తలను విశ్వసించి, ఆయన అవతరింపజేసిన గ్రంథ జ్యోతికి అనుగుణంగా నడుచుకుంటూ – ఆయన ప్రసన్నతను, అనుగ్రహ భాగ్యాన్ని స్వంత చేసుకోవడం ద్వారా బాహ్య సౌఖ్యాన్ని, అంతర్గత శాంతిని పొందాలన్నదే లక్ష్యం.. మనందరి ప్రభువు ఇలా ఉపదేశిస్తున్నాడు;

నా కారుణ్యం యావత్తు సృష్టిని ఆవరించిఉంది. అలాగే దుష్కార్యాలు మానేసి, నా సూక్తులు విశ్వసించి (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ విధి నెరవేర్చేవారికి మాత్రమే నేను మేలు రాసి పెడ్తాను." దైవ సందేశహరుడు, నిరక్షరాస్యుడైన ఈ (ముహమ్మద్) ప్రవక్తను అనుసరించే వారికి (నేడీ మేలు రాయబడింది). ఇతని ప్రస్తావన వారి దగ్గరున్న తౌరాత్, ఇన్జీల్ గ్రంథాలలో కూడా ఉంది. అతను మంచి పనులు చేయమని (ప్రజలను) ఆదేశిస్తాడు. చెడుల నుండి వారిస్తాడు. వారికోసం పరిశుద్ధ వస్తువుల్ని ధర్మసమ్మతం చేస్తాడు. అశుద్ధ వస్తువుల్ని నిషేధిస్తాడు. వారి మీద పడిన (ఆంక్షల) భారం తొలగిస్తాడు. వారు చిక్కుకున్న (దురాచార) బంధనాల నుండి వారికి విముక్తి కలిగిస్తాడు. కనుక ఎవరు అతడ్ని విశ్వసించి సమర్థించి అతనితో సహకరిస్తూ, అతనిపై అవతరించిన (ఖుర్‌ఆన్) జ్యోతిని అనుసరిస్తారో వారే సార్థకజీవులు. వారినే విజయం వరిస్తుంది. (అల్–ఆరాఫ్: 157 ,156)

అల్లాహ్ మా ఈ చిరు కృషిని తన కృపతో స్వీకరించి, దీని ద్వారా ప్రజలకు మేలు చేకూర్చాలని, దీన్ని మిగిలి ఉండే సత్కార్యంగా చేయాలని, ఇందు నిమిత్తం సహకరించిన వారందరికీ గొప్ప ప్రతిఫలాన్ని అనుగ్రహించాలని, అందరూ సన్మార్గం వైపు నడిచేలా దీవించాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాము.

సంక్షిప్త విషయ సూచిక

మూడవది: ఇస్లాం ఓ విశ్వజనీన సందేశం

ఏడవ అధ్యాయం	పవిత్ర ఖురాన్: అల్లాహ్ వాక్యం మరియు శాశ్వతమైన మహిమ	13
ఎనిమిదవ అధ్యాయం	దైవ సందేశాలు	37

నాల్గవది: ఇస్లాం ఉన్నత నైతిక నియమావళి మరియు సంపూర్ణ జీవన సంవిధానం

తొమ్మిదవ అధ్యాయం	ఇస్లాం మానవాళికి చేసిన మేలేమిటి?	61
పదవ అధ్యాయం	ఇస్లాం స్త్రీలకు చేసిన మేలేమిటి?	101
పదకొండవ అధ్యాయం	ఇస్లాం ఒక సంపూర్ణ జీవన సంవిధానం	111

విషయ పట్టిక

మూడవది: ఇస్లాం ఓ విశ్వజనీన సందేశం

7 పవిత్ర ఖురాన్ - అల్లాహ్ వాక్యం మరియు శాశ్వతమైన మహిమ

★ పవిత్ర ఖురాన్ మరియు దాని ప్రత్యేకతలు 13

★ పవిత్ర ఖురాన్‌లోని శాస్త్రీయ అద్భుతాలు 19

8 దైవ సందేశాలు

★ ఖుర్‌ఆన్ లో ప్రజలందరి కోసం వారి ప్రభువు తరపు నుండి ఇవ్వబడిన సందేశం ఉంది..... 37

★ మానవులను సంబోధించే పవిత్ర ఖుర్‌ఆన్ వచనాలు..... 46

నాల్గవది: ఇస్లాం ఉన్నత నైతిక నాగరికత మరియు సంపూర్ణ జీవన సంవిధానం

9 ఇస్లాం మానవాళికి చేసిన మేలేమిటి?

★ ముందు మాట మరియు సారాంశం..... 61

★ ఇస్లాం సత్యం, న్యాయాల ధర్మం 63

★ ఇస్లాం శాంతి కారుణ్యాల ధర్మం 65

★ ఇస్లాం ధర్మం సమతౌల్యం గల మధ్యే మార్గం 67

★ ఇస్లాం కుటుంబం మరియు సంఘ ధర్మం 69

★ ఇస్లాం ప్రగతీ వికాశాల, ప్రజా ప్రయోజనాల ధర్మం 73

★ ఇస్లాం పరిశుభ్రత మరియు పవిత్రతల ధర్మం 75

★ ఇస్లాం ఆరోగ్యం మరియు సౌదర్య ధర్మం 79

★ ఇస్లాం మేధోవికాస మరియు వైజ్ఞానిక ధర్మం..... 86

10 ఇస్లాం స్త్రీలకు చేసిన మేలేమిటి?

★ మహిళల హక్కుల విషయంలో గొప్ప మలుపు ఇస్లాం..... 101

★ ఆధునిక యుగంలో మహిళలు మరియు ఇస్లాం..... 104

★ మహిళలకు సంబంధించిన ప్రవక్త (స) వారి మహితోక్తులు 107

11 ఇస్లాం ఒక సంపూర్ణ జీవన సంవిధానం

★ ఇస్లాం ఒక సంపూర్ణ జీవన సంవిధానం ఎలా కాగలదు?..... 111

★ ఆధ్యాత్మిక మరియు భౌతిక సమతుల్యత..... 122


★ ఇస్లాం సానుకూలత మరియు శాశ్వతమైన సౌభాగ్యాల ధర్మం 124

★ ప్రవక్త (స) వారితో ఒక రోజు..... 125









మూడవది

ఇస్లాం విశ్వజనీన సందేశం



నిశ్చయంగా ఈ జ్ఞాపిక (ఖుర్‌ఆన్)ను మేమే అవతరింపజేశాం. దాన్ని పరిరక్షించేవాళ్ళం కూడా మేమే. (అల్-హిజ్ర్: 9)

అధ్యాయం 7

పవిత్ర ఖుర్‌ఆన్ శాశ్వత మహిమ

1 పవిత్ర ఖుర్‌ఆన్ ప్రత్యేకతలు

★ పవిత్ర ఖుర్‌ఆన్ శాశ్వత మహిమ. ఎందుకంటే – భూమి మీద అవతరించిన ఆకాశ గ్రంథాలలో – అల్లాహ్ వాక్యాలు అక్షర పరంగానూ, అర్థ పరంగానూ ఎలాంటి మారుచేర్పులకు, మానవ జోక్యానికి గురి కాకుండా సురక్షితంగా ఉన్న ఏకైక దైవ గ్రంథం ఖుర్‌ఆన్ మాత్రమే.

★ పవిత్ర ఖుర్‌ఆన్ – స్వయంగా అల్లాహ్ ఈ గ్రంథ సంరక్షణా బాధ్యతను తానే స్వీకరించాడు. ఈ గ్రంథం తరం తర్వాత తరానికి గ్రంథం రూపంలోనూ, కంఠస్థం రూపంలోనూ చేరుతూ – ఎలాగైతే దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి అవతరించినప్పుడు ఉండేదో నేటికీ అది అలాగే ఉంది. ఈ గ్రంథం తనకు పూర్వమే అవతరించి దైవ గ్రంథాలన్నింటి సారాంశాన్ని సంరక్షించే గ్రంథం.

వారికి చెప్పు: "యావత్తు మానవులు, జిన్నులు ఏకమయి కఠోర ప్రయత్నం చేసినా, పరస్పరం సహకరించుకున్నా, ఖుర్‌ఆన్ లాంటి గ్రంథాన్ని ఎన్నటికీ రచించలేరు."
(బనీ_ఇస్రాయీల్: 88)

పవిత్ర ఖుర్‌ఆన్ వచన రీత్యా, పఠన శైలి రీత్యా భద్రపరచబడింది.

★ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఆయన మీద అవతరించే దివ్యావిష్కృతిని (వహీని) లిఖిత పూర్వకంగా భద్రపర్చే నిమిత్తం కొందరిని నియమించారు. ఉదాహరణకు – హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (ర), ఉబై బిన్ కఅబ్ (ర), జైద్ బిన్ సాబిత్ (ర) మొదలైనవారు. వీరు దైవ ప్రవక్త (స) వారి మీద అవతరించే ఖుర్‌ఆన్ గ్రంథాన్ని వ్రాసి భద్ర పర్చేవారు. దైవ ప్రవక్త (స) వారి మరణ సమయానికి – ఖుర్‌ఆన్ – ప్రతుల రూపంలో ఉండేది. దైవ ప్రవక్త (స) మరణానంతరం – హజ్రత్ అబూ బకర్ (ర) గారి పరిపాలనా కాలంలో – దాన్నో మహా కార్యంగా తీసుకుని – ఆ ప్రతులన్నింటినీ గ్రంథంగా చేయడం జరిగింది.

★ ఇస్లామీయ రాజ్య విస్తీరణ మరింత ఎక్కువగా పెరిగినప్పుడు – అనేక మంది ఇస్లాం ఛత్ర ఛాయల్లోకి వచ్చి చేరినప్పుడు – మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (ర) ఖుర్‌ఆన్ గ్రంథపు అనేక ప్రతులను తయారు చేసి ఆయా రాజ్యాల, ప్రాంతాల వైపునకు పంపే ఏర్పాటు చేసేవారు. అలాగే ఆయా ప్రాంతాలోని ప్రజలకు ఖుర్‌ఆన్ ఎలా చదవాలో నేర్పించడానికి ఖుర్‌ఆన్ పారాయణకర్తలను కూడా పంపేవారు.

★ నేటి ముస్లింల చేతుల్లో ఉన్న ఖుర్‌ఆన్ వాక్యాలు 14 శతాబ్దాల క్రితం అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై అవతరించిన ఖుర్‌ఆన్ వాక్యాలు – అచ్చం ఒకేలా ఉంటాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది ఎలా సాధ్యమయిందంటే, తరం తర్వాత తరం ఖుర్‌ఆన్ పారాయణకర్తలు ఈ గ్రంథాన్ని కంఠస్థం చేస్తూ వస్తున్నారు అనేది ఒకటి. అలాగే చారిత్రకంగా ఈ గ్రంథం దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) నుండి దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి వద్దకు, ఆయన నుండి తర్వాతి తరాలకు అదెలా చేరిందో సాక్ష్యాధారాలతో సహా గ్రంథస్తం చేయబడి ఉంది. అల్లాహ్ వద్ద నుండి ఈ గ్రంథాన్ని తీసుకు వచ్చినవారు హజ్రత్ జిబ్రయీల్ (అ) అయినప్పుడు అందులో ఒక్క పదం కూడా ఇటూ అటూ అయ్యే ఆస్కారమే లేదు. నేడు మన చేతుల్లో ఉన్న ఈ గ్రంథం నాడు దైవ ప్రవక్త (స) వారిపై అవతరించిన ఖుర్‌ఆన్ రెండూ ఒక్కటే.

★ ఖుర్‌ఆన్ పారాయణం తజ్వీద్ విద్యకు లోబడి జరుగుతుంది. ఈ విద్య – పవిత్ర ఖురాన్‌ను ఎలా చదవాలో మరియు దాని అక్షరాలు మరియు పదాల ఖచ్చితమైన ఉచ్చారణను ఖచ్చితమైన పద్ధతిలో ఎలా పలకాలో తెలియజేసే శాస్త్రం. దైవ ప్రవక్త (స) నుండి ఎలాగైతే వారికి ఖుర్‌ఆన్ పారాయణం చేరిందో అలాగే పారాయణం చేయడానికి ముస్లింలు శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తారు. అయితే ప్రత్యేకంగా ఈ శాస్త్ర కూర్పు ఏదైతే ఉందో అది – హిజరీ శకం 154 వ సంవత్సరంలో జరిగింది. అప్పటి నుండి ఇది ఓ ప్రత్యేక విద్యా శాస్త్రంగా ప్రశిద్ధి చెందింది. అంటే ఈ శాస్త్ర కూర్పు జరిగి 1200 సంవత్సరాలకు పై చిలుకు అవుతుంది. ఆ విధంగా – లాటిన్ నుండి ఉద్భవించిన లేదా ప్రభావితమైన ఆరు యూరోపియన్ భాషలలోని ఫొనెటిక్స్ మరియు లింగ్విస్టిక్స్ శాస్త్రాల కంటే తజ్వీద్ శాస్త్రం 1,000 సంవత్సరాల కంటే ముందు ఉంది.



★ ఉపాధ్యాయుని నోటి నుండి అభ్యాసకుల చెవి వరకు ఖురాన్ యొక్క ఫ్రీక్వెన్సీ పఠనం, తరతరాలు, అంతరాయం లేకుండా, వైవిధ్యం లేకుండా పారాయణం చేయబడుతూ వస్తున్నాదంటే ఇది ఎంతో అద్భుతమైన విషయం! అదే దివ్య ఖుర్‌ఆన్ ను ఇతర ఆకాశ గ్రంథాల నుండి ప్రత్యేక స్థానంలో నిలబెడుతుంది.

ఒకరి నుండి మౌఖికంగా విని దాన్ని నేర్చుకోవడం, నేర్పించడం అనే ఈ అద్భుత ప్రక్రియ నేటి వరకూ కొనసాగడానికి ఈ విద్య పట్ల ముస్లిం పండితుల శ్రద్ధాసక్తులే కారణం అని చెప్పవచ్చు. ఎందుకంటే అల్లాహ్ వాక్యాన్ని భద్రపరచి యథావిధిగా మానవాళికి చేరవేయాలి అన్న వారి గొప్ప సంకల్పం వారికుండేది. అలా చేరవేసే గొప్ప బాధ్యత తమపై ఉందని వారూ భావించేవారు.

ఖుర్‌ఆన్ మరియు హదీసుకి మధ్య వ్యత్యాసం

★ దైవ ప్రవక్త (స) వారి ప్రవచనాలు, ఆయన నేర్పిన విషయాలు – కేవలం అల్లాహ్ వాక్యాలు మాత్రమే కలిగిన ఖుర్‌ఆన్ గ్రంథంతో కలగాపులగం కాలేదు.. ధర్మ పండితులు మహనీయ ముహమ్మద్ (స) వారి ప్రవచనాలను, ఆయన ఆచరణలను, ఆయన మౌనం వహించి అనుమతించిన విషయాలను ప్రత్యేకంగా గ్రంథ రూపం ఇచ్చారు. వాటిని హదీసు గ్రంథాలంటారు. ఉదాహరణకు – ప్రవక్త (స) వారి మాటలు, ఆయన ప్రవచనాలను కొలీ సున్నత్ – వాక్కు పరమైన సున్నత్ అని, నమాజు విధానం, నమాజు భంగిమలు, హజ్జ్ అర్కానులు, విధానం తదితర విషయాలను అమలీ సున్నత్, ఆచరణ పరమైన సున్నత్ అని, ఒకరు చేస్తుండగా, ఒక మాట అంటుండగా చూసి మౌనంగా ఉండటాన్ని – తఖ్రీరి సున్నత్ – అనుమతించిన సున్నత్ అని పండితులు నామకరణం చేశారు.

★ మహనీయ ముహమ్మద్ (స) వారి, మాటలను, ఆయన ఆచరణలను, ఆయన అంగీకారాన్ని – "సున్నత్' అంటారు. ఇక ఏ గ్రంథంలోనైతే కేవలం అల్లాహ్ వాక్యం ఉందో (ఏ మనిషీ మాట లేదో) దాన్ని పవిత్ర ఖుర్‌ఆన్ అని పిలుస్తారు.

★ ఖుర్‌ఆన్ దివ్య గ్రంథాన్ని ఇతర మత గ్రంథాలతో ఏ విధంగానూ పోల్చకూడదు. ఇతర మత గ్రంథాలు ఆయా రచయితలు – దైవ ప్రవక్తలు చెప్పిన ధర్మ విషయాలను వారు తమ భాషలో, తమ శైలిలో, తమ సొంత వ్యాఖ్యతో గ్రంథస్థం చేశారు.

★ ఉదాహరకు – చర్చికి సంబంధించిన కొత్త నిబంధనలు అన్న పేరుతొ ప్రశిద్ధిగాంచిన నాలుగు సువార్తలు – అవి వాటి రచయితల పేరుతోనే గుర్తించబడ్డాయి. (మత్తయి, మార్కు, లూకా, యోహను) అలాగే పాత నిబంధనలు 1400 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో 40 వేర్వేరు రచయితల ద్వారా వ్రాయబడింది.

అల్లాహ్

ప్రజలందరి సృష్టికర్త
మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి,
మానవుల నిజ ఆరాధ్య దైవం

↓

జిబ్రీల్ (అ)

↓

ఖుర్‌ఆన్ గ్రంథాన్ని తీసుకొచ్చిన దైవ దూత


అంతిమ దైవ ప్రవక్త

ముహమ్మద్ (స)

↓


పవిత్ర ఖుర్‌ఆన్

భూమండలం మీద పద పరంగానూ, అర్థ పరంగానూ ప్రళయం వరకు ఎలాంటి మార్పు చేర్పులకు, హెచ్చుతగ్గులకు గురి కాకుండా రక్షించే బాధ్యత అల్లాహ్ తీసుకున్న ఏకైక గ్రంథం ఏదైనా ఉందంటే అది ఖుర్‌ఆన్ మాత్రమే. అది అల్లాహ్ వాక్యం. యుగాలు గడిచినా, తరాలు మారినా అది మార్పు చెందని శాశ్వత మహిమ. అందులో ప్రజలందరి ప్రభువు సందేశాలు ఉన్నాయి. అందులో ధర్మశాస్త్రం, మరియు జీవితానికి అవసరమైన ఉత్తమ బోధనలు ఉన్నాయి.



భూమ్యాకాశాలు కలసి ఉన్నప్పుడు మేము వాటిని విడదీయడాన్ని వారు చూడ లేదా? అలాగే ప్రతిప్రాణిని మేము నీటితో సృజించిన విషయాన్ని వీరు గమనించ లేదా? మరి వారు (మాయీ సృష్టి చాతుర్యాన్ని) ఎందుకు విశ్వసించరు? (అల్–అంబియా: 30)

తిరిగి దేవుడు ఆకాశం వైపు దృష్టి సారించాడు. అప్పుడు ఆకాశం పూర్తిగా పొగ రూపంలో ఉండేది. ఆయన భూమ్యాకాశాల్ని ఉద్దేశించి "మీకు ఇష్టమున్నా లేకపోయినా ఉనికిలోకి రండి" అన్నాడు. దానికి అవి "మేము వినమ్రులై వచ్చేశాం" అన్నాయి. (హామీమ్: 11)



రేయింబవళ్ళను సృష్టించినవాడు దేవుడే. సూర్యచంద్ర నక్షత్రాలను కూడా ఆయనే సృజించాడు. అవన్నీ తమ తమ నిర్ణీత కక్ష్యల్లో తేలియాడుతున్నాయి. (అల్–అంబియా: 33)

మేము మా స్వశక్తితోనే ఆకాశాన్ని నిర్మించాం. మాకా సామర్థ్యం ఉంది. భూమిని కూడా మేమే (మీకు నివాసయోగ్యంగా) పరిచాము. (మీకు అనువైనదిగా) పరచడంలో మేమెంత నిపుణులమో చూడండి.

(అజ్–జారియా: 48–47)

2 పవిత్ర ఖురాన్‌లోని శాస్త్రీయ అద్భుతాలు

బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం మరియు విశ్వ సృష్టి

మహమ్మద్ ప్రవక్త (స) కాలంలో, విశ్వం పుట్టుక గురించి, గ్రహాల కదలిక గురించి లేదా భూమి గోళాకారంగా ఉందా లేదా చదునుగా ఉందా అనేదాని గురించి ఎవరికీ తెలియదు. ఆధునిక శాస్త్రం – ఒక గొప్ప పేలుడు ఫలితంగా విశ్వం యొక్క సృష్టిని వివరిస్తుంది, మొత్తం విశ్వం ఒక ముద్దలాంటి పదార్థంగా ఉండేది. దానిలో మహా విస్ఫోటం సంభవించింది, ఈ విస్ఫోటనం నక్షత్రాలు, గ్రహాలు మరియు పాలపుంతల, అగ్ని పర్వతాల ఏర్పాటుకు దారి తీసింది. (దీన్ని ఆధునిక శాస్త్రంలో బిగ్ బ్యాంగ్ అని పిలుస్తారు).

ఇది అచ్చం ఖుర్‌ఆన్ లోని ఈ ఆయతును పోలి ఉంది: భూమ్యాకాశాలు కలసి ఉన్నప్పుడు మేము వాటిని విడదీయడాన్ని వారు చూడ లేదా? అ (అల్–అంబియా: 30)

రతఖ్ అంటే మూయబడి ఉండటం అని అసలు అర్థం. ఫతఖ్ ' అంటే తెరవటం, వేరుపరచటం అని అర్థం. ఆదిలో భూమ్యాకాశాలు పరస్పరం కలిసి ఉండేవి. మేము వాటిని వేరుపరచాము.

విశ్వం యొక్క విస్తరణ

1925వ సంవత్సరంలో అమెరికన్ ఖగోళ శాస్త్రవేత్త ఎడ్విన్ హబుల్ నక్షత్రాలు ఒకదానికొకటి దూరం అవుతున్నాయని సూచించే శాస్త్రీయ ఆధారాలను సమర్పించారు. ఇది గెలాక్సీలు మరియు మొత్తం విశ్వం నిరంతరం విస్తరిస్తున్నాయని సూచిస్తుంది. గ్రహాలు సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకారంలో కదులుతాయని మరియు అవి ఒకే సమయంలో తమ అక్షం చుట్టూ తిరుగుతాయని శాస్త్రీయ ఆధారాలను కూడా సమర్పించాడు. ప్రకృతి శాస్త్రవేత్తలు తమ సిద్ధాంతాలను దశాబ్దాలుగా జరిపిన పరిశీలన మరియు అధ్యయనాల ఫలితాల ద్వారా నిర్ధారిస్తారు.



సమస్తం ఒక్కొక్క కక్ష్యలో
(అంటే తమ తమ నిర్ణీత కక్ష్యల్లో)
సంచరిస్తున్నాయి. (యాసీన్: 40)

ఆకాశం విభిన్నరూపాలు

విభిన్నరూపాలలో కన్పించే ఆకాశం సాక్షి! మీ అభిప్రాయాలు
విభిన్నరకాలుగా ఉన్నాయి. (అజ్–జారియాత్: 8–7)


ఈ పవిత్ర ప్రవచనం సూచిస్తున్నదేమిటంటే,

ఆకాశంలో అనేక రహదారులు, మార్గాలు మరియు కక్ష్యలు ఉన్నాయి, ఈ గొప్ప విశ్వంలో శరీరాలను ఉంచే గురుత్వాకర్షణ మరియు సంక్లిష్ట విద్యుదయస్కాంత క్షేత్రాల నియమాలపై ఆధారపడే అద్భుతమైన, అత్యంత ఖచ్చితమైన విశ్వ వ్యవస్థచే నిర్వహించబడుతుంది, కాబట్టి ప్రతి ఒక్కటి దాని కక్ష్య మరియు మార్గంలో కదులుతుంది. గొప్ప కాస్మిక్ ఫాబ్రిక్ "హుబుక్" అనే పదంతో ఈ ఆయతులో వర్ణించబడింది. అంటే ఆకాశం ఆ విద్యుదయస్కాంత క్షేత్రాలచే అల్లినట్లుంటుంది.




పద్నాలుగు శతాబ్దాల క్రితం దైవప్రవక్త (స) ముహమ్మద్ పఠించిన మరియు నేటికీ భద్రపరచబడిన పవిత్ర ఖుర్ఆన్ లో చెప్పబడిన విషయాలు మరియు ఆధునిక శాస్త్రీయ ఆవిష్కరణల మధ్య సారూప్యతను చూసి ఒక వ్యక్తి ఆశ్చర్యపోవచ్చు. పవిత్ర ఖుర్ఆన్ విశ్వం యొక్క సృష్టి, సూర్యచంద్రుల కదలిక, భూమి యొక్క భ్రమణం మరియు పగలు, రాత్రి ఏర్పడిన కథను అద్భుతమైన రీతిలో ప్రస్తావించింది.

మేము మా స్వశక్తితోనే ఆకాశాన్ని నిర్మించాం. నిశ్చయంగా మేము దాన్ని విస్తరింప జేయగలము . (అజ్ –జారియాత్:47)



సప్తాకాశాలు, భూమి, భూమ్యాకాశాల్లోని యావత్తు సృష్టిరాసులు ఆయన పవిత్రతను కొనియాడుతున్నాయి. ఆయన ఔన్నత్యంతోపాటు ఆయన పవిత్రతను ప్రశంసించని సృష్టి అంటూ ఏదీ లేదు. కాని అవి చేసే దైవస్మరణను మీరు గ్రహించలేరు. ఆయన ఎంతో ఉదారుడు, గొప్ప క్షమాశీలి. (బనీ_ఇస్రాయీల్: 44)




కాబా చుట్టూ ప్రదక్షిణ చేయడం అనేది విశ్వం యొక్క సృష్టికర్తతో మిమ్మల్ని అనుసంధానించే ప్రార్థన. విశ్వం మొత్తం ఆయనను స్తుతిస్తున్నట్లు మీరు భావిస్తారు. ఈప్రదక్షిణ అల్లాహ్ చట్టాలకు సృష్టి యావత్తు లొంగిపోయిందన్న విషయాన్ని సూచిస్తుంది. ప్రార్థన సామరస్యంగా ఉండే ఏకైక ధర్మం ఇస్లాం. (ఇది మస్జిద్ హరామ్ లోని కాబా చుట్టూ ప్రదక్షిణ చేసే రూపం). నక్షత్రాలు, గ్రహాలు మరియు ఎలక్ట్రాన్ల కదలిక సయితం గడియారపు ముల్లుకు వ్యతిరేక దిశలో ఉంటుంది.

మానవ సృష్టి మరియు పిండం అభివృద్ధి

పవిత్ర ఖురాన్ మనిషి యొక్క సృష్టి మరియు అతని పిండం అభివృద్ధి గురించి అద్భుతమైన వాస్తవాలు మరియు ఖచ్చితమైన వివరాలను పేర్కొంది. 1,400 సంవత్సరాల క్రితం ఈ వివరాలు తెలియవని, ఆ సమయంలో పిండశాస్త్రం ఉనికిలో లేదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఉదాహరణకు, సూరా అజ్ –జుమర్ యొక్క 6వ వాక్యంలో తల్లి కడుపులో మూడు చీకట్లు ఉంటాయని పేర్కొనబడింది.

మిమ్మల్ని ఆయన మీ తల్లుల గర్భాలలో మూడేసి చీకటి పొరలలో ఉంచి, ఒకదాని తరువాత ఒకటిగా రూపకల్పన చేస్తున్నాడు. ఆయనే అల్లాహ్. ఆయనే మీ ప్రభువు, పోషకుడు, పాలకుడు, విశ్వ సామ్రాజ్యాధినేత. ఆయన తప్ప మరో నిజ ఆరాధ్యుడు లేడు. మరి మీరు ఎవరి వలలో పడి మోసపోతున్నారు?
(అజ్ –జుమర్: 6)

గర్భంలో ఉన్న పిండం చుట్టూ చీకటి ముసుగులు ఏర్పడే మూడు పొరల ఉనికిని ఆధునిక శాస్త్రం కనిపెట్టడం ఆశ్చర్యకరం. ఇది శిశువును రక్షించడానికి బలమైన పిండ సంచిని ఏర్పరుస్తుంది. ఈ మూడు పొరలు ఉదర గోడ, గర్భాశయ గోడ మరియు ప్లాసెంటల్ మెంబ్రేన్.




పవిత్ర ఖురాన్‌లో,మానవ సృష్టి మరియు అతని పిండం అభివృద్ధి గురించి అద్భుత వర్ణన ఉంది, సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

> నిశ్చయంగా మేము మానవుడ్ని నాణ్యమైన మట్టితో సృజించాము. తరువాత అతడ్ని ఒక సురక్షిత ప్రదేశంలో కార్చిన బిందువుగా మార్చాము. తరువాత ఆ బిందువును నెత్తుటి ముద్దగా రూపొందించాము. తిరిగి ఆ నెత్తుటి ముద్దను మెత్తటి పిండంగా చేశాము. ఆ తరువాత దాన్ని ఎముకలుగా మార్చాము. ఆ ఎముకలపై మాంసం కప్పాము. ఆపై (అందులో ప్రాణం పోసి) ఓ నూతన సృష్టినే ఉనికిలోకి తెచ్చాము. కాబట్టి అల్లాహ్ ఎంతో శుభకరుడు. ఆయన నిర్మాతలందరిలోకెల్లా గొప్ప ప్రతిభాశాలి. (అల్-మోమినూన్: 14-12)

బిందువు → నెత్తుటి ముద్ద → మెత్తటి పిండం → ఎముకలు → మాంసం

సరిగ్గా ఈ వాక్యంలో పేర్కొన్న పిండం పెరుగుదల అభివృద్ధి; ఇటీవలి శాస్త్రీయ ఆవిష్కరణలు ఒకేలా ఉండటం ఆశ్చర్యకరం! ఈ ఖచ్చితమైన వర్ణనతో మాట్లాడిన వ్యక్తి పిండాన్ని సృష్టించి, దాని అభివృద్ధిని నిర్ణయించిన వ్యక్తి అని, లేదా తన కళ్ళతో దాని నిర్మాణం మరియు అభివృద్ధిని చూసి మనకు వివరించిన వ్యక్తి అని మనకు ఈ ఆయతు నిశ్చయంగా సూచిస్తుంది. ప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో ఈ విధమైనటువంటయి ఊహాగానాలు కూడా శాస్త్రీయంగా అసాధ్యం కాబట్టి, ఈ ఆయతు పిండాన్ని సృష్టించిన మరియు దాని అభివృద్ధిని వివరించిన అల్లాహ్ అద్భుత వాక్యం ఖుర్‌ఆన్ అన్న యదార్థాన్ని విశద పరుస్తుంది.





పవిత్ర ఖుర్లోఆన్ లో ప్రస్తావించబడిన అద్భుతమైన వాస్తవాలలో ఒకటి – మాంసానికి ముందు ఎముకలు కూర్చబడిన వర్ణన. చూపు ఇంద్రియానికి ముందు వినికిడి ప్రస్తావన. ఇదే విషయాన్ని నేటి ఆధునిక శాస్త్రం కనుగొన్నది. శిశువు ఎముకలు దాని మాంసం కన్నా ముందు ఏర్పడతాయి. వినికిడి శక్తి చూసే శక్తికన్నా ముందు ఏర్పడుతుంది.

కాబట్టి అల్లాహ్ ఎంతో శుభకరుడు. ఆయన నిర్మాతలందరిలో కెల్లా గొప్ప ప్రతిభాశాలి. (అల్–మోమినూన్: 14)

ఆపై అతడ్ని పరిపూర్ణ మానవుడిగా రూపొందించి అతని (శరీరం)లో తన ఆత్మను ఊదాడు. (ఒక్కసారి ఆలోచించండి.) ఆయన మీకు చెవులిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాన్నిచ్చాడు. కాని మీరు మాత్రం (ఆయనకు) చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు. (అస్–సజ్దా: 09)


మీకు వినే, చూసే శక్తులతోపాటు ఆలోచించేందుకు హృదయమిచ్చినవాడు దేవుడే కదా! కాని మీరు ఆయనకు చాలా తక్కువ కృతజ్ఞత చూపుతున్నారు. (అల్–మోమినూన్: 78)





నిరాఘాటంగా సాగుతున్న
కాలవాహినిలో మానవునికి తానొక
గడ్డిపోచ విలువ కూడా లేనివాడిగా
ఉండిన సమయం ఎప్పుడైనా
ఎదురయిందా? మేము మానవుడ్ని
పరీక్షించడానికి ఒక మిశ్రమబిందువుతో
పుట్టించాం. దానికోసం మేమతడ్ని
వినేవాడిగా, చూసేవాడిగా
రూపొందించాం. (అద్-దహ్ర్: 2-1)







నీరు వేర్వేరుగా ఉండటంలో అద్భుతం ఏమిటంటే అవి కలవవు

ఆధునిక శాస్త్రం కనుగొన్న విషయం ఏమిటంటే, రెండు సముద్రాలు కలిసే చోట వాటి మధ్య ఓ తెర ఏర్పడుతుంది. ఈ తెర రెండు సముద్రాల నీరు ఒకదానిలో మరొకదాని నీరు కలవకుండా అడ్డుకుంటుంది అన్నది. ఇది రెండు సముద్రాలు కలిసే ప్రదేశములో జరిపిన పరిశోధనల ఆధారంగా రెండు సముద్రాల నీరు కలవవని వాటి మధ్యలో ఒక తెర ఉంటుందని ఆధునిక సైన్స్ తెలియజేస్తుంది.

ఈ విషయాన్నే ఖుర్ఆన్ లోని ఈ ఆయతు – మహా సముద్రాలలో స్టేషన్లను నిర్మించడం మరియు వాటి నీటి నమూనాలను తీసుకునే మానవ సామర్థ్యం పునాదులు వేసుకోక ముందే, సాగర విజ్ఞాన శాస్త్రం – దాని ఉనికి అన్నదే లేని సమయంలో ప్రస్తావించింది.

రెండు సముద్రాల జలాలు ఒకదానికొకటి కలవకుండా, ఒకదానికొకటి చెడిపోకుండా అల్లాహ్ రెండు సముద్రాల మధ్య అడ్డుతెరను ఏర్పాటు చేశాడు.

> ఆయన రెండు సముద్రాలను పరస్పరం కలసిపోయేలా వదలి పెట్టాడు. ఆయినా వాటి మధ్య ఒక అడ్డుతెర ఉంది. దానివల్ల అవి ఒకదానిలో ఒకటి చొచ్చుకు పోలేవు. మరి మీరు మీ ప్రభువు శక్తిపరిధిలోని ఏ మహిమను నిరాకరించగలరు? (అర్-రహ్మాన్: 21-19)



ఖుర్ఆన్ లో పర్వతాల గురించి (భూవిజ్ఞాన శాస్త్రం) వాటిని మేకులుగా పేర్కొనడంలోని మర్మం

భూగర్భ శాస్త్రం అభివృద్ధి చెందిన తరువాత, మానవుడు ప్రకృతి యొక్క వివిధ కోణాలు మరియు దాని స్థలాకృతి గురించి గొప్ప జ్ఞానాన్ని సంపాదించాడు. పర్వతాలు ఒక చీలిక ఆకారంలో ఉన్నాయని శాస్త్రవేత్తలు ధృవీకరించారు,

ఎందుకంటే పర్వతాలు ఎంత ఎత్తుగా ఉంటాయో అంతకంటే ఎక్కువ రెట్లు భూమిలోనికి దిగబడియుంటాయి. అంటే వాటి దిగువ భాగం పర్వతాన్ని స్థిరీకరించడానికి మేకును పోలి ఉంటుంది. పర్వతాలు భూమిని కదలకుండా ఉంచడంలో మరియు సమతుల్యతను కాపాడటంలో కూడా వాటి పాత్ర చాలా ముఖ్యమైనది. ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ 14 వందల సంవత్సరాల క్రితమే విజ్ఞాన భాండాగారమైన తన గ్రంథంలో స్పష్టంగా చెప్పాడు;

భూమండలం మిమ్మల్ని తీసుకొని దొర్లకుండా ఉండేందుకు ఆయన దాని మీద పర్వతాలను మేకులుగా పాతాడు. ఆయన (మీ కోసమే) నదుల్ని ప్రవహింపజేశాడు. మీరు దారి తెలుసుకోవడానికి వీలుగా సహజ మార్గాలు, ఇతర అనేక చిహ్నాలు కూడా ఏర్పరిచాడు. (అన్-నహల్: 15)


మేము భూమిని విశాలపరచి నివాసయోగ్యంగా రూపొందించలేదా? దానిపై పర్వతాలను మేకులుగా పాతలేదా? (అన్-నబా: 7-6)



ముగీరహ్ బిన్ షుఅబహ్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హయాంలో సూర్యగ్రహణం అయ్యింది. అదే రోజు విశ్వాసుల మాత మారియహ్ (ర) గారి ద్వారా కలిగిన ఆయన సుకుమారుడు హజ్రత్ ఇబ్రాహీమ్ (ర) మరణించాడు. అప్పుడు ఆయన వయసు 18 నెలలు.

గమనిక: దైవ ప్రవక్త (స) ఆ విషాద సమయంలో చెప్పిన మాట గమనార్హం. నిశ్చయంగా కళ్ళు కన్నీళ్లు కురిపిస్తున్నాయి. మనస్సు శోక సంద్రం అయింది. అయినా – మా ప్రభువుకు ఇష్టమైన మాటే మా నోట వెలువడుతుంది. ఓ ఇబ్రాహీమ్! మేము నీ విరహంతో బాధ పడుతున్నాము. (బుఖారీ)

ఆయన సుకుమారుని మరణతోనే సూర్యగ్రహణం చోటు చేసుకుంది అని కొందరనగా – ఆయన వారి అభిప్రాయాన్ని ఖండిస్తూ – నిశ్చయంగా సూర్యచంద్రులు – ప్రజల్లో ఏ ఒక్కరి మరణంతో గ్రహణం చెందవు. యదార్థం మేమింటంటే, అవి రెండూ అల్లాహ్ సూచనల్లోని రెండు సూచనలు. ఒకవేళ మీరు వాటికి గ్రహణం పట్టినట్టు గనక చూస్తే, లేచి నమాజు చేయండి అన్నారు. (బుఖారీ, ముస్లిం)





నిత్య చైతన్య ధర్మం ఇస్లామ్

దైవ ప్రవక్త, (స) వారిని అనుసరించి ముస్లింలు సూర్య గ్రహణం, చంద్ర గ్రహణం సమయంలో ప్రార్థన చేస్తారు.

ఇది సున్నత్. తప్పనిసరి ప్రార్థన అయితే కాదు. వారు భూమ్యాకాశాలకు ప్రభువైన, వాటి మధ్య ఉన్న అన్నిటికి పోషణకర్త అయిన అల్లాహ్ ను మాత్రమే ఆరాధిస్తారు, ఆయనే సమస్తాన్నీ సృష్టించినవాడు. సూర్యుడు మరియు చంద్రుల కదలికను, భూమి యొక్క భ్రమణాన్ని మరియు రాత్రి మరియు పగలు యొక్క రాకపోకలను నిర్ధారించినవాడు ఆయనే.

గమనిక: గ్రహణ నమాజు రెండు రకాతులు. ప్రతి రకాతులోనూ రెండు ఖియాములు రెండు రుకూలు, రెండు సజ్దాలు ఉంటాయి.

భూమికి సూర్యుడికి మధ్య చంద్రుడు వచ్చినప్పుడు, భూమి మీద కొంత భాగానికి సూర్యుడు పూర్తిగా గానీ, పాక్షికంగా గానీ కనబడకుండా పోవడం వలన సూర్య గ్రహణము ఏర్పడుతుంది. చంద్రునికి సూర్యునికి మధ్యగా భూమి వచ్చినపుడు, సూర్యుని కాంతి చంద్రునిపై పడకుండా భూమి అడ్డుపడటంతో భూమిపైనున్నవారికి చంద్రుడు కనిపించడు. దీన్ని చంద్ర గ్రహణం అంటారు



పవిత్ర ఖుర్ఆన్ అధికారిక సర్టిఫికెట్ గురించి మీకు ఏమి తెలుసు?

* ఇది పవిత్ర ఖుర్ఆన్ కంఠస్తం మరియు పఠనానికి సంబంధించిన సర్టిఫికేట్. ఈ పట్టా పరంపర నేటి ఖుర్ఆన్ పారాయణకర్తలు మొదలు అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి కాలానికి చెందిన పారాయనకర్తల వరకూ వారి నుండి అల్లాహ్ ప్రవక్త వరకూ అవిభాజ్య గొలుసుగా ఉంటుంది.

* ఒక విద్యార్థి గాని, విద్యార్థిని గాని పవిత్ర ఖుర్ఆన్ పఠించడంలో పట్టాభద్రులవడ మంటే, వారి పఠన ప్రామాణికతను – దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వరకు చేర్చే పారాయకర్తల పరంపరతో అనుసంధానించబడింది అని అర్థం. ఆ రకంగా – మగ లేదా ఆడ, ఖుర్ఆన్ గ్రంథ పారాయణకర్తలు ఈ అద్భుత గొలుసులో భాగమవుతారు, దీనిని (సనద్ ముత్తసిల్) అవిభాజ్య గొలుసు అని పిలుస్తారు. ఇది మునుపటి పండితుల నుండి ధృవీకరించబడిన పారాయకర్తల ప్రత్యేక కమిటీచే పర్యవేక్షించబడుతుంది.


దైవవాణి అవతరణ మొదలు నేటి వరకు అవిరామ పఠనం

* దీనర్థం ఇది ప్రజా హృదయాలలో భద్రపరచబడి, పరుస తరాల ద్వారా ఖచ్చితమైన ప్రమాణాలతో మన వరకు చేరింది. ఖుర్ఆన్ గ్రంథ పారాయణకర్తలు ప్రతి యుగంలోనూ ఎంత పెద్ద స్థాయిలో ఉండేవారంటే, వారందరీ సందేహించే ఆస్కారమే లేదు. వీరంతా పవిత్ర ఖుర్ఆన్ ను సంపూర్ణ ఉచ్చారణతో ఎలాంటి విభేదం లేకుండా ఖచ్చితమైన స్వరంలో కంఠస్థం చేసినవారు. పవిత్ర ఖుర్ఆన్ ముస్లిం జన హృదయాల్లో సురక్షితంగా ఉంది.





ముఖ్యమైన ప్రయోజనాలు



ప్రామాణికత అవిభాజ్య గొలుసును డౌన్లోడ్ చేసుకోవడానికి దీనిని స్కాన్ చేయండి.



ఖుర్‌ఆన్ లో అల్లాహ్ పిలుపు

ఓ ప్రజలారా! ఓ ఆదమ్ సంతానమా! ఓ మానవుడా!

ప్రజలందరూ

ఓ గ్రంథ ప్రజలారా! (యూదులు మరియు క్రైస్తవులు)

గ్రంథ ప్రజలు

ఓ విశ్వసించిన ప్రజలారా! ప్రవక్త ముహమ్మద్ (స) మీద ఆవతరించిన దానిని విశ్వసించిన వారు.

విశ్వసించిన ప్రజలు

ప్రవక్త ముహమ్మద్ (స) మీద ఆవతరించిన దానిని తిరస్కరించిన వారు.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో అవిశ్వాసులతో అనేక తార్కిక సంభాషణలు ఉన్నాయి మరియు పునరుత్థాన దినాన తప్ప అల్లాహ్ నేరుగా వారిని సంబోధించడు. ఖుర్‌ఆన్‌లో "ఓ తిరస్కరించిన వారలారా!" అనే సంబోధనం, పిలుపు ఒక్కటి కూడా లేదు.

అలా వారిని పునరుత్థాన దినాన మాత్రమే పిలవడం జరుగుతుంది.

తిరస్కరించిన ప్రజలు

అధ్యాయం 8

దైవ సందేశాలు

1 ఖుర్‌ఆన్ అందులో జనులందరి కోసం వారి ప్రభువు తరపు నుండి గొప్ప సందేశం ఉంది.

పవిత్ర ఖుర్‌ఆన్ – ప్రజలందరి కోసం వారి భాష మరియు రంగుతో సంబంధం లేకుండా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తరపు నుండి అనేక సందేశాలు మరియు అద్భుతమైన పిలుపును కలిగి ఉంది.

* ఈ సంబోధనలు ప్రజలను వారి నిజ సృష్టికర్త వైపుకు మార్గదర్శనం చేస్తాయి. ఆయనను విశ్వసించమని మరియు ఎలాంటి భాగస్వాములు లేకుండా ఆయనను మాత్రమే ఆరాధించమని వారిని ఆహ్వానిస్తాయి. అలాగే ప్రజలు తమ కర్మలకు అల్లాహ్ దర్బారులో జవాబు చెప్పుకునే ఓ రోజు ఉందని వారికి గురుతు చేస్తాయి.

* పవిత్ర ఖుర్‌ఆన్ లో, అల్లాహ్ ప్రజలందరినీ – "ఓ ప్రజలారా!," అని "ఓ ఆదమ్ సంతానమా!" అని "ఓ మానవుడా!" అని సంబోధించాడు.

* అలాగే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన ప్రవక్త ముహమ్మద్ (స) వారికి అనేక ఆయతులలో ప్రజలందరినీ – "ఓ ప్రజలారా! అని సంబోధించమని ఆజ్ఞాపించాడు;

  ప్రవక్తా! ఇలా చెప్పు: ప్రజలారా! "నేను మీ అందరి కోసం వచ్చిన అల్లాహ్ ప్రవక్తను. భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపతిచే నియమించబడిన సందేశహరుడ్ని. ఆయన తప్ప మరో నిజ దేవుడు లేడు. ఆయనే జీవన్మరణాలకు మూలకారకుడు. కనుక అలాంటి అల్లాహ్ ను , ఆయన పంపిన నిరక్షరాస్య ప్రవక్తను విశ్వసించండి. అల్లాహ్ ను , ఆయన ఆజ్ఞల్ని నమ్ము తున్న ఈ ప్రవక్తను అనుసరించండి. అప్పుడే మీరు సన్మార్గగాములవుతారు." (అల్–ఆరాఫ్: 158)

* దివ్య ఖుర్‌ఆన్ లో అల్లాహ్ – గ్రంథ ప్రజలయిన యూదక్రైస్తవుల్ని ప్రత్యేకంగా సంబోధించాడు. వారి కోసం ప్రత్యేకమైన సందేశాలు ఇచ్చాడు. సత్యాన్ని అనుసరించమని, అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారిపై అవతరింపజేయబడిన ఆయన గ్రంథాన్ని విశ్వసించమని, ఆ గ్రంథం వారికి ఇవ్వబడిన గ్రంథాలను దృవీకరించే గ్రంథమని వారిని ఆజ్ఞాపించాడు.

ఓ ప్రజలారా!

ప్రవక్తా! వారికిలా చెప్పు: "ప్రజలారా! నేను (మీ శ్రేయోభిలాషిని. దుర్దినాలు దాపురించక ముందే) మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించేవాడ్ని మాత్రమే." కనుక సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి మన్నింపు, గౌరవప్రదమైన ఉపాధి ఉన్నాయి. మా సూక్తుల్ని కించపరచడానికి ప్రయత్నించేవారు నరక వాసులవుతారు. (అల్–హజ్: 51–49)

ముహమ్మద్! వారితో ఇలా చెప్పెయ్యి: "ప్రజలారా! నా ధర్మం గురించి మీకేదయినా అనుమానం ఉంటే ఒక విషయం తెలుసుకోండి. మీరు అల్లాహ్ ను వదలి ఎవరిని ఆరాధిస్తున్నారో వారిని నేను ఎన్నటికీ ఆరాధించను. ఎవరి అధీనంలో మీ ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ ను మాత్రమే నేను ఆరాధిస్తాను. నేను దృఢమయిన విశ్వాసిగా ఉండాలని నాకు ఆజ్ఞయింది. (యూనుస్: 104)

ప్రవక్తా! వారికిలా చెప్పు: "ప్రజాలారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరకు సత్యం వచ్చింది. ఇక ఎవరు సన్మార్గం అవలంబిస్తారో ఆ సన్మార్గం వారికే మేలు చేకూర్చుతుంది. మరెవరు మార్గభ్రష్టత్వంలోనే పడివుంటారో ఆ మార్గభ్రష్టత్వం వారికే చేటు తెస్తుంది. నేను మీపై పర్యవేక్షకునిగా లేను. (యూనుస్: 108)

ఓ ప్రజలారా!

మానవులారా! మిమ్మల్ని, మీ పూర్వీకుల్ని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. అప్పుడే మీరు రక్షించబడతారని ఆశించగలరు. ఆయనే మీ కోసం నేలను పడకగా, నింగిని కప్పుగా చేశాడు. పైనుండి వర్షం కురిపించేవాడు కూడా ఆయనే. ఆ వర్షం ద్వారా ఆయన రకరకాల పండ్లూ, పంటలు పండించి మీకు ఆహారం సమకూర్చి పెడ్తున్నాడు. కనుక ఈ యదార్థాలు తెలిసిన తరువాత మీరు ఇతర శక్తుల్ని అల్లాహ్ కు సాటి కల్పించకండి.

ఒకవేళ మా దాసునిపై అవతరింపజేసిన ఈ గ్రంథం గురించి మీకేదైనా అనుమానముంటే ఇందులోని అధ్యాయం లాంటి ఓ అధ్యాయం రచించి తీసుకురండి. ఈ పని కోసం ఒక్క అల్లాహ్ ను వదలి మీ మద్దతుదారులందర్నీ పిలుచుకోండి. మీరు సత్యవంతులైతే ఈ పని చేసి చూపండి. మీరీ పని చేయలేకపోతే.... ఎంతమాత్రం చేయలేరు... మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్యతిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి ఉంది. (అల్ బఖరహ్: 24-21)

ఓ ప్రజలారా!

ఓ మానవులారా! మీ ప్రభువు ఆగ్రహానికి దూరంగా ఉండండి. ప్రళయ భూకంపం చాలా తీవ్రమైన (భయంకర) విషయం. ఆరోజు పరిస్థితి చూడు... పాలుపట్టే ప్రతి స్త్రీ తన చంటిబిడ్డను సైతం మరచిపోతుంది. అలాగే ప్రతి గర్భిణికీ గర్భస్రావం అవుతుంది. ప్రజలు మైకంలో లేకపోయినా మైకంలో ఉన్నట్లు కన్పిస్తారు. నిస్సందేహంగా అల్లాహ్ శిక్ష చాలా కఠినంగా ఉంటుంది. కొందరు జ్ఞానం లేకుండానే అల్లాహ్ విషయంలో వాదిస్తారు. వారు తలబిరుసెక్కిన ప్రతి షైతాన్‌ని అనుసరిస్తారు. వాడి తలరాతలో తనతో స్నేహం చేసిన ప్రతి మనిషినీ వాడు మార్గభ్రష్టుడిగా చేసి, నరకందారి చూపిగాని వదలిపెట్టడని రాసిఉంది. (అల్-హజ్: 4-1)

ఓ మానవులారా! మీరు ప్రపంచంలో లభించే ధర్మసమ్మతమైన పరిశుద్ధపదార్థాలే తినండి. షైతాన్ అడుగుజాడలలో నడవకండి. వాడు మీకు ఆగర్భశత్రువు. మిమ్మల్ని వాడు దుష్టకార్యాలకు, అశ్లీల చేష్టలకు పురిగొల్పుతాడు. అల్లాహ్ విషయంలో మీకేమాత్రం తెలియని విషయాల్ని అల్లాహ్ పేర పలకమని మిమ్మల్ని పురిగొల్పుతాడు.

(అల్-బఖరహ్: 169-168)



ఓ ప్రజలారా!

ఓ మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. అదేప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. తిరిగి వారిరువురి నుండి అనేక మంది స్త్రీపురుషుల్ని ప్రపంచంలో విస్తరింపజేశాడు. మీరు ఒకరిద్వారా మరొకరు తమ అవసరాలు గడుపుకోవడానికి అల్లాహ్ పేరును ఒక సాధనంగా చేసుకుంటారు. అలాంటి అల్లాహ్ కు భయపడండి. రక్త సంబంధీకులతో మీకు ఏర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. నిశ్చయంగా అల్లాహ్ మీ చర్యల్ని గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి. అనాథలకు రావలసిన ఆస్తులు వారికి ఇచ్చివేయండి. వారికి దక్కవలసిన మంచి సొమ్ముకు బదులు నాసిరకం సొమ్ము అప్పగించకండి. వారి ధనాన్ని మీ ధనంతో కలిపేసి (లెక్కాపత్రం లేకుండా) తినకండి. అలా చేయడం ఘోరమైన పాపం. (అన్-నిసా: 2-1)

ఓ ప్రజలారా!

ఓ మానవులారా! పునరుజ్జీవం గురించి మీకేమైనా అనుమానముంటే, గుర్తుంచుకోండి... మాశక్తి మీముందు ప్రస్ఫుటం కావడానికి మేము (మొదట) మిమ్మల్ని మట్టితో సృజించాం. తర్వాత వీర్యబిందువు ద్వారా పుట్టించాం. ఆతర్వాత పిండంరూపంలో, ఆపై మాంసంతో. దాని రూపం అందంగా, అందవిహీనంగానూ ఉంటుంది. మేము తలచినదాన్ని గర్భాశయంలో ఒక నిర్ణీతకాలం వరకు ఆపి ఉంచుతాం. తర్వాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటికి తీస్తాం. (ఆ తర్వాత) మీరు పూర్తిగా యుక్తవయస్సుకు చేరుకోవడానికి (మిమ్మల్ని పోషిస్తున్నాం). అయితే మీలో కొందరిని ముందుగానే వెనక్కి పిలిపించు కుంటున్నాము. మరికొందరిని అన్నీ తెలిసిన తరువాత ఏమీ తెలియనంత సుదీర్ఘ వయస్సుకు చేర్చుతున్నాము.



నీవు భూమి పరిస్థితి చూస్తూనే ఉన్నావు. అది ఎండి బంజరు నేలగా మారుతుంది. తర్వాత మేము వర్షం కురిపించగానే సస్యశ్యామలమై ఉబ్బిపోతుంది. తర్వాత రమణీయ దృశ్యంతో రకరకాల చెట్లు, చేమల్ని మొలకెత్తిస్తుంది. వీటన్నిటికి మూలకారణం అల్లాహ్ మాత్రమే సత్యం. ఆయనే మృతుల్ని తిరిగి బ్రతికించేవాడు. ఆయన ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. కనుక ప్రళయం తప్పకుండా వస్తుంది. (చచ్చి) సమాధుల్లోకి పోయిన వారందర్నీ అల్లాహ్ తప్పకుండా (బ్రతికించి) లేపుతాడు.


మరికొందరు ఎలాంటి జ్ఞానం, మార్గదర్శకత్వం, (జ్ఞాన) కాంతి ప్రసాదించే గ్రంథం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుండి పెడదారి పట్టించడానికి అల్లాహ్ విషయంలో గుండెలు విరుచుకొని మరీ వాదిస్తుంటారు. అలాంటి వాడికి ప్రపంచంలో అవమానం, అప్రతిష్ఠలే మిగులుతాయి. ప్రళయదినాన మేమతనికి నరకాగ్ని యాతనలు చవిచూపిస్తాం. "ఇదే నీకోసం, నీ చేజేతులా సంపాదించి పంపుకున్నదాని ఫలితం. (అని అతనికి చెప్పబడుతుంది). (అల్-హజ్: 9-5)





ఓ మానవులారా! జిన్నులారా!! మీరు భూమ్యాకాశాల పరిధులు దాటి పారిపోగలరేమో ప్రయత్నించి చూడండి. దానికోసం అసాధారణ ప్రజ్ఞాపాటవాలు కావాలి. కనుక మీరు మీ ప్రభువులోని ఏ ప్రజ్ఞాపాటవాలు నిరాకరిస్తారు? (ఒకవేళ పారిపోవడానికి ప్రయత్నిస్తే,) మీపైకి అగ్నిజ్వాల, పొగ వదలి పెట్టబడతాయి. వాటిని మీరు ఏమాత్రం ఎదుర్కోలేరు. (అర్-రహ్మాన్: 35-33)

త్వరలోనే వారికి మా నిదర్శనాలు
దిజ్ఞ్మండలాల్లోనూ చూపిస్తాం;
వారి (దేహ నిర్మాణం)లోనూ
చూపిస్తాం. చివరికి ఈ ఖుర్‌ఆన్
సత్యవాణి అనే విషయం వారి ముందు
బట్టబయలవుతుంది. నీప్రభువు
ప్రతిదానికీ సాక్షిగా ఉన్నాడన్న సంగతి
చాలదా (వారికి)? (హామీమ్: 53)




2 మనిషిని సంబోధించే ఖుర్‌ఆన్ లోని కొన్ని ఆయతులు

పవిత్ర ఖుర్‌ఆన్ ప్రత్యేకతలలో ఒకటి, అది మానవులను నేరుగా సంబోధిస్తుంది. కొన్నిసార్లు జీవిత పరీక్షలో గెలవడానికి అతను తప్పనిసరిగా శ్రద్ధ వహించాల్సిన విషయాల గురించి అది అతన్ని హెచ్చరిస్తుంది. కొన్నిసార్లు తనలోని లోతైన కోరికలు మరియు సంకల్పాల గురించి చెబుతుంది. కొన్నిసార్లు తను తన తల్లి కడుపులో ఉండడానికి ముందు అతని పరిస్థితి మరియు దశల గురించి ఆలోచించమని అతన్ని ప్రేరేపిస్తుంది. కొన్నిసార్లు తన స్వయం గురించి అంతర్దృష్టిని కేంద్రీకరించాలని ఉద్బోధిస్తుంది. కొన్నిసార్లు అతనిపై ఎడతెరపి లేకుండా కురిసే అల్లాహ్ అనుగ్రహాల గురించి విశద పరుస్తుంది. ఇక ఖుర్‌ఆన్ ప్రబోధనల్ని శ్రద్ధగా విని, సారాంశాన్ని గ్రహించి – తనను సంబోధిస్తున్నది సర్వలోక సృష్టికర్త అన్న యదార్థాని గుర్తెరిగి వాటికనుగుణంగా తన జీవితాన్ని మలచుకున్న వారే నిజమైన విజ్ఞులు, వివేచనాపరులు.

మానవుడా! నీవు (జీవితసత్యం గురించి ఆలోచించకుండా ఐహిక కార్యకలాపాల్లో) ఎంత నిమగ్నుడవయిఉన్నా, నీ పయనం మాత్రం నీ ప్రభువు వైపుకే నిరాఘాటంగా సాగిపో తోంది. చివరికి ఆయన సన్నిధికే నీవు చేరుకోవలసి ఉంటుంది. (అల్-ఇన్_షిఖాఖ్: 6)

మానవుడు దేనికోసం కృషిచేస్తాడో అదే అతనికి లభిస్తుంది. అతని కృషికి త్వరలోనే గుర్తింపు లభిస్తుంది. అతనికి దాని ప్రతిఫలం పూర్తిగా ఇవ్వబడుతుంది. చివరికి (మానవులంతా) నీ ప్రభువు సన్నిధికే మరలిపోవలసి ఉంది. (అన్-నజ్మ్: 42-39)

మానవుడు తన శ్రేయస్సు కోసం ఎంత వేడుకున్నా అలసిపోడు. కాని ఎప్పుడైనా కాస్తంత కష్టం వస్తేచాలు, నిరాశతో క్రుంగిపోతాడు.(హామీమ్: 49)



ఓ మానవుడా!

మానవుడా! దయామయుడైన నీ ప్రభువుని గురించి నిన్నేవిషయం మోసంలో పడ వేసింది? ఆయన నిన్ను పుట్టించి, నీ అవయవాలు పొందికగా అమర్చాడు. నిన్ను తగిన విధంగా రూపొందించాడు. తాను తలచిన రీతిలో నిన్ను (అందంగా) మలిచాడు. (అల్-ఇన్_ఫితార్: 8-6)

మేము మానవునికి తన తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన కలిగివుండాలని ఆదేశించాం. అతని తల్లి అతడ్ని ఎంతో శ్రమకోర్చి తన గర్భంలో పెట్టుకొని మోసింది. ఎంతో శ్రమపడి అతడ్ని కన్నది. అతడ్ని గర్భంలో పెట్టుకొని మోయడానికి, ఆ తర్వాత పాలు మాన్పించడానికి ముప్ఫయి నెలలు పట్టింది. చివరికతను పూర్తిగా శక్తిమంతుడవుతాడు. (అలా) నలభై యేళ్ళ ప్రాయానికి చేరుకున్న తర్వాత అతను (దేవుడ్ని) ఇలా ప్రార్థిస్తాడు:

"ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేళ్ళకు నేను నీపట్ల కృతజ్ఞుడయి ఉండే సద్బుద్ధి ప్రసాదించు. నీ ప్రసన్నతాభాగ్యం లభించేటటువంటి సత్కార్యాలు చేసే సద్బుద్ధి కూడా ప్రసాదించు. నా సంతానాన్ని కూడా సజ్జనులుగా చేసి నాకు సుఖాన్నివ్వు. నేను నీకు విధేయుణ్ణయిన దాసుడ్ని. నా పాపాలకు నేను పశ్చాత్తాపపడుతూ నన్ను క్షమించమని నీ సన్నిధిలో వేడుకుంటున్నాను." (అల్-అహ్_ఖాఫ్:15)




కాబట్టి అల్లాహ్ ఎంతో శుభకరుడు. ఆయన
నిర్మాతలందరిలో కెల్లా గొప్ప ప్రతిభాశాలి.

(అల్-మోమినూన్: 13)

నిరాఘాటంగా సాగుతున్న కాలవాహినిలో మానవునికి తానొక గడ్డిపోచ విలువ కూడా లేనివాడిగా ఉండిన సమయం ఎప్పుడైనా ఎదురయిందా? మేము మానవుడ్ని పరీక్షించడానికి ఒక మిశ్రమబిందువుతో పుట్టించాం. దానికోసం మేమతడ్ని వినేవాడిగా, చూసేవాడిగా రూపొందించాం. అతనికి మేము సన్మార్గం కూడా చూపించాం. అతను సన్మార్గం అవలంబించి (మాపట్ల) కృతజ్ఞుడై ఉన్నా లేక (అవిశ్వాస వైఖరి అవలంబించి) కృతఘ్నుడైపోయినా (అంతా అతని ఇష్టాయిష్టాలపై వదలిపెట్టాము). (దహర్: 3-1)


మానవుడు తాను ఎలాంటి పదార్థంతో పుట్టించబడ్డాడో కాస్త ఆలోచించాలి. వెన్నుముకకు, ప్రక్కటెముకలకు మధ్య నుండి దూకుడుగా వెలువడే ద్రవపదార్థంతో పుట్టించ బడ్డాడు. (అలాగే) అతడ్ని మళ్ళీ బ్రతికించే శక్తి కూడా ఆ సృష్టికర్తకు ఉంది. రహస్య విషయాలు(సైతం) బయటపెట్టి విచారణ జరిపే రోజున మానవుని దగ్గర తనదంటూ ఎలాంటి శక్తి ఉండదు. అతడ్ని ఆదుకునేవారు కూడా ఉండరు. (అత్-తారిఖ్: 10-5)






స్వయంగా మీ (అస్తిత్వం)లో కూడా అనేక సూచనలు ఉన్నాయి. మీరీ విషయాన్ని గురించి యోచించరా? (అజ్-జారియాత్: 21)


మేము మానవుడ్ని సృజించాం. అతని
అంతరంగంలో మెదిలే ఆలోచనలు
సైతం మాకు తెలుసు. మేమతనికి అతని
కంఠనాళంకన్నా అతి సమీపంగా ఉన్నాం.
(ఖాఫ్: 16)



మేము మానవుడ్ని ఎంతో ఉత్కృష్టజీవిగా సృజించాం. తర్వాత మేమతడ్ని (సత్యనిరాకరణ వల్ల) వెనక్కి తిప్పి అతి నికృష్ట జీవిగా మార్చివేశాం.అయితే సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారిని ఈ నికృష్టత్వం నుండి తప్పించాం. (అత్–తీన్: 6–4)



మానవాత్మ సాక్షి! దాన్ని తీర్చిదిద్ది పాపపుణ్యాల్ని గురించి తెలిపినవాడి సాక్షి! నిస్సందేహంగా ఆత్మప్రక్షాళన చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచిపెట్టినవాడు నాశనమవుతాడు. (అష్-షమ్స్: 10-7)



మేము మిమ్మల్ని ఎలాంటి లక్ష్యం లేకుండా వృధాగా పుట్టించామని భావించారా? మీరు మా దగ్గరికి రావలసి ఉండదని అనుకున్నారా?”


(అల్-మోమినూన్: 115-112)

(చనిపోయాక మళ్ళీ బ్రతికించబడటం కల్ల అనే మీ అభిప్రాయం) ఎంతమాత్రం (నిజం) కాదు. మనిషి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నప్పుడు "మంత్రించే వారెవరైనా ఉన్నారా?" అంటారు జనం. ఆ మనిషి ఇక తాను ఇహలోకం వీడిపోయే సమయం ఆసన్నమయిందని అనుకుంటాడు. కష్టాల మీద కష్టాలు వచ్చిపడతాయి. అదే నీ ప్రభువు సన్నిధికి బయలుదేరవలసిన రోజు. అయితే అతను (ఈ) సత్యాన్ని అంగీకరించలేదు. ప్రార్థన (నమాజ్) చేయలేదు. పైగా సత్యాన్ని నిరాకరించి (దేవునిపై) తిరగబడ్డాడు. ఆ తరువాత నిక్కుతూ, నీల్గుతూ తన ఇంటికి వెళ్ళిపోయాడు.

ఈ వైఖరి ఎంతో శోచనీయం. ఇది నీకే శోభిస్తుంది. ఔను ఈ వైఖరి ఎంతో శోచనీయం. ఇది నీకే శోభిస్తుంది. మానవుడు తనను ఇట్టే వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నాడా? అతను మొదట (స్త్రీగర్భంలో) కార్చబడిన క్షుద్రబిందువుగా లేడా? తర్వాత ఒక నెత్తుటి ముద్దలా రూపొందాడు. ఆతర్వాత దేవుడు అతనికి దేహంనిర్మించి తగిన అవయవాలు పొందికగా అమర్చాడు. ఆపై అతని నుండి రెండు వేర్వేరు జాతులుగా స్త్రీ పురుషుల్ని పుట్టించాడు. ఇదంతా చేసినవాడు చనిపోయినవాడ్ని మళ్ళీ బ్రతికించలేడా?

(అల్-ఖియామహ్ : 40-26)





నాగరికత అంటే – జీవితపు అన్ని అంగాల్లోనూ అన్ని రంగాల్లోనూ పురోగతి ద్వారా సమాజం సాధించిన అభివృద్ధిని, ఆ సమాజపు అధునాతన దశను నాగరికత అనంటారు. ఇందులో సామాజిక, ఆర్థిక, మేధో పరమైన, శాస్త్రీయ మరియు సాంకేతిక పురోగతి ఇమిడి ఉంటుంది. ఇదే ఇస్లామీయ నాగరికతకు ఖచ్చితమైన నిర్వచనం. ఇస్లామీయ నాగరికత ఆధునిక శాస్త్రాలలో స్పష్టమైన పునాదులు వేసింది. వైద్య రంగంలో, శరీర నిర్మాణ శాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఆప్టిక్స్, గణితం, తత్వశాస్త్రం మరియు ఖగోళ శాస్త్రాలలో గొప్ప పురోగతిని సాధించింది.

నాల్గవది

ఇస్లాం గొప్ప నైతికత, అద్భుత నాగరికత గల సంపూర్ణ జీవన సంవిధానం

ధర్మస్వీకరణలో ఎలాంటి బలవంతం, బలాత్కారాలు లేవు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరు చేయబడింది. కనుక ఇకనుండి మిథ్యాదైవాలను నిరాకరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు ఎన్నటికీ ఏమాత్రం చెక్కుచెదరని దృఢమైన ఆశ్రయం పొందినట్లే. నిశ్చయంగా అల్లాహ్ సర్వం వింటాడు, సమస్తం తెలిసినవాడు.

(అల్–బఖరహ్: 256)

నీ ప్రభువు తలిస్తే భూవాసులంతా (సత్యాన్ని) విశ్వసించేవారు. కాని నీవు ప్రజల్ని బలవంతంగా విశ్వాసులుగా మార్చదలిచావా? (యూనుస్: 99)

నేడు విశ్వవ్యాప్తంగా ముస్లింల సంఖ్య 1.8 బిలియన్లకు మించిపోయింది. వారిలో అరబ్బులు 15% శాతం మాత్రమే.

అధ్యాయం 9

ఇస్లాం మానవాళికి చేసిన మేలేమిటి?

1 ముక్తసరిగా ముందు మాట

★ ఇస్లాం ధర్మం – మానవాళికి వారి నిజ ప్రభువును పరిచయం చేసింది. వారు ఆయన్ను మాత్రమే ఆరాధించాలని, ఆయనతోపాటు అన్యులను సాటి సహవర్తులుగా చేసి కొల్వకూడదు అని తాకీదు చేసింది, మానవాళిని మార్గభ్రష్టత్వం నుండి కాపాడటానికి, వారికి ఇహపరాల శ్రేయోసాఫల్యాలను ప్రసాదించడానికి ప్రజలందరి ప్రభువు ఆయిన అల్లాహ్ తరపు నుంచి మార్గదర్శక సందేశాన్ని తీసుకు వచ్చింది. ఈ భూ ప్రపంచంలో – కేవలం సృష్టికర్తను మాత్రమే ఆరాధినాచాలి అని తాకీదు చేసే, షిర్క్ రహిత ధర్మం ఒక్క ఇస్లాం తప్ప మరొకటి లేదు అంటే అది ఎంత మాత్రం అతిశయోక్తి కాదు.

★ ఇస్లాం ధర్మం – మానవాళికి – వారి తాత్కాలిక నివాసమైన ప్రాపంచిక జీవిత వాస్తవికత గురించి చక్కగా వివరించింది. ఇది తాత్కాలిక తటాకమే గానీ, శాశ్వత నివాసం కాదు. మరణానంతరం – అందరూ వారందరి సృష్టికర్త వైపునకు తిరిగి వెళ్ళవలసి ఉంటుంది అని, అక్కడ ఆయన సమక్షంలో వారి కర్మలకుగానూ లెక్క ఇచ్చుకోవాల్సి ఉంటుందని అని అది హెచ్చరిస్తుంది. ఈ కారణంగానే ఇస్లాం – మరణానంతరం మనిషికి పనికొచ్చే మంచి పనులు చేయమని ప్రజల్ని ప్రోత్సహిస్తుంది. వారి ఈ ప్రవర్తన వారి జీవితం మీద ఫలవంత ప్రభావం చూపుతుంది, తద్వారా వారి సామాజిక, నైతిక, ఆర్థిక అన్ని రంగాలు అత్యద్భుతంగా అభివృద్ధి బాటన పయనిస్తాయి.

★ ఇస్లాం ధర్మం – మానవాళిని – దాసుల దాస్యం నుండి వెలికి తీసి – ఒకే నిజ దేవుని దాస్యం వైపునకు నడిపిస్తుంది. అదే సమయంలో మనం ప్రపంచ ఇతర సమాజాలను, మతాలను గమనించినట్లయితే – నేటికీ వారిలో ఈ దురాచారం వేళ్ళూనుకొని ఉంది.. ఇస్లాం ప్రపంచ ప్రజలందరి ధర్మం. వారి భాషలు వేరైనా, వారి రంగు, రూపు వేరైనా, వారి రాతారీతులు వేరైనా – వారు నల్లవారయినా, తెల్లవారయినా, అరబ్బులయినా, అరబ్బేతరులయినా – ఎవ్వరికి ఎవ్వరి మీద ఎలాంటి

ఆధిక్యత, అధికారం లేదు – ఒక్క దైవభీతితో తప్ప. ఒక్క సదాచారణతో తప్ప. దైవ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: మీరందరూ ఆదమ్ (అ) నుండి, ఆదమ్ మట్టి నుండి పుట్టించబడ్డారు. (తిర్మిజీ)

> ఓ మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాం. తర్వాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞాని, సమస్త విషయాలు తెలిసినవాడు. (అల్–హుజూరాత్: 13)

* ప్రపంచ మానవాళి సమస్యలను పరిష్కరించడానికే ఇస్లాం ధర్మ ఆవిర్భావం జరిగింది. బ్రిటిష్ చరిత్రకారుడు మరియు రచయిత కరెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ యొక్క "Muhammad, a Prophet for our Time" "ముహమ్మద్ (స) మన కాలానికి ప్రవక్త" అన్న పుస్తకాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాము. ముఖ్యంగా వారు – ఇస్లాం మరియు ప్రవక్త (స) వారి బోధనలను మానవ నిర్మిత చట్టాలతో పోల్చి చూసిన తర్వాత. న్యాయాన్ని స్థాపించడంలో, అన్యాయం, అవినీతి, పేదరికాన్ని నిర్మూలించడంలో, వ్యాధులను నివారించడంలో, సమాజాలను సంస్కరించడంలో ఇస్లామీయ బోధనల సామర్థ్యాన్ని బాగా పరిశీలించిన తర్వాత తప్పొప్పుల నిర్ధారణను పాఠకుల ప్రజ్ఞకే వదిలేస్తున్నాము.

* ఇస్లాం మానవాళికి ప్రయోజనం చేకూర్చే నైతిక మరియు భౌతిక నాగరికతను తీసుకు వచ్చింది మరియు ప్రపంచవ్యాప్తంగా సైన్స్ పురోగతికి కారణం అయింది. ఇది మానవ చరిత్రలోనే ఒక మేలిమి మలుపు. ఈ అధ్యాయంలో దీని వివరాలు ఉంటాయి.

* ఇస్లాం ప్రతి కాలానికి, ప్రతి ప్రదేశానికి సరిపోయే ఆకాశ గ్రంథం గల ధర్మం. ఈ మహద్గ్రంథం దాని ముందు ఉన్న తౌరాత్, సువార్త వంటి ఆకాశ గ్రంథాలను ధృవీకరిస్తుంది. అయితే అది (పదం మరియు అర్థ పరంగా) అల్లాహ్ వాక్యాన్ని కలిగి, ఎలాంటి మార్పుచేర్పులను, మానవ కల్పితాలకు గురి కాకుండా సురక్షితంగా ఉంది గనక – ఇతర ఆకాశ గ్రంథాలకంటే దీనికి ఓ ప్రత్యేక స్థానం. ఈ మహద్గ్రంథం, (పవిత్ర ఖురాన్‌లో) ప్రజలకు మార్గదర్శకత్వం ఉంది. అది భూమిపై ఉన్న ప్రజలందరికీ న్యాయం, శాంతి, శ్రేయోసాఫల్యాలను సాధించడానికి మెరుగైన జీవన విధానాలను వారికి నిర్దేశిస్తుంది.

2 ఇస్లాం సత్యం, న్యాయాల ధర్మం

అజ్ఞానం, అంధకారం సర్వత్రా తాండివిస్తున్న సమయంలో ఇస్లాం ఆవిర్భావం జరిగింది. అప్పట్లో ప్రజలను బానిసలుగా చేసుకోవడం, మానవ హక్కుల స్వాహా సర్వసాధారణంగా ఉండేది. బలవంతులు బలహీనులపై ఆధిపత్యం చెలాయించేవారు. అది న్యాయ నియమాలను స్థాపించింది. బానిసలను విముక్తి చేయాలని, ప్రజల హక్కులను కాపాడాలని, అణగారిన వారికి, బడుగు బలహీన ప్రజలకు మద్దతు ఇవ్వాలని అది మానవాళిని ప్రేరేపించింది, ప్రోత్సహించింది. ఈ విశిష్టల కారణంగానే – ఇస్లాం ధర్మం ఆఫ్రికాలో, ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో సులభంగా వ్యాపించింది. ఎందుకంటే, ఇది ప్రజలను బానిసలుగా మార్చడానికి వ్యతిరేకించింది, ఖండించింది, ఆ పూర్తి దుర్వ్యవస్థనే నిర్మూలించింది. అలాగే స్వయంగా ఆయా ప్రాంత, దేశ ప్రజలు ఇస్లాం ధర్మ ఛత్రఛాయల్లోనే ప్రజలందరి కోసం న్యాయం మరియు జాతి సమానత్వాన్ని దర్శించుకున్నారు. ఇస్లాంను స్వీకరించిన వారిలో చాలా మంది స్త్రీలు ఉన్నారు. ఎందుకంటే వారు, స్త్రీలకు హక్కులు, వారి విధులు, వారసత్వం మరియు గౌరవానికి సంబంధించిన దైవిక న్యాయాన్ని అందులో చూశారు గనక.

నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని న్యాయంగా వ్యవహరించాలని, మేలు చేయాలని, బంధువుల పట్ల దయతో మెలగాలని ఆదేశిస్తున్నాడు. చెడు, అశ్లీలం, దౌర్జన్యాల జోలికి పోకూడదని వారిస్తున్నాడు. మీరు విషయం గ్రహించడానికి అల్లాహ్ మీకిలా ఉపదేశిస్తున్నాడు. (అన్–నహల్: 90)

నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు: ఎవరైనా మిమ్మల్ని నమ్మి ఏదైనా వస్తువుని మీ దగ్గర భద్రపరిస్తే తిరిగి వారికి సురక్షితంగా అప్పగించండి. ప్రజల మధ్య ఏదైనా వ్యవహారం తీర్చవలసివస్తే న్యాయంగా తీర్చండి. నిశ్చయంగా అల్లాహ్ మీకు ఎంత మంచి హితోపదేశం చేస్తున్నాడో! నిశ్చయంగా అల్లాహ్ సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. (అన్–నిసా: 58)

* అనాథ హక్కుల సంరక్షణ

ఇస్లాం ధర్మం – అనాథలను సంరక్షించాలని, వారు పెరిగి పెద్దవారయి తమ వ్యవహారాలను స్వయంగా చూసుకోగల సామర్థ్యం పొందే వరకు వారి హక్కులను కాపాడాలని గట్టిగా తాకీదు చేస్తుంది. దైవశాసనంగా ఖుర్‌ఆన్ లోని అనేక ఆయతులు అనాథ సంపదను సంరక్షించమని చెబుతూనే , అన్యాయంగా, అక్రమంగా వారి సంపదను కాజేయకూడదని హెచ్చరిస్తాయి కూడా. దైవప్రవక్త (స) వారు సయితం ముస్లింలను – అనాథలను మంచిగా చూసుకోవాలని, వారి పోషణా బాధ్యతను స్వీకరించాలని, వారు పెరి గి పెద్దయ్యేంత వరకూ వారి బాగోగులను గమనించాలని ముస్లిం జనావళిని ప్రోత్సహించారు. ఆయన ఇలా అన్నారు;

"నేను మరియు ఒక అనాథ పోషణ బాధ్యతను స్వీకరించిన వ్యక్తి రేపు స్వర్గంలో ఇలా ప్రక్కప్రక్కనే ఉంటాము" అని తన రెండువేళ్ళను ఆయన కాస్త దగ్గర చేసి చూపించారు. (బుఖారీ)



* ఆదేశాలలో సమగ్ర తీర్పు, న్యాయం - తుఅమః మరియు యూద వ్యక్తి గాథ

తుఅమా బిన్ అబిరక్ అనబడే ఓ వ్యక్తి ఒక కవచాన్ని దొంగిలించాడు, దాని యజమాని అది దొంగిలించబడిందని గుర్తించినప్పుడు, తుఅమా దానిని తన యూద స్నేహితుడి దగ్గర దాచి పెట్టాడు. తాను దానిని దొంగిలించలేదని ప్రమాణం చేశాడు. కాబట్టి ప్రజలు ఆ కవచం ఎక్కడుందో వెతకనారంభించారు. చివరికి యూదుడి వద్ద కవచాన్ని కనుగొన్నారు. కాబట్టి అతనే దానిని దొంగిలించాడని ఆరోపించారు. కానీ యూదుడు – తాను నిర్దోషి అని, తుఅమా బిన్ అబిరక్ – తనే నాకు డాలు ఇచ్చాడని వారికి చెప్పాడు.



కవచం యూదుని ఇంట్లో దొరికింది గనక – తుఅమాను నిర్దోషిగా ప్రకటించాలని అతని తెగవారు (అరబ్బులు అయిన బనూ జాఫర్) దైవ ప్రవక్త (స) వారిని కోరారు. సత్య ప్రకటన కోసం, న్యాయ స్థాపన కోసం దైవవాణి అవతరించింది. అదే తర్వాతి తరాలకు ఆదర్శం, మరియు గుణపాఠం అవ్వాలని. ఆ వాణిలో – యూద వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించి, తుఅమా మీద నేర నిర్ధారణను రుజువు చేసింది. (చూడండి: తఫ్సీర్ అల్-తబరీ 9/182)

ముహమ్మద్! నిశ్చయంగా మేము నీకు చూపిన మార్గం అనుసరించి నీవు ప్రజల వ్యవహారాలు పరిష్కరించడానికి మేము సత్యపూరితమైన గ్రంథం నీపై అవతరింపజేశాం. కనుక నీవు నీతిలేని వారివైపు నిలబడి వాదించకు. (అన్-నిసా: 105)

3 శాంతి కరుణల ధర్మం ఇస్లాం

★ అల్లాహ్ తనను అనంత కరుణామయుడు, అపార దయానిధి అని సంబోధించాడు. ముస్లింలు వారి రోజు వారి ప్రార్థనల్లో ఖుర్‌ఆన్ పారాయణం ద్వారా "అర్రహ్మానిర్రహీమ్" ఆయతును అనేక సార్లు పఠిస్తారు.

★ మహోన్నతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి గురించి చెప్పిన మాట: "ఓ ముహమ్మద్! (స) మేము నిన్ను సమస్త లోకాల పాలిట మూర్తీభవించిన కారుణ్యంగా చేసి పంపాము". (అన్బియా: 107)

దీన్ని బట్టి – ఇస్లాం ధర్మం పురుషులు–స్త్రీల కోసం, పిన్నలు పెద్దల కోసం, పశుపక్ష్యాదుల కోసం, జలచరాలు, చరచరాల కోసం, చెట్టుచేమల కోసం, వాగువంకలు కోసం, పర్వతం – సముద్రాల కోసం సంపూర్ణ కారుణ్యం.

★ హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (ర) గారి ఉల్లేఖనం – నేను అబూ హురైరా (ర) గారిని ఇలా చెబుతూ విన్నాను: మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "నిశ్చయంగా అల్లాహ్ కరుణ భాగాలు వంద. వాటిలో నుండి ఒక భాగాన్ని మాత్రమే మానువులు, జిన్నులు, చతుష్పాదులు, చరాచరాలన్నింటి మధ్య అవతరింపజేశాడు. రేపు ప్రళయ దినాన తన దాసుల్ని కరుణించడానికిగానూ తన కరుణకు సంబంధించిన 99 భాగాలను ఎత్తి పెట్టాడు". (ముత్తఫఖున్ అలైహి)

★ దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: మాలోని పిన్నల మీద దయ చూపని వాడు, మాలోని పెద్దలను గౌరవించనివాడు మాకు చెందినవాడు కాదు". (తిర్మిజీ)

★ దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: ఎవరైతే ఒక విశ్వాసికి సంబంధినచిన ప్రాపంచిక ఒక ఆపదను దూరం చేస్తారో – ప్రతిగా అల్లాహ్ వారికి సంబంధించిన ఆపదల్లోని ఓ ఆపదను దూరం చేస్తాడు. ఎవరైతే కష్ట స్థితిలో ఉన్న ఓ వ్యక్తికీ సౌలభ్యం కలుగజేస్తారో – అల్లాహ్ వారికి సంబంధించిన కష్ట స్థితిని ఇహపరాల్లో సులభతరం చేస్తాడు. ఎవరైతే ఒక విశ్వాసి (బలహీనతల) మీద పరదా వేస్తారో, అల్లాహ్ ఇహపరాల్లో వారి దౌర్బల్యాల మీద పరదా వేస్తాడు. ఒక వ్యక్తి తన సోదరునికి సహాయం చేయడంలో నిమగ్నమయి ఉన్నంత కాలం అల్లాహ్ అతని అవసరం తీరుస్తూ ఉంటాడు. (ముస్లిం)

★ దైవప్రవక్త (స) ఇలా అన్నారు: ఒక మహిళను – మరణించేంత వరకూ పిల్లిని బంధించి హింసించినందుకు శిక్షించడం జరిగింది. ఆమె స్వయంగా ఆ మూగ ప్రాణికి తినడానికి, త్రాగడానికి ఏమి పెట్టేది కాదు, అది ఎక్కడైనా వెళ్లి భూమి మీద ఉండే తన ఆహారాన్ని తినాలంటే – వదలి పెట్టేది కాదు. (బుఖారీ, ముస్లిం)

ప్రవక్తా! (వారికి నా మాటలుగా) ఇలా చెప్పు: "ఆత్మవంచనకు పాల్పడిన ఓ నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ తప్పకుండా మీ పాపా లన్నిటినీ క్షమిస్తాడు. నిశ్చయంగా ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. (అజ్–జుమర్: 53)

కాబట్టి మా సూక్తుల్ని విశ్వసించినవారు నీ దగ్గరకొస్తే "మీకు శాంతి కల్గుగాక!" అని వారిని దీవించు. నీ ప్రభువు దయాదాక్షిణ్యాలను (విశ్వసించిన దాసులపై కురిపించడాన్ని) తన కర్తవ్యంగా చేసుకున్నాడు. మీలో ఎవరైనా అజ్ఞానంతో ఏదైనా పాపకార్యం చేసి, ఆ తరువాత పశ్చాత్తాపంతో (దేవుడ్ని) మన్నింపు వేడుకొని తనను తాను సరిదిద్దుకుంటే అల్లాహ్ అతడ్ని క్షమిస్తాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. పాపాత్ముల వైఖరి స్పష్టంగా వెల్లడి కావడానికి ఇలా మేము మా సూక్తుల్ని విడమరచి తెలియజేస్తున్నాం. (అల్–అన్‌ఆమ్: 54)

★ అస్సలామ్ "శాంతి ప్రదాత" అనేది అల్లాహ్ అందమైన పేర్లలో ఒకటి. ఇస్లాం మిమ్మల్ని మీ సృష్టికర్తతో కలుపుతుంది. కాబట్టి మీ ఆత్మ ఆయన అనుబంధంతో శాంతిస్తుంది. అలాగే మీకు తోటి ప్రజలకు, మీరు నివసించే పరిసరాలకు మధ్య సదవగాహన, సుహృద్భావన, శాంతి పూర్వక వాతావరణం ఏర్పడుతుంది.



★ దైవ ప్రవక్త (స) తన నమాజు ముగియగానే – మూడు సార్లు అస్తగ్ఫిరుల్లాహ్" చెప్పిన తర్వాత – "అల్లాహుమ్మ అంతస్సలాము వ మిన్కస్సలాము తబారక్త యా జల్ జలాలి వల్ ఇక్రామ్" అని దుఆ చేసేవారు.

★ శాంతి అనే పదం ముస్లింలు ఒండొకరికి చేసుకునే అభివాదంలో అవిభాజ్యాంశం. "అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహు" మీపై శాంతి కురియుగాక! అల్లాహ్ కృప, శుభాలతో మీరు సదా వర్ధిల్లుగాక!

★ ప్రత్యర్థులు శాంతి వైపు మొగ్గు చూపితే శాంతి ఒప్పందం చేసుకోవాలన్నది ఖుర్ఆన్ ఆదేశం. అల్లాహ్ ఇదే విషయాన్ని విశ్వాసులకు ఆజ్ఞాపించాడు. ఇస్లామీయ చరిత్రలో గొప్ప విజయాలు శాంతియుతంగా సాధించబడ్డాయి. ఉదాహరణకు – యుద్ధం లేకుండా మక్కాను జయించడం మరియు జెరూసలెం (ఖుద్స్)లోకి ప్రవేశించడం – మొదలయినవి.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) గారి కథనం – దైవ ప్రవక్త (స) సైనిక చర్యల కోసం సేనను ఎక్కడికయినా పంపాలనుకున్నప్పుడు – వారినుద్దేశించి ఇలా ఉపదేశించేవారు; "అల్లాహ్ పేరు తీసుకొని బయలుదేరండి. యుద్ధంలో పాల్గొనని వృద్ధుల్ని వధించకండి, చిన్న పిల్లలను వధించకండి, మహిళలను వధించకండి, యుద్ధ ప్రాప్తిలో అక్రమానికి పాల్పడకండి. యుద్ధ ప్రాప్తిని భద్ర పర్చండి, మిమ్మల్ని మీరు సంస్కరించుకోండి, మీ స్థితిని బాగు చేసుకోండి, ఒండొకరి యెడల ఉత్తమంగా వ్యవహరించండి. మంచి చేయండి. నిశ్చయంగా అల్లాహ్ మంచి చేసేవారిని ప్రేమిస్తాడు. (అబూ దావూద్)

4 ఇస్లాం న్యాయం మరియు సమతౌల్యం గల ధర్మం

ఇస్లాం న్యాయ స్థాపనకై పిలుపునిస్తుంది. మేధో పరమైన, ప్రవర్తన పరమైన అతివాదాన్ని, మంకుతనాన్ని అది తిరస్కరిస్తుంది. ఇస్లాం జీవితానికి సంబంధించిన అన్ని అంగాల్లోనూ అన్ని రంగాల్లోనూ దుబారాను మితిమీరి ప్రవర్తించడాన్ని ఎండగడుతుంది. తినడం–త్రాగడంలో, బల ప్రదర్శన మరియు సహజ వనరుల వినియోగంలో మీరు మితహిత ధర్మాన్ని పాటించాలని నేర్పుతుంది.

> దుబారా ఖర్చు చేయకండి. నిశ్చయంగా దుబారా ఖర్చు చేసేవారు సైతాన్ సోదరులుగా పరిగణించబడతారు. సైతాన్ తన ప్రభువుకు కృతఘ్నుడైపోయాడు. (ఇస్రా: 27–26)
>
> ఈవిధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాము, మీరు ప్రపంచ ప్రజలకు సాక్షులుగా ఉండాలని, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని. (అల్–బఖరహ్: 142)

దైవ ప్రవక్త (స) ధర్మ విషయంలో మౌఢ్యాన్ని, కరకుదనాన్ని అసహ్యించుకునేవారు. దైవ ప్రవక్త (స) ప్రతి విషయంలోనూ – అది పాపం కానంత వరకూ సౌలభ్యాన్ని ఇష్ట పడేవారు. ఆయన వద్దకు ఏదేని రెండు విషయాలు తీసుకొచ్చినప్పుడు – అది పాపం కానంత వరకూ ఆయన సులభమైన విషయం వైపునకు మొగ్గు చూపేవారు. ఆయన ఏదేని ఒక అభిప్రాయ విషయంలో అది అల్లాహ్ హక్కు అయితే తప్ప కఠినంగా ఉండేవారు కాదు. అలాగే ఆయన ప్రజల నేర్పిన విషయం ఏమిటంటే, ధర్మం అంటే కేవలం – అఖీదా మరియు ఆరాధనా వరకే పరిమితం కాదు, జీవన పూర్తి విధానం. తన స్వయంతోగానీ, ఇతర ప్రజలతో గానీ సానుకూల దృక్పథం కలిగి ఉండాలని, పశుపక్ష్యాదులు, చెట్లుచేమలు పట్ల సయితం సద్భావం, సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆయన తాకీదు చేశారు.

> దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: నిశ్చయంగా ధర్మం సులువయినది. ఒకరు ధర్మం విషయంలో మౌఢ్యంగా వ్యవహరిస్తే – ధర్మమే నెగ్గుతుంది. కనుక మీరు సన్మార్గంపై నడవండి. మధ్యేమార్గాన్ని అనుసరించండి. మీ ప్రభువు తరపు నుండి లభించే పుణ్యానికి సంబర పడండి. ఉదయం, సాయంత్రం ఇంకా రాత్రిపూట కొంత సేపు (ఆరాధన చేయటం) ద్వారా ఆయన సహాయాన్ని అర్థించండి. (బుఖారీ)

యదార్థం, వివేకం, సభ్యత, సంతులనం

* దైవ ప్రవక్త (స) యదార్థ దృక్పథం, గొప్ప విజ్ఞత, వివేకం గలవారు. ఈ విశిష్ట లక్షణాలే ఆయన్ను హృదయాల విజేతగా, గొప్ప అధినాయకునిగా చేశాయి. ప్రజలు ఆయన్ను ఇష్టపడేవారు, ఆయన యుక్తి, విజ్ఞత, వివేకాలతో సంతృప్తి చెందేవారు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బను ఖురైజా యుద్ధంలో ముస్లింలను ఇలా ఆదేశించారు: "మీలో ఎవరూ బనూ ఖురైజా ఉన్న ప్రాంతంలో తప్ప అస్ర్ ప్రార్థన చేయకూడదు." (బుఖారీ) వారిలో కొందరు సూర్యాస్తమయానికి ముందే బనూ ఖురైజాకు చేరుకుని అక్కడ అస్ర్ నమాజు చేసుకున్నారు. కొందరు ప్రార్థన వేళ తప్పిపోతారనే భయంతో మరియు సూర్యాస్తమయ సమయం దగ్గర పడిందన్న భయంతో వారి స్థానంలో అస్ర్ ప్రార్థనను పూర్తి చేసుకున్నారు. దైవ ప్రవక్త (స) ఈ వివాదాన్ని ఎంతో చాకచక్యంగా పరిష్కరించారు. ఇరు వర్గాల ఈ ప్రతిచర్యను సమర్థించారు, ఏ ఒకరి అభిప్రాయాన్ని తప్పు పట్ట లేదు.

* జాత్ అల్–సలాసిల్ యుద్ధంలో, వాతావరణం చాలా చల్లగా ఉన్నప్పుడు, కమాండర్ అమ్ర్ ఇబ్న్ అల్–ఆస్ (ర) స్వప్నస్థలనం అయింది. ఆయన స్నానం చేయలేదు, వుజూ చేయలేదు. ఒట్టి తయమ్ముమ్ చేసి ప్రజలకు ఫజ్ర్ నమాజు చేయిపించాడు. ఆయన ఈ విధానాన్ని అగ్రగణ్యులైన కొందరు సహాబా తప్పు పట్టారు. ఆయనే సేనాధిపతి గనక ఏ పెద్ద సహాబీ ముందుకు వచ్చి చదివించ లేదు. ఆయన మదీనాకు తిరిగి వచ్చినప్పుడు, సహచరులు అతని గురించి ప్రవక్త (స) వారి వద్దకెళ్లి ఫిర్యాదు చేశారు. అది విన్న దైవ ప్రవక్త (స) వివరణ ఇచ్చుకోవాల్సిందగా ఆదేశించారు. అందుకు ఆయన – ఓ దైవ ప్రవక్తా! ఆ రాత్రి చాలా చల్లగా ఉంది. స్నానం చేస్తే అనారోగ్యం పాలయి, యుద్ధ మైదానంలో సేనాని బాధ్యతలు సజావుగా నిర్వర్తించలేనేమో అన్న భయంతో తయమ్ముమ్ చేసుకొని నమాజు చదివించాను అని సంజాయిషీ ఇచ్చుకున్నారు. సాంతం ప్రశాంతంగా విన్న దైవప్రవక్త (స) ఆయన మాటకు, ఆయన తపనకు మెచ్చుకోలుగా నవ్వారు. ఆయన్ను తప్పు పట్టలేదు, మందలించనూ లేదు. (అబూ దావూద్)

* బద్ర్ సంగ్రామ సమయంలో – ముస్లింలలో సైనికులు మరియు దైవ ప్రవక్త (స) వారు దిగిన స్థలం పరిశీలించి – అనుభవజ్ఞుడైన ఒక సైనికుడు ధర్మ సేనాని అయిన దైవ ప్రవక్త (స) దివ్య సన్నిధికి వచ్చి – ఓ దైవ ప్రవక్తా! ఇక్కడ ఆగాలన్న నిర్ణయం తమరిదా? లేదా అల్లాహ్ ఆదేశమా? అని ఎంతో గౌరవంగా అడిగాడు. దానికి ఆయన – కాదు, ఇది నా స్వీయ నిర్ణయమే అని ఎంతో సౌమ్యంగా సమాధాన మిచ్చారు. అప్పుడు ఆ సైనికుడు – తను బాగుంటుంది అనుకుంటున్న ప్రదేశం గురించి చెబుతూ – దానికి కావాల్సిన వివరణ కూడా ఇచ్చుకున్నాడు. ఇతర సహాబాతో కూడా సలహాసంప్రతింపులు జరిపిన మీదట దైవ ప్రవక్త (స) ఆ సైనికుడి సలహాను స్వాగతించారు. సహాబా కూడా సంతోషంగా మొదటి ప్రదేశాన్ని వదలి సైనికుడు చెప్పిన ప్రదేశానికి తరలి వెళ్లారు.

5 కుటుంబ, సంఘ ధర్మం ఇస్లాం



★ ఇస్లాం ధర్మం యొక్క సానుకూల ప్రాభవము తొలూత మీ నుండే మొదలవుతుంది. మిమ్మల్ని పుట్టించిన మీ నిజ సృష్టికరను మీకు పరిచయం చేసి, మీకు మరియు మీ ప్రభువుకి మధ్య బంధాన్ని అది బల పరుస్తుంది. మీతో మీకు ఉండాల్సిన బంధాన్ని చక్కబెడుతుంది. ఫలితంగా – మీరు మీలోని ప్రతిభాపాటవాలను అనునిత్యం నవీకరించుకుంటూ నిత్య చైతన్య కరదీపకలవుతారు. మీ ఆలోచనలు నిర్మాణాత్మకంగా, మీ ఆచరణలు అభివృద్ధికి బాటలు వేసేవిగా రూపాంతరం చెందుతాయి. తద్వారా మీరు మీ దేహాన్ని, మీ మేధనూ, మీ మనస్సును – వాటికీ హాని కలిగించేటటువంటి ప్రతి వస్తువు నుండి కాపాడుకున్న క్రియాశీలురుగా ఎదుగుతారు. మీలో చోటు చేసుకున్న ఈ మార్పు – మీ పరిసరాలను, మీ పరివారాన్ని ప్రభావితం చేస్తుంది. మీలో ఉన్న ఈ మేలు మీ తల్లిదండ్రులకు, మీ భార్య పిల్లలకు, మీ బంధుమిత్రులకు, మీ స్నేహితులకు, మీ పరిచయస్తులకు, మీ ఇరుగుపొరుగు వారికీ, సామాన్య ప్రజలకు చేరి – సంక్షామంగా ఉన్న సమాజం ఓ సంక్షేమ సమాజంగా రూపు దిద్దుకుంటుంది.

★ ఇస్లాం ధర్మం – కుటుంబం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని గట్టిగా తాకీదు చేస్తుంది. కుటుంబాన్ని బల పరచే నిమిత్తం అది వివాహ బంధాన్ని పునాదిగా పేర్కొంటుంది, అలాగే అల్లాహ్ యెడల విశ్వాసాన్ని – తల్లిదండ్రుల సేవతో, బంధువుల సత్సంబంధాలతో, సంఘం సమాజం యెడల సానుకూల వైఖరితో ముడి పెడుతుంది. అంతే కాదు – సలామ్ ను సర్వ వ్యాప్తం చేయాలని, అందరితో నవ్వుతూ పలకరించాలని, సామాజిక, సాంఘిక విషయాలలో షేరింగ్ – కేరింగ్ విధానాన్ని పాటించాలని అది నొక్కి వక్కాణిస్తుంది. తద్వారానే ఓ నవ సమాజ నిర్మాణం, ఓ సత్సమాజ స్థాపన సాధ్యం అంటుంది ఇస్లాం.

నీ ప్రభువు తన ఆజ్ఞలు ఇలా జారీ చేస్తున్నాడు: మీరు ఒక్క (నిజ) దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోండి. మీ ముందు వారిద్దరిలో ఒకరయినా,ఇద్దరయినా వృద్ధులై ఉంటే వారిని 'ఉఫ్' అని కూడా విసుక్కోకండి. కసురుకుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి; దయార్ద్ర హృదయంతో, వినయంతో వారి ముందు తల వంచి ఉండండి. (వారిపట్ల గౌరవాదరణలతో) "ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచిపోషించారో అలా నీవు వీరిని కరుణించు" అని ప్రార్థించండి. (బనీ_ఇస్రాయీల్: 24–23)

ఇస్లాం ధర్మం – తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలని తాకీదు చేస్తుంది. ఈ ఆయతులో అల్లాహ్ – విశ్వాసాన్ని ఉత్తమ ప్రవర్తనతో పోల్చడమే కాక, తల్లిదండ్రుల యెడల కృతజ్ఞతను తన పట్ల కలిగి ఉండాల్సిన కృతజ్ఞతతో కలిపి ప్రస్తావించడం కొసమెరుపు.

"నాపట్ల కృతజ్ఞుడవయి ఉండు. నీ తల్లిదండ్రుల పట్ల కూడా కృతజ్ఞతాభావంతో మసలుకో. (లుఖ్_మాన్:14)


అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (ర) గారి కథనం – నేను దైవ ప్రవక్త (స) –వారిని కర్మల్లో ఏ కర్మ అల్లాహ్ కు మిక్కిలి ఇష్టమైనది అని అడిగాను. దానికాయన – వేళకు నమాజు చేయడం అన్నారు. ఆ తర్వాత ఏది? అంటే, తల్లిదండ్రుల యెడల మంచిగా మెలగడం అని బదులిచ్చారు. (బుఖారీ, ముస్లిం)

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి తనను ధర్మయుద్ధంలో పాల్గొనడానికి అనుమతించమని కోరాడు. దానికి ఆయన "నీ తల్లిదండ్రులు బ్రతికి ఉన్నారా?" అని అడిగారు. ఆ వ్యక్తి 'ఉన్నారన్నాడు. అతని జవాబు విని ఆయన "అయితే వారిద్దరి సేవలోనే శ్రమిస్తూ, తరిస్తూ ఉండు" అని చెప్పి పంపించారు.



(బుఖారీ – ముస్లిం)

హజ్రత్ అబూ హురైరా (రజి) చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం): "ముసలి వారై పోయిన తల్లిదండ్రులు – వారిరువురిలో ఒక్కరుగాని లేక ఇద్దరుగాని బ్రతికుండగా (వారికి సేవ చేసుకొని) స్వర్గంలోకి ప్రవేశించ లేకపోయినవాడి ముక్కుకి మన్ను తగల! వాడి ముక్కుకి మన్ను తగల! వాడి ముక్కుకి మన్ను తగల!" అని మూడు సార్లు శపించారు. (ముస్లిం)



★ ఇస్లాం ధర్మం – మీరు ప్రజల ప్రేమను ఎలా సొంతం చేసుకోవాలో, వారికి మేలును చేకూర్చేలా ఎలా వ్యవహరించాలో – వారికి మీరు చేసే అభివాదం – అస్సలాము అలైకుమ్ ద్వారా నేర్పుతుంది. ప్రజలతో కలిసినప్పుడు నవ్వుతూ పలుకరించాలని, ప్రజల యెడల సత్యబద్ధంగా, న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా, గౌరవంగా మసలుకోవాలని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని హితవు పలుకుతుంది.

★ మహనీయ ముహమ్మద్ (స) ప్రజల ముందు, ప్రపంచం ముందు తానూ అల్లాహ్ ప్రవక్త అన్న విషయాన్ని ప్రకటించారు. సన్మార్గం, శాంతి, పరోపకారం, అభివృద్ధి, గొప్ప నాగరికత కలిగిన ఆలాహ్లా సందేశాన్ని ఆయన సమస్త మానవాళికి అందజేశారు.

★ ఆయన ఉత్తమ నడక, నడత, నడవడిక ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు. విశ్వకర్త తరఫు నుండి విశ్వజనులందరి కోసం అవతరింపజేయబడిన దివ్యావిష్కృతి ఆధారంగా ఆయన – ఓ గొప్ప విశ్వజనీన, ఉన్నత నైతిక విలువలతో కూడిన సువ్యవస్థను స్థాపించారు. ఆయన తన నడక, నడత, నడవడిక ద్వారా ప్రజాహృదయాలను గెలుచుకోవడమే కాక, వారిని సయితం "తోటి ప్రజలతో మంచిగా వ్యవహరించాలని" తాకీదు చేశారు. (తిర్మిజీ) తన ఈ మాట ద్వారా వారిని ఆ నిమిత్తం ప్రోత్సహించారు కూడా: " మీలో అందరికన్నా ఎక్కువ నీతిమంతులు ప్రళయదినాన నాకు అత్యంత ప్రియతములుగా, నాకు అత్యంత సన్నిహితంగా ఉంటారు. (తిర్మిజీ)

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు; ఒక విశ్వాసి మరో విశ్వాసి కోసం ఓ కట్టడం వంటివాటి వాడు. కట్టడంలోని ఒక భాగం మరో భాగాన్ని బల పరచినట్టే ఒక విశ్వాసి మరొక విశ్వాసిని బలపరుస్తాడు" అని ఆయన తన చేతి వ్రేళ్ళను ఒకదానిలో ఒకటి జొప్పించి చూపించారు. (బుకారీ)





ఇరుగుపొరుగు వారి యెడల సత్ప్రవర్తన

* దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: అల్లాహ్ ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి తన పొరుగువాడిని కష్టపెట్ట కూడదు. వేరొక ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: జిబ్రయీల్ నాకు మాటిమాటికీ పొరుగువాని (హక్కుల) గురించి ఎంతగా తాకీదు చేశారంటే, అది చూసి నాకు ఆస్తిలో (కూడా) ఆయన పొరుగువాణ్ణి వాటా దారుడిగా ఖరారు చేస్తారేమోననిపించింది. (బుఖారీ – ముస్లిం)
* హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) తనకు ఇలా ఉపదేశించారు : "అబూజర్! నువ్వు కూర వండితే అందులో నీళ్ళు (కొంచెం) ఎక్కువ పోయి. ఇరుగు పొరుగు వారిని గుర్తుంచుకో. (ముస్లిం)
* ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది : ఇరుగు పొరుగువారి ఇండ్లలో ఎంతమంది సభ్యులున్నారో అంచనా వేసుకొని తగురీతిలో వారికి కూడా దాంట్లో నుండి కొంత (కానుకగా) ఇవ్వు" అని నా మిత్రులు (దైవప్రవక్త –స) నాకు తాకీదు చేశారు.

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "అల్లాహ్ సాక్షి! అతను విశ్వాసి కాజాలడు, అల్లాహ్ సాక్షి! అతను విశ్వాసి కాడు. అల్లాహ్ సాక్షి అతను విశ్వాసి కానేకాడు" అని అన్నారు. "ఎవరు దైవప్రవక్తా!?" అని అడగ్గా, "తన తుంటరి చేష్టలతో ఇరుగుపొరుగు వారికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నవాడు" అని ఆయన సమాధానమిచ్చారు. (బుఖారీ – ముస్లిం) 'బవాయిఖ్' అంటే మోసాలు, తుంటరి చేష్టలు అని అర్థం.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీరు విశ్వసించనంత వరకూ స్వర్గంలోకి ప్రవేశించలేరు. అలాగే మీరు పరస్పరం ప్రేమించుకోనంత వరకూ (పూర్తిగా) విశ్వసించలేరు. మీరు ఒండొకర్ని ప్రేమించుకోవాలంటే ఏం చేయాలో నేను మీకు తెల్పనా? మీ మధ్య సలాంను సర్వసామాన్యం చేసుకోండి (ఒండొకరికి ఎక్కువగా సలాములు చేస్తూ ఉండండి.) (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రజల మధ్య ప్రేమను పెంచే పరస్పర సహకార భావం, సుహృద్భావం గురించి చెబుతూ ఇలా ప్రబోధించారు: విశ్వాసికి ప్రపంచంలో ఎదురయ్యే కష్టాలలోని ఒక కష్టాన్ని గనక ఎవడైనా దూరం చేస్తే, అల్లాహ్ పరలోకంలో అతడికి ఎదురయ్యే కష్టాలలోని ఒక కష్టాన్ని దూరం చేస్తాడు. వేరొక సందర్భంలో ఆయన చెప్పిన మాట: దాసుడు తన సోదరునికి సహాయం చేస్తున్నంత కాలం అల్లాహ్ ఆ దాసునికి సహాయం చేస్తూ ఉంటాడు. (ముస్లిం)

6 ప్రజా ప్రయోజనకర పనుల్లో పోటీ పడాలని చెప్పే ధర్మం ఇస్లామ్

ఇస్లాం ధర్మంలో – విశ్వాసం పరిపూర్ణం అవ్వాలంటే, దానికి సత్కర్మ జత అవ్వాల్సిందే. ఖుర్ఆన్ లోని అనేక ఆయతులలో విశ్వాసాన్ని సదాచరణతో కలిపి ప్రస్తావించడం జరిగింది.

విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి, వారి పొరపాట్లు మన్నించబడతాయని, వారికి గొప్ప ప్రతిఫలం లభిస్తుందని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు.(అల్ –మాయిదహ్: 9)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ముస్లిం ఏదైనా చెట్టు నాటగా, దాన్ని (అంటే దాని ఆకులను, ఫలాలను) ఏ మానవుడైనా లేక జంతువైనా లేక పక్షి అయినా తింటే, దానిపై అతనికి ప్రళయం వరకూ పుణ్యం లభిస్తూనే ఉంటుంది. (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ప్రళయం సంభవించే సమయానికి మీలో ఒక వ్యక్తి చేతిలో ఒక మొక్క ఉంటే దాన్ని అతను మరోమారు ఆలోచించకుండా నాటెయ్యాలి. (ముస్నద్ అహ్మద్)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: విశ్వాసాని (ఈమాను) కి డెబ్భై లేక అరవైకన్నా ఎక్కువ భాగాలున్నాయి. వాటిలో అత్యున్నత భాగం "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప వేరొక నిజ దేవుడు లేడు) అని పలకటం. కాగా జనం నడిచే దారిలోనుంచి (రాళ్ళు, ముళ్ళవంటి) బాధాకరమైన వస్తువులను తొలగించడం అట్టడుగున వున్న భాగం. ఇంకా వ్రీడ (లజ్జ) కూడా ఈమాన్ (విశ్వాసం)లో అంతర్భాగమే. (బుఖారీ– ముస్లిం)

* వ్యంగ్యం, చిన్నచూపుకు ఇస్లాంలో తావు లేదు

హజ్రత్ అబూ మూసా అష్అరీ (ర) దైవ ప్రవక్త (స) వారిని అడిగారు: ముస్లింలలో ఎవరు గొప్ప? అని. దానికి ఆయన ఇచ్చిన సమాధానం: ఎవరి మాటలు మరియు చేతల నుండి ఒక ముస్లిం సురక్షితంగా ఉంటాడో అతను" (బుఖారి, ముస్లిం)

ఓ విశ్వాసులారా! పురుషులు తోటి పురుషుల్ని హేళన చేయకూడదు. వీరికంటే వారే మంచివారై ఉండవచ్చు. అలాగే స్త్రీలు తోటి స్త్రీలను గేలి చేయకూడదు. వీరికంటే వారే మంచివారై ఉండవచ్చు. మీరు ఒకరి తప్పులు మరొకరు ఎత్తి చూపుకుంటూ పరస్పరం బురద చల్లుకోకండి. తప్పుడు పేర్లతో పిలుచుకోకండి. విశ్వాసభాగ్యం పొందిన తర్వాత చెడ్డపేరు తెచ్చుకోవడం చాలా తప్పు. ఈ వైఖరి మానుకోని వారే దుర్మార్గులు. (అల్–హుజూరాత్: 11)

*** అభివాదం చెయ్యడంలో ముందు ఉండండి, అది శాంతి అనురాగాల సందేశం**

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం)ను, "ఇస్లాంలో అన్నిటికన్నా : శ్రేష్ఠమైన ఆచరణ ఏది?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం), "నువ్వు (ఆకలి గొన్నవారికి) అన్నం పెట్టు. పరిచయమున్నా లేకపోయినా ప్రతి వ్యక్తికీ సలాం చెయ్యి. (అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ ఇదే)" అని బోధించారు. (బుఖారీ– ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు : ఏ మంచి పనినీ నీవు చులకనగా చూడకు. ఆఖరికి నీవు నీ సోదరుణ్ణి నగుమోముతో కలవటాన్ని అయినా సరే." (ముస్లిం)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు : ప్రజలారా! సలాంను సర్వ సామాన్యం చెయ్యండి.' (ఆకలిగొన్నవారికి) అన్నం పెట్టండి. బంధువుల యెడల ఉత్తమంగా మెలగండి. జనులు నిద్రపోయి ఉన్నప్పుడు (తహజ్జుద్) నమాజ్ చేయండి. వీటిని పాటిస్తే మీరు ప్రశాంతంగా స్వర్గంలోకి ప్రవేశిస్తారు. (తిర్మిజీ – హసన్, సహీహ్)

*** వ్యవహారంలో సౌమ్యత, మృదుత్వం**

దైవప్రవక్త (స) ప్రజలతో ఎంతో సౌమ్యంగా మాట్లాడేవారు. వారితో ఎంతో మృదువుగా వ్యహరించేవారు. ఆయన వద్దకు ఏదేని రెండు విషయాలు తీసుకురాబడినప్పుడు సులభమయిన దానిని ఆయన ఎంచుకునేవారు.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : ఏ వస్తువులోనయినా మృదుత్వముంటే అది ఆ వస్తువును హృద్యంగా మలుస్తుంది. ఆ మృదుత్వాన్నే తీసివేస్తే అది లోపభూయిష్టంగా కనిపిస్తుంది. (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : నిశ్చయంగా అల్లాహ్ మృదు స్వభావి. ఆయన మృదుత్వాన్ని ఇష్టపడతాడు. కాఠిన్యం వల్లగాని, మరే ఇతర విషయం వల్లగాని ప్రసాదించనిది అల్లాహ్ మృదుత్వం మూలంగా ప్రసాదిస్తాడు. (ముస్లిం)


7 ఇస్లాం శుచీశుభ్రతల ధర్మం

ఇస్లాం ధర్మం శుచీశుభ్రతల గురించి గట్టిగా తాకీదు చేస్తుంది. ఎంతవరకంటే – శుచీశుభ్రతలు ముస్లిం సమాజపు ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి. శుచీశుభ్రతలు విశ్వాసంలోని అంతర్భాగం. దేహ పరిశుద్ధత, ఆత్మ పవిత్రత లేకుండా విశ్వాసం పరిపూర్ణం కాజాలదు. అల్లాహ్ ఖుర్ఆన్ లో ఇలా సెలవిస్తున్నాడు:

> నిశ్చయంగా అల్లాహ్ తన వైపు మరలే వారిని, పవిత్రంగా పరిశుభ్రంగా ఉండేవారిని మాత్రమే ప్రేమిస్తాడు. (అల్–బఖరహ్: 222) నీ దుస్తులు పరిశుభ్రంగా ఉంచుకో.(అల్–ముదస్సిర్: 4)
>
> **ఇస్లాంలో వుజూ, గుస్ల్, వ్యక్తిగత పరిశుద్ధత**

★ ప్రతి నమాజు సమయంలో వుజూ చేయడం అనేది ముస్లింలకు ఇతరుల మధ్య ఓ ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తుంది. వుజూ లేకుండా ఏ నమాజు స్వీకరించబడదు. వుజూ చేసుకోవాలంటే, పూర్తి ముఖాన్ని, రెండు చేతులను మోచేతులు సమేతంగా కడుక్కోవాలి. తలను స్పృశించాలి, రెంటు కాళ్ళు చీలమండలాలు సమేతంగా కడుక్కోవాలి. వుజూలోని సున్నతులు కూడా ఉంటాయి. ఉదాహరణకు – నోట్లో నీళ్లు తీసుకొని పుక్కిలించడం, ముక్కులో నీళ్లు కుడి చేతితో ఎక్కించి ఎడమ చేతితో చీదటం. చేతులు మరియు కాళ్ళ వ్రేళ్ళ మధ్య ఖిలాల్ చేయడం మొదలైనవి.

★ ఇక గుస్ల్ –స్నానం అంటారా! అది పూర్తి శరీరాన్ని కడగటం. ఇస్లాంలో అది రెండు విధాలు. 1) మఫ్రూజ్ – విధి అయినది. 2) మందూబ్ – అభిలషనీయమైనది. మఫ్రూజ్ గుస్ల్ పరిశుద్ధతకు ముఖ్యమైన షరతు. దాన్ని ఆచరించకుండా నమాజు నెరవేరదు. ఇది ఎప్పుడు చేస్తారంటే, బహిష్టు, పురిటి రక్తం వచ్చి ఆగిపోయిన తర్వాత, భార్యతో సంభోగం లేదా స్వప్నస్ఖలనం, వీర్యస్ఖలనం తర్వాత . అలాగే షహీద్ (ధర్మ మార్గంలో వీర మరణం పొందిన వ్యక్తి) తప్ప – మరణించిన ప్రతి వ్యక్తికీ స్నానం చేయించకుండా పూడ్చి పెట్టకూడదు.



★ చేతులు, ముఖం, నోరు మరియు ముక్కును కడగాలి

చాలా వరకు వైరల్ ఇన్ఫెక్షన్లు మరియు అంటు వ్యాధులు మానవ శరీరంలోని ఈ భాగాల ద్వారానే వ్యాపిస్తాయి. ప్రతి రోజూ ఐదు పూటల నమాజు ఆచరించేటటువంటి ముస్లింలు – వారు తమ చేతులు మరియు ముఖాలను కడుక్కోవడం, నోరు కడుక్కోవడం, ముక్కు ద్వారా నీటిని పీల్చుకోని శుభ్ర పరచుకోవడం వంటివి చేస్తారు. తద్వారా వారు అనేక వైరల్ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా సురక్షితంగా ఉంటారు.

★ దైవ ప్రవక్త (స) వారి సుశిక్షణలో ఒకటి – చక్కగా వుజూ చేయడం. ఇబ్బందికర పరిస్థితిలో చక్కగా పరిపూర్ణ రీతిలో వుజూ చేయడం ద్వారా అల్లాహ్ పాపాలను ప్రక్షాళించడమే కాక, దాసుని స్వర్గ హోదాలను పెంచుతాడు అని దైవ ప్రవక్త (స) సెలవిచ్చారు. (ముస్లిం)

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : "వుజూ సవ్యంగా పూర్తి చేయండి. వ్రేళ్ల మధ్య భాగాలను తడపండి. ముక్కులోనికి సరిగా నీరు ఎక్కించండి. అయితే ఉపవాస స్థితిలో మాత్రం ఇలా చేయకండి." (తిర్మిజీ) అలాగే దైవ ప్రవక్త (స) వారి సుశిక్షణలో – పళ్ళు తోముకోవడం, నోటిని పరిశుభ్రంగా (దుర్వాసన లేకుండా) ఉంచుకోవడం కూడా ఒకటి. ఆయన ఇలా సెలవిచ్చారు: "నా అనుచర సమాజం గనక కష్టాల్లో పడిపోతుంది అన్న భయం నాకు లేకపోతే ప్రతి వుజూ సమయంలో 'మిస్వాక్' చేయాలని ఆజ్ఞాపించి ఉండేవాణ్ణి" (బుఖారీ) ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో – ప్రతి నమాజు సమయంలో అని ఉంది.

* పరిశుభ్రత మరియు ఆరోగ్యం

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – పరిశుభ్రత మరియు ఆరోగ్యం గురించి గట్టిగా తాకీదు చేశారు. ముస్లింలు వారి ఇళ్లను, వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపదేశించారు. దారిన పడి ఉన్న హానికర వస్తువును తొలగించడం పుణ్యకార్యం.

ఆయన సుశిక్షణలోని కొన్ని అంశాలు:

★ ముస్లిం నిద్ర నుండి మేల్కొన్నాక తన రెండు చేతులను కడుక్కోవాలి. "నిశ్చయంగా తన రెండు చేతులు రాత్రి ఎక్కడ గడిపాయో తనకి తెలీదు" గనక అన్నారు ప్రవక్త (స). (బుఖారీ, ముస్లిం)

★ భోంచేసేటప్పుడు కుడి చేత్తో భోంచేయాలి. అలాగే కుడి చేయి అశుద్ధ విషయాలలో ఉపయోగించకూడదు.

★ గోళ్లు కత్తిరించాలి, నాభిక్రింది వెంట్రుకలు, చంకల్లోని వెంట్రుకలను తొలగించాలి. దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

★ సువాసను వాడాలి. ఆహారం, ఆహార్యం విషయంలో అతికి పాల్పడకూడదు. అలాగే ఆయన సుశిక్షణలో – మనసును పవిత్రంగా ఉంచుకోవాలని, మాట శైలి బాగుండేలా చూసుకోవాలని, దేహ ఆరోగ్యాన్ని, దుస్తులు పారిశుధ్యాన్ని పాటించాలన్నది కూడా ఉంది.

★ కాలకృత్యాలు తీర్చుకోవడం - మరుగుదొడ్డికి వెళ్లడం

ముస్లింలు కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత శుద్ధి పొందటానికి నీళ్లను ఉపయోగిస్తారు. (కేవలం టిష్యూ పేపర్ కే పరిమితం అవ్వరు).

★ దైవప్రవక్త (స) కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత శుద్ధి పొందటానికి కుడి చేతిని వాడటాన్ని వారించారు. ఎందుకంటే వారు – కుడి చేతితో భోంచేస్తారు, పరస్పరం కరచాలనం చేసుకుంటారు గనక. ముస్లింలు వారి చేతులు ప్రతి రోజూ అనేక మార్లు కడుక్కుంటారు. తద్వారా వైరల్ వైరస్ గానీ, క్రిమికీటకాలుగాని వ్యాపించకుండా ఉంటాయి. ముఖ్యంగా కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత. అలాగే భోజనానికి ముందు, అయిదు పూటలా నమాజు కోసం వుజూ చేసేటప్పుడు, నిద్ర నుండి మేల్కొన్నాక వారు చేతులను కడుక్కుంటారు.

★ ఇన్ఫెక్షన్ మరియు ప్లేగు నియంత్రణ

దైవ ప్రవక్త (స) వారి సుశిక్షణలో – అంటువ్యాధి వ్యాపించకుండా చేసే, రోగాన్ని నియంత్రించి – అదో మహమ్మారిగా మారకుండా చేసే గొప్ప సూత్రాలున్నాయి. దైవప్రవక్త (స) – ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులు రోగం వ్యాపించి ఉన్న ప్రాంతానికి ప్రయాణం చేసి వెళ్లకూడదని, రోగం వ్యాపించి ఉన్న ప్రాంత ప్రజలు వేరే ఇతర ప్రాంతాల వైపునకు ప్రయాణాలు చెయ్య కూడదని హెచ్చరించారు. (దీనికి గృహ నిర్బంధం, ఐసోలేషన్ అంటారు). ఈ ఆరోగ్య సూత్రాన్ని ఊహాన్ పట్టణంలో పాటించి ఉంటే, అక్కడికి కొత్త వ్యక్తులు రాకుండా, అక్కడి వారు వేరే ప్రాంతానికి తరలి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి ఉండి ఉంటే ప్రపంచంలో కరోనా మహమ్మారి వ్యాపించి ఉండేది కాదు.

* దైవప్రవక్త (స) ప్రవర్తన సంబంధిత ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. అది సామాజిక వ్యవహారాల కోసం కావాల్సిన ఇస్లామీయ సాంస్కృతిక మర్యాదలను రూపొందించింది. ఎంతవరకంటే, తుమ్ము, దగ్గు, ఆవులింతకు సంబంధించిన మర్యాదలను సయితం ఆయన తెలియజేశారు. దైవ ప్రవక్త (స) తుమ్మినప్పుడు తన చేతిని, లేదా గుడ్డను అడ్డుగా పెట్టేవారు. ఒక విధంగా చెప్పాలంటే తన తుమ్ము వల్ల ఇతరులకు ఇబ్బంది కలగకూడదని స్వరాన్ని తగ్గించి తుమ్మేవారు. తుమ్మే సమయంలో తుమ్మిన వ్యక్తిని అల్లాహ్ కరుణించాలని దుఆ చేసేవారు. అలాగే ఒకరి ద్వారా మరొకరికి సోకే ప్రమాదమున్న జబ్బు ఉన్న వారు – ఆరోగ్యవంతులకు దూరంగా ఉండాలని, భౌతిక దూరాన్ని పాటించాలని హితవు పలికారు. "రోగి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని సమీపించకూడదు". (ముస్లిం)

అంటువ్యాధులు మరియు ప్రమాదకర వ్యాధుల నుండి ఇస్లాం బోధనలు మిమ్మల్ని ఎలా రక్షిస్తాయి?



★ దైవప్రవక్త (స) వారి బోధనలు పరిశుభ్రత మరియు ప్రజారోగ్యానికి ఉన్నత ప్రమాణాలను నిర్దేశించాయి. అవి వ్యాధుల నుండి రక్షణ మరియు అంటువ్యాధుల వ్యాప్తిని నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

శుచీశుభ్రత విశ్వాసంలోని అవిభాజ్యంశము". (ముస్లిం)

★ డాక్టర్ క్రైగ్ కాన్సెలైన్ – అమెరికన్ వార్తాపత్రిక న్యూస్‌వీక్‌లో మార్చి 2020 ,17న ప్రచురించిన తన కథనంలో – దైవ ప్రవక్త (స) వారి బోధనలను అంటువ్యాధుల నివారణకు గొప్ప ఆరోగ్య సూత్రాలుగా పేర్కొన్నాడు.

★ **నష్ట పర్చకు, నష్టపోకు:** ఇది ఇస్లాం ప్రబోధించే మూల సూత్రాలలో ఒకటి. ఈ మౌలిక సూత్రం మిమ్మల్ని, ఇతరుల్ని హాని కలిగించే, రోగ బారిన పడేసే సకల విధమైనటువంటి విషయాల నుండి కాపాడుతుంది. ఇందులో మత్తు పదార్థాల సేవనం, ధూమపానం, మద్యపానం మొదలైనవి ఈ చెడు కోవకు చెందినవే. ఊపిరితిత్తులు మరియు శ్వాసకోశ వ్యవస్థపై దాడి చేయడం వల్లే కరోనా వైరస్ ముప్పు అధికంగా ఉంటుందనడంలో సందేహం లేదు. అది ధూమపానం చేసేవారి రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. దాని నుండి బయటపడే అవకాశం తక్కువగా ఉంటుంది.

★ ఇస్లాం వ్యభిచారం, వికృత లైంగిక పద్ధతులు మరియు వివాహేతర సంబంధాన్ని, స్త్రీపురుషుల విచ్చలవిడి కలయికను, కామ వాంఛతో కూడిన చెడు తిరుగుళ్లను నిషేధిస్తుంది. ఈ నిషేధం వల్ల ఎయిడ్స్ వంటి లైంగికంగా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని నిరోధిదించడం సాధ్యమవుతుంది. ఎయిడ్స్ మహమ్మారి అక్వైర్డ్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్ (HIV) వల్ల వస్తుంది, ఈ వ్యాధి క్రమంగా రోగనిరోధక శక్తిని క్షీణింపజేస్తుంది, కొన్ని సందర్భాలలో మరణానికి కూడా దారి తీయవచ్చు.

8 ఇస్లాం ఆరోగ్యం, సౌందర్యాల ధర్మం

ఇస్లామీయ బోధనలు ఆరోగ్యం మరియు సౌందర్యానికి సంబంధించిన అన్నీ అంశాలను పూర్తి చేస్తుంది. మీ ఆరోగ్యాన్ని, ఆహార్యాన్ని కాపాడుకోవడానికి పనికొచ్చే బోధనలలో ముఖ్యమైన వాటిని క్రింద ఇస్తున్నాము.

* ఉపవాసం మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది:

ఉపవాసం ఇస్లాం ఐదు స్తంభాలలో ఒకటి. ముస్లింలు ప్రతి సంవత్సరం రమజాన్ మాసంలో ఉపవాసం ఉంటారు, తెల్లవారుజాము నుండి సూర్యాస్తమయం వరకు ఆహారపానీయాలు మరియు లైంగిక కోరికలకు దూరంగా ఉంటారు. సోమ, గురువారాల్లో అలాగే (చాంద్రమానం 13,14,15, చంద్రుడు నిండుగా ఉన్నప్పుడు) స్వచ్ఛందంగా ఉపవాసం ఉండడం ప్రవక్త (స) వారి సున్నత్. అడపాదడపా ఉపవాసం ఉండటం వల్ల మానవ శరీరంలో రోగనిరోధక శక్తి బలోపేతం అవుతుందని ఆధునిక శాస్త్రం నిర్ధారించింది.

పాశ్చాత్య దేశాలలో చాలా మంది వైద్యులు ఉపవాసం ఉండటం ఎంతో శ్రేయస్కరమని సలహా ఇస్తారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, కొవ్వును కాల్చడానికి మరియు హానికరమైన కొలెస్ట్రాల్, ఇన్సులిన్, రక్తంలో చక్కెరను తగ్గించడానికి ఉపవాసం ఎంతగానో దోహద పడుతుందని చెబుతారు.

* ఆహారం మరియు ఆహారపు అలవాట్లు

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మనిషి నింపుకునే పాత్రల్లో పొట్టకన్నా నికృష్టమయిన పాత్ర మరొకటి లేదు. మనిషి వెన్నెముకను నిలిపి ఉంచటానికి కొన్ని ముద్దల తిండి చాలు. ఇంకా ఎక్కువ తినటం తప్పదనుకుంటే మొత్తం కడుపులో మూడో వంతును అన్నం కోసం మరో మూడో వంతును నీళ్ళకోసం, ఇంకో మూడో వంతును శ్వాస కోసం కేటాయించుకోవాలి. (తిర్మిజీ)

* పుట్టిగా భోంజేయకుండా మితాహారం వల్ల కలిగే ప్రయోజనాల్లో ముఖ్యమైనది – రక్తంలో చక్కెర స్థాయిని మిత స్థాయిలో ఉంచుతుంది. ఆహారాన్ని శక్తిగా మార్చడానికి పని చేసే జీవక్రియ ప్రక్రియలను మెరుగుపరుస్తుంది. శరీర చురుకుదనాన్ని పెంచడమే కాక, బద్ధకం మరియు సోమరితనం తొలగించి నిత్య చైతన్యవంతుల్ని చేస్తుంది. ఈ ఆధునిక యుగపు శాపం ఏమిటంటే, అధిక ఆహారం, అధిక బరువు, మధుమేహం, అధిక రక్తపోటు. ఫలితంగా వ్యాధులు, జీవక్రియ సంబంధించిన రోగాలు మొదలైనవి పెచ్చుమీరడం.



* ఇస్లాం ధర్మం మద్యపానాన్ని నిషేధించింది. మద్యం, మత్తు పానీయం కాలేయానికి హాని చేస్తుందని, విషాన్ని తొలగించే సామర్థ్యాన్ని తగ్గిస్తుందని, రోగనిరోధక శక్తిని బలహీనపరచడమే కాక తెల్ల రక్త కణాల సామర్థ్యాన్ని, రోగనిరోధక ప్రతిరోధకాల ఉత్పత్తిని తగ్గిస్తుందని వైద్య పరిశోధన నిరూపించింది.



నమాజు, ఆరాధన మరియు అల్లాహ్ నామ స్మరణ మీ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

★ నమ్రతతో మరియు ధ్యానంతో ప్రార్థించడం వల్ల ఆత్మకు ప్రశాంతత లభిస్తుందని, ఓదార్పు మరియు భరోసానిస్తుందని, ఒత్తిడిని తగ్గిస్తుంది, ఆందోళనను దూరం చేస్తుందని, ఆశావాదాన్ని, సానుకూలతను పెంచుతుందని, సంతోషాన్ని కలిగించే హార్మోన్లను ప్రవింపజేస్తుందని వైద్య పరిశోధనలు నిర్ధారిస్తాయి.

(Endorphins, Dopamine and Serotonin).).

★ ప్రార్థన పద్ధతి గుండె మరియు రక్త ప్రసరణ పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. అలాగే మనిషి శరీరంలో రోగనిరోధక వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుతుంది. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆశావాదాన్ని ఇష్టపడ్డారు, నిరాశావాదాన్ని అసహ్యించుకునేవారు. తరచూ ఈ దుఆ చదువుతూ ఉండేవారు.

అల్లాహుమ్మ ఇన్నీ అఊజు బిక మినల్ హమ్మి వల్ హజని వల్అజ్ జీ ఎల్ కస్లీ వల్ బుఖ్"
".లీ వల్ జుబ్నీ వ జలయిద్దయిని వ గలబతిరిజాలి

అల్లాహ్! నేను దిగులు, దుఃఖం, బలహీనత, సోమరితనం, పిరికితనం, పిసినారితనం. రుణ భారం, ఇంకా ప్రజలు నాపై పెత్తనం చెలాయించడం నుండి నీ శరణు వేడు తున్నాను. (బుఖారీ)

* అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: నమాజ్ విశ్వాసులు నియమం తప్పకుండా వేళకు విధిగా పాటించవలసిన విధ్యుక్తధర్మం. (అన్–నిసా: 103)

సహనం, ప్రార్థనల ద్వారా (నా) సహాయాన్ని అర్థించండి. ప్రార్థన (నమాజ్) కాస్త కష్టమైన పనే, సందేహం లేదు. కాని దైవభీతిపరులకు మాత్రం ప్రార్థన (నమాజ్) చేయడం కష్టమేమీ కాదు. (అల్–బఖరహ్: 45)

నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది. అల్లాహ్ స్మరణ ఎంతో గొప్ప విషయం. (అల్–అన్కబూత్: 45)

విశ్వాసుల హృదయాలే అల్లాహ్ స్మరణ వల్ల తృప్తి చెందుతాయి. గుర్తుంచుకోండి, అల్లాహ్ స్మరణ వల్లనే మనశ్శాంతి లభిస్తుంది. (అర్–రాద్: 28)

యోచనాపరులు నిల్చొని, కూర్చొని, పడుకొని– ఏ స్థితిలో ఉన్నాసరే ఎల్లప్పుడూ అల్లాహ్ నే స్మరిస్తూ ఉంటారు. అంతేకాకుండా వారు భూమ్యాకాశాల నిర్మాణం గురించి పరిశీలిస్తూ ఇలా ప్రార్థిస్తారు: "ప్రభూ! నీవు ఈ విశ్వాన్ని నిష్ప్రయోజనంగా, లక్ష్యరహితంగా సృజించలేదు. నీవు పరమ పవిత్రుడవు. మమ్మల్ని నరకయాతనల నుండి కాపాడు. (అల్ఇమ్రాన్: 191)

భయం, టెన్షన్, ఆందోళన మరియు డిప్రెషన్ వంటి భావాలు అడ్రినలిన్ మరియు కార్టిసాల్ హార్మోన్ల స్రావాన్ని పెంచుతాయని వైద్య పరిశోధన ధృవీకరించింది. తద్వారా గుండె దెబ్బ తింటుంది, మనిషి శరీర రోగనిరోధక శక్తిని ప్రతికూలంగా ప్రభావితం చేసి వ్యాధికి దారి తీస్తుంది.

జంతువులతో మన ప్రవర్తన మరియు వాటి మాంసాన్ని ఆరోగ్యకరమైన పద్ధతిలో తినడం

★ గడ్డి తినే జంతువుల మాంసం తినడానికి అల్లాహ్ అనుమతించాడని ముస్లింలు నమ్ముతారు. ఉదాహరణకు – పశువులు, గొర్రెలు, కోళ్లు, పక్షులు మరియు మాంసం తినని ఇతర జంతువులూ, పక్షులు.



★ అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు; నేలపై సంచరించే జంతువుల్ని, రెక్కలతో గాలిలో ఎగిరే పక్షుల్ని కాస్త గమనించండి. అవి కూడా మీలాంటి జీవరాసులే. మేము విధివ్రాతలో ఏ విషయాన్నీ వదలి పెట్టలేదు.

(అల్–అన్‌ఆమ్: 38)

విశ్వకర్త మన కోసం – జంతువులతో మనం ఎలా వ్యవహరించాలో నియమాలను నిర్దేశించాడు. ఆయన పేర్కొన్న కొన్ని నిర్దిష్ట జంతు జాతులను జంతువుల ద్వారా మనుషులకు ఎటువంటి వ్యాధులు సంక్రమించకుండా శ్రేయస్కర పద్ధతిలో మనం తినవచ్చు.

★ ముస్లింలు పంది మాంసం తినకుండా అల్లాహ్ నిషేధించాడని నమ్ముతారు, ఇది ప్రతిదీ తినే జంతువు (omnivorous animals). కొన్ని పందులు చనిపోయిన జంతువులను, చెత్తను, వాటి వ్యర్థాలను తింటాయి.అలాగే యూదులకు, క్రైస్తవులకు కూడా పంది మాంసం తినడం నిషేధించబడింది.

★ ముస్లింలు కోరలు ఉన్న అడవి జంతువు మరియు ప్రతి పంజా విసిరే పక్షులను తినకుండా అల్లాహ్ నిషేధించాడని నమ్ముతారు.

2019 చివరిలో వుహాన్ నగరంలోని జంతు మార్కెట్ నుండి చైనా వన్యప్రాణులను పెంచడం మరియు తినడంపై కఠినమైన నిషేధాన్ని విధించిందని గమనించాలి. స్వైన్ ఫ్లూ (1998), SARS (2003), మరియు కరోనా (2019) ఇదీ జంతువుల నుండి వ్యాపించింది!

★ ఇస్లామీయ పద్ధతిలో జిబహ్ చేయడాన్ని ప్రపంచవ్యాప్తంగా "హలాల్" అని పిలుస్తారనీ మీకు తెలుసా? ఈ హలాల్ పద్ధతి – జంతువులను వధించడానికి మరియు మానవ వినియోగానికి సరిపోయే మాంసాన్ని రక్తం లేకుండా పరిశుభ్రంగా పొందేందుకు ఖచ్చితమైన ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రమాణాలలో జంతువును కొట్టడం, హింసించడం, విద్యుత్ షాక్‌కు గురి చేయడం, గొంతు నుమిలి చంపడం, సజీవంగా ఉంచి ఉడికించడం వంటివి చేయడం జరగదు. ఇలాంటి హింసాత్మక పద్ధతులు అనేక ఆసియా సమాజాలలో జరుగుతాయి.

ఇస్లాంలో సౌందర్యం

★ ఇస్లాం సౌదర్యం ధర్మం. బాహ్య సౌందర్యంతోపాటు అంతరంగిక సౌందర్యం కలిగి ఉండాలని హితవు పలుకుతుంది. దానికి సంబంధించిన నియమ నిష్ఠలను నిర్దేశించింది. సౌందర్య భావార్థాన్ని దైవ ప్రవక్త (స) సంక్షిప్తంగా ఈ హదీసులో పేర్కొన్నారు: ఎవరి హృదయంలోనయితే అణు మాత్రపు అహంకారం ఉన్నా అతను స్వర్గంలో ప్రవేశించదు. అది విన్న ఓ వ్యక్తి – మనిషి అతని దుస్తులు అందంగా ఉండాలని, అతని పాదరక్షలు అందంగా ఉండాలని కోరుకోవడం కూడా అహంకారం క్రిందికి వస్తుందా అని అడగ్గా – సమాధానంగా దైవ ప్రవక్త (స) – నిశ్చయంగా అల్లాహ్ నిలువెత్తు సౌందర్యం, ఆయన సౌందర్యాన్ని ఇష్ట పడతాడు. ఇక అహంకారం అంటావా – సత్యాన్ని తిరస్కరించడం, ప్రజలను చులకనగా చూడటం అన్నారు. (ముస్లిమ్)

★ ఇస్లాం ధర్మం మనిషికి నాగరికతను నేర్పింది. దేహ సౌదర్యంతోపాటు అతని అంతరంగాన్ని అందంగా తీర్చిదిద్దింది. అతని భావ సౌదర్యాన్ని, మేధో పరమైన అందాన్ని, ఆత్మ సౌదర్యాన్ని మెరుగులు దిద్దింది. ఆత్మసౌందర్యం మనిషి మనసులో ప్రేమను, వాత్సల్యాన్ని, సానుకూల దృక్పథాన్ని, శాంతి శ్రేయస్కర భావనను పెంపొందిస్తుంది. అది మనిషి ప్రతి ప్రవర్తనలోనూ ప్రతిబింబిస్తుంది.

★ భావోద్వేగ అందం – భావోద్వేగ మేధస్సు మరియు సానుకూల భావోద్వేగాల రూపంలో ప్రతిబింబిస్తుంది. అది ఇతరులతో మనిషి వ్యవహరించే తీరును అందంగా, ఆకర్షణీయంగా మారుస్తుంది. మేధోపరమైన అందం – మనిషికి – స్వయానికి గానీ, సమాజానికి గానీ హాని, నష్టం కలిగిన్చచేటటువంటి ఆలోచనలు, విషయాల నుండి దూరంగా ఉంచుతుంది. అలాగే ఉత్తమమైన విద్యను ఆర్జించేలా ప్రేరేపించడమే కాక, అందమైన నాగరికతను అతనికి నేర్పుతుంది.

★ హృదయ సౌందర్యం – అది మనసుని అసూయ, ద్వేషం, ఓర్వలేనితనం వంటి అవలక్షణాల నుండి కాపాడుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. మనిషి మనసులోని నెమ్మది, ప్రశాంతత, ప్రేమ – ఎదుటి వ్యక్తిని ప్రేమించేలా, అతని శ్రేయాన్ని కాంక్షించేలా, అతని విజయాన్ని ఆశించేలా, తన కోసం ఏ మంచినైతే ఇష్ట పడతామో ఇతరుల కోసం కూడా అటువంటి మేలును కోరుకునేలా చేస్తోంది. ఫలితంగా – నైతిక మరియు ప్రవర్తన పరమైన సౌంద ర్యం పెరుగుతుంది. అంతరంగాన్ని అందంగా తీర్చిదిద్దడం అంటే ప్రజలతో మన ప్రవర్తన, మన వ్యవహారాలు అందంగా ఉండేలా చూసుకోవడం.

★ ఇస్లాం ధర్మం మనిషి బాహ్య రూపాన్ని కూడా అందంగా మారుస్తుంది. పరిశుభ్రత, స్వచ్ఛతతో తన బాహ్య రూపాన్ని అలంకరించుకోవాలని, మనిషి యొక్క సౌందర్య అభిరుచిని మెరుగుపరిచే విధంగా తనను తాను మలచుకోవాలని ప్రోత్సహిస్తుంది. అది అతన్ని ఉన్నత స్థితిలో నిలబెట్టడమే కాక, దారి తప్పిన, విధానాలు ప్రలోభాలు, అసభ్యత మూలాల నుండి అతన్ని కాపాడుతుంది.

★ ఇస్లాం నేర్పే నాగరికత భౌతికవాద నాగరికతలలో సౌదర్య భావనకు పూర్తిగా భిన్నమైనది. భౌతికవాద నాగరికత గౌరవం, నైతికత, పరువు ప్రతిష్టలకు అతీతంగా అందాన్ని కేవలం ఆస్వాదించడానికి మాత్రమే పరిమితం చేస్తుంది. దీనికి భిన్నంగా ఇస్లాం స్త్రీని తన భర్త కోసం అందంగా తయారవ్వాలని పిలుపునిస్తుంది. తన దేహ అలంకరణ యువతను ఆకర్షించే, వారిని పెడత్రోవ పట్టించే సమ్మోహన సాధనంగా ఉండకూడదంటుంది. అలా చేయడం వల్ల అనైతికత, అశ్లీలత, లైంగిక విచ్చలవిడితనం ప్రబలి సమాజం సర్వ నాశనం అవుతుందని హెచ్చరిస్తుంది.

★ అందానికే ఆనవాలు అల్లాహ్. ఆయన అందాన్ని ప్రేమిస్తాడు. ఆయన పేర్లలో ఒకటి అల్–బదీవు', అంటే, మునుపటి ఉదాహరణ లేకుండా వస్తువులను సృష్టించేవాడు. ఆయన సృష్టించిన, అద్భుత ఆకృతిలో అందంగా మలచిన ప్రాణులలో, స్వచ్ఛమైన ప్రకృతి అందంలో ఆయన ప్రతిభ, ఆయన అందాన్ని ఎంతగా ఇష్ట పడతాడు అన్న విషయం స్పష్టంగా కనిపిస్తుంది. మనం నివసించడానికి, జీవన మకరందాన్ని ఆస్వాదించడానికి ఆయన ఈ భూమిని అనువుగా చేశాడు. దాని తనువూ మీద నడిచే స్వేచ్ఛ మనకిచ్చాడు. ఈ భూమిని ప్రకృతి అందాలతో నింపేశాడు. ఆయన చేసిన ప్రకృతిలో – ఆహా! పరిమళాలను వెదజల్లే ఎన్ని రకాల పూలు, ఎన్ని అద్భుత ఆకారాలు, ఎన్ని రంగులు, ఎన్ని హంగులు, ఎన్నెన్ని పొంగులో కదా! రంగురంగుల రివ్వున దూసుకుపోయే అందమైన చేపలను, సుందరమైన నదీనదాలను, అల్లారుముద్దుగా అన్పించే సీతాకొకచిలుకలు, ఏటవాలు లోయలను, ఎత్తయిన పర్వత సొగసులను చూడని వారు, చూసి ఆనందించని వారు మన మధ్య ఎవరైనా ఉన్నారా? చెప్పండి! సృష్టికర్తల్లోనే మహాద్భుత సృష్టికర్త అయిన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు;

ఆయన భూమ్యాకాశాలను సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు. మిమ్మల్ని అద్భుతంగా రూపొందించాడు. చివరికి మీరంతా ఆయన వైపుకే మరలి పోవలసి ఉంది.

(అత్–తగాబూన్: 3)

నిస్సందేహంగా మేము మానవుడ్ని ఎంతో ఉత్కృష్ట జీవిగా సృజించాం.

(అత్–తీన్: 4)

ఆదం సంతానమా! ప్రార్థన చేసే ప్రతిసారీ పూర్తి వస్త్రధారణతో మిమ్మల్ని మీరు అలంకరించుకోండి. తినండి, త్రాగండి. (హాయిగా ఉండండి.) కాని హద్దులు మాత్రం మీరకండి. హద్దులు మీరేవారిని అల్లాహ్ ఎన్నటికీ ప్రేమించడు. ముహమ్మద్ (స)! వారినడుగు: "అల్లాహ్ తన దాసుల కోసం సమ్మతించిన ఈ అలంకరణలను ఎవరు నిషేధించారు? ఎవరు అల్లాహ్ ప్రసాదించిన పరిశుద్ధ వస్తువుల్ని నిషేధించినది?" చెప్పు: "ఇవన్నీ ఇటు ప్రపంచ జీవితంలోనూ విశ్వాసుల కోసమే ఉన్నాయి; అటు ప్రళయదినాన కూడా వారికే లభిస్తాయి." ఈవిధంగా మేము విషయం గ్రహించే వారికోసం మా సూక్తులు విడమరచి తెలియజేస్తున్నాము. (అల్-ఆరాఫ్: 31 ,32)

★ మహనీయ ముహమ్మద్ (స) దేహ అందం, ఆత్మ సౌందర్యానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ శ్రద్ధ చూపేవారు. దేహ పారిశుధ్యాన్ని పాటించడంతోపాటు, మంచి సువాసన గల అత్తరును ఆయన క్రమం తప్పకుండా వాడేవారు. ఆయన అవసరార్థం తన్ను తానూ అందంగా అలంకరించుకునేవారు, అందమైన దుస్తులు ధరించేవారు. తలను చక్కగా దువ్వుకునేవారు. తన ఆహార్యం అద్భుతంగా ఉండేలా జాగ్రత్త పడేవారు. ఈ క్రమమంలోనే - దైవ ప్రవక్త (స) వారు హజ్రత్ బిలాల్ (ర) గారి తన ముఅజ్జిన్ గా ఎంచుకోవడానికి కారణం - ఆయన మధురమైన స్వరమే. దైవ ప్రవక్త (స) స్వతహాగా అద్భుత స్వరవాణి గలవారు. ధర్మ శత్రువులు సయితం ఆయన మృదు మధుర పారాయణానికి మంత్రముగ్దులయ్యేవారు. అయినప్పటికీ - హజ్రత్ అబూ మూసా అష్అరి (ర) గారి పారాయణాన్ని వినడం ఆయనకెంతో ఇష్టంగా ఉండేది, కారణం - ఆయన మధుర స్వరమే. అలాగే ఆయన హబ్షా హిజ్రత్ సందర్భంగా హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ (ర) గారిని ముస్లింల రాయబారిగా ఎన్నుకున్నారు. కారణం - అందమైన ఆయన ఆహార్యము, అద్భుతమైన ఆలోచన వి ధానమే.

★ ఇస్లామీయ నాగరికత అభ్యుదయ, అద్భుతమైన నాగరికత. ఇస్లామిక్ కాలిగ్రఫీ మరియు ఆర్కిటెక్చర్ లో గల అద్భుత అందంలో మనం దీనిని స్పష్టంగా చూడగలము. ఇది ప్రపంచమంతటా వ్యాపించి ప్రసిద్ధి చెందిన నాగరికత. అది ప్రపంచమంతా అన్ని ప్రాంతాల ప్రజలు సందర్శించుకోగలిగే గొప్ప సాక్ష్యాలను, బలమైన ముద్రను వదిలిందని చెప్పవచ్చు.



9 ఇస్లాం విద్యా వివేచనల ధర్మం

చదువు → ఆలోచించు → నేర్చుకో

★ దైవప్రవక్త (స) శాశ్వతమైన ఆకాశవాణిని తీసుకొచ్చారు. అది 'చదువు' అన్న పదంతోనే మొదలవుతుంది. అజ్ఞానపు అంధకారాల నుండి ప్రజలను వెలికి తీసి విజ్ఞాన వెలుగుల్లో విహరింపజేయడానికి, సత్య అవగాహన కాంతితో వారు సన్మార్గం మీద నడిచేలా చెయ్యడానికి ఖుర్‌ఆన్ గ్రంథ అవతరణ జరిగింది.

★ ఇస్లాం మేధో వికాస ధర్మం. మనిషి తన బుద్ధిని ఉపయోగించాలని, విద్యార్జన విజ్ఞాన అన్వేషణ ద్వారా మేధను పదును పెట్టుకోవాలని, సృష్టిలో గల అల్లాహ్ సూచనల గురించి, అద్భుతాల గురించి యోచించాలని, సత్యాసత్యాల విషయంలో లోతు అధ్యాయనం జరపాలని అదే అవగాహనకు అసలు మూలమని చెబుతుంది. ఈ విషయాన్ని బలపర్చే అనేక ఖుర్‌ఆన్ వచనాలు ఉన్నాయి.

★ అల్లాహ్ ఈ విచక్షణా జ్ఞానం, ఆలోచనా శక్తి, మేధ మూలంగానే మనిషిని ఇతర జీవరాసుల నుండి వేరు పరచి ప్రత్యేక స్థానాన్ని ప్రసాదించడం జరిగింది. మనిషిని సృష్టిలోనే శ్రేష్ఠునిగా ఈ గుణమే నిలబెట్టింది. మనిషి తెలివిని ఉపయోగించి సృష్టి వైనాన్ని గమనించి, సత్య శోధన చేసి ఈ విశ్వబ్రహ్మాండానికి ఒక కర్త ఉన్నాడు అన్న నిర్ణయానికి ఖచ్చితంగా రాగలడు.

పరిశీలించు → ఆవిష్కరించు → అర్థం చేసుకో

★ ఇస్లాం విశిష్టతల్లో ఓ గొప్ప విశిష్ట ఏమిటంటే, అది విద్యా విజ్ఞానంతో, వైజ్ఞానిక ఆవిష్కరణలతో ఎప్పుడూ విభేదించదు. యదార్థం ఏమిటంటే – వైజ్ఞానికి ఆవిష్కరణలు ఖుర్‌ఆన్ గ్రంథాన్ని బలపరుస్తాయి. అలాగే ఖుర్‌ఆన్ లోని వచనాలు ఆధునిక సైన్స్ కనుగొన్న ఖచ్చితమైన ప్రమాణాలతో రుజువయిన ఏ నూతన ఆవిష్కరణలను త్రోసిపుచ్చవు, విభేదించవు.

★ దైవ ప్రవక్త (స) విద్యార్జన చేయాలని ప్రోత్సహించారు. ప్రయోజనకరమైన జ్ఞానాన్ని దాచకూడదని హెచ్చరించారు. ధర్మ బద్ధమైన విద్యను నేర్చుకోవాలని, ఇతరులకు నేర్పించాలని సహచరులను ప్రోత్సహించారు.

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: ఎవరయితే విద్యను నేర్చుకోవడానికి ఒక మార్గాన్ని అనుసరిస్తారో – అల్లాహ్ వారి కోసం స్వర్గానికి వెళ్లే దారిని సులభతరం చేస్తాడు.. (ముస్లిమ్)



★ **ఇస్లాం మానవాళికీ ప్రయోజనం చేకూర్చే ప్రపంచ నాగరికత:**

మానవాభ్యుదయ చరిత్రలో ఇస్లామీయ నాగరికత ముఖ్యమైన మలుపు అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇస్లామీయ నాగరికత ఎనిమిదవ శతాబ్దం మధ్య నుండి ప్రస్తుత క్రీ.శ. పదిహేనవ శతాబ్దం వరకు కొనసాగుతూనే ఉంది.

★ క్రీ.శ. ఎనిమిది మరియు 13వ శతాబ్దాల మధ్య కాలంలో ఇస్లామీయ నాగరికత స్వర్ణయుగంగా భాసిల్లింది. ఆ సమయంలో అనేక శాస్త్రాలు మరియు కొంగ్రొత్త ఆవిష్కరణలు అభివృద్ధి చెందాయి. అబ్బాసి ఖలీఫా హారూన్ అల్-రషీద్ (786-809) పాలన కాలంలో బాగ్దాద్‌లో బైతుల్ హిక్మః - విజ్ఞాన గృహం అన్న పేరుతో ఓ సైన్స్ సెంటర్ ప్రారంభించబడింది.

ఇది ప్రపంచంలోని వివిధ దేశాల, విభిన్న సంస్కృతుల శాస్త్ర వేత్తలను ఒక వేదిక మీద సమైక్య పరచి అప్పట్లో ప్రశిద్ధిగాంచిన సకల విద్యలు, కళలు, విద్య, వైజ్ఞానిక పరమైన వాటన్నింటిని సేకరించి అరబీ భాషలోకి అనువదించడం జరిగింది. బాగ్దాద్ లోని హౌస్ ఆఫ్ విజ్డమ్ ప్రపంచంలోని అతిపెద్ద లైబ్రరీలలో పేరుగాంచిన గ్రంథాలయంగా ఉండేది. ఆ సమయంలో, అత్యధిక శతం తత్వవేత్తలు, గణిత శాస్త్రజ్ఞులు, వైద్యులు, వాస్తుశిల్పులు మరియు ఖగోళ శాస్త్రవేత్తలు ఇస్లామీయ ప్రపంచంలో ఉండేవారు.

* **ఆర్కిటెక్చర్ మరియు ఇస్లామిక్ కాలిగ్రఫీ:**

కాలిగ్రఫీ మరియు ఆర్కిటెక్చర్ రంగంలో ఇస్లామీయ నాగరికత సాధించిన విజయాలు ప్రపంచంలోని తూర్పు నుండి పశ్చిమం వరకు, మధ్య యుగం మొదలు నేటి వరకు సాక్షిగా నిలుస్తాయి. ఇస్లామీయ నాగరికత వైభవం, వైవిధ్యానికి గల సాక్ష్యాలలో ముస్లింలు వదిలిపెట్టిన ఉన్నత కళలు, అద్భుతమైన నిర్మాణ కట్టడాలు ఉన్నాయి.

* **ఇస్లామీయ నాగరికత నీడలో పెరిగిన శాస్త్రవేత్తలు**

ముస్లిం పండితులు – మెడిసిన్, అనాటమీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఆప్టిక్స్, మ్యాథమెటిక్స్, ఆల్జీబ్రా, కాలిక్యులస్, ఖగోళ శాస్త్రం, ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, వ్యవసాయం మరియు కళల రంగాలలో – కాలిగ్రఫీ, కవిత్వం, విద్య, తత్వశాస్త్రం మరియు సామాజిక శాస్త్రాలలో స్పష్టమైన చెరపసాధ్యం కానీ ముద్ర వేశారు.

* ఇబ్న్ సినా (980–1037), ఆధునిక వైద్య పితామహుడు. అబూ బకర్ ముహమ్మద్ బిన్ జకరియా అల్–రాజీ, వైద్య పితామహుడు (క్రీ.శ. 865 – 929), వైద్య మరియు రసాయన శాస్త్ర రంగంలో ప్రముఖ పండితులలో ఒకరు. అతను బహుముఖ ప్రజ్ఞాశాలి. అతను గణితంలో రాణించాడు మరియు అతను సైన్స్ శాఖల మధ్య ఏకీకరణను సాధించగలిగాడు. అల్–రాజీ మెడిసిన్ మరియు కెమిస్ట్రీ రంగంలో అనేక ఆవిష్కరణలు, అద్భుతాలు చేశాడు. ఆల్–హావీ అన్న మెడిసిన్ పుస్తకాన్ని రాశాడు, ఇది యూరప్ లో 400 సంవత్సరాలు వరకు వైద్య శాస్త్రాలకు ప్రధాన సూచనగా ఉండేది.

* జాబీర్ ఇబ్న్ హయాన్ (721–815), రసాయన శాస్త్ర పితామహుడు. ముహమ్మద్ బిన్ మూసా అల్–ఖ్వారిజ్మీ (780–850) విషయానికొస్తే, లాగరిథమ్‌ల శాస్త్రం కంప్యూటర్ సైన్స్‌కు పితామహుడు. ఇబ్న్ ఖల్దూన్ (1332–1406) సామాజిక శాస్త్ర స్థాపకుడు.







కుర్ధుబా మస్జిద్ లోపలి దృశ్యం – స్పెయిన్



కొన్ని దశాబ్దాలలోనే ఇస్లాం భూమిపై మహా గొప్ప నాగరికతగా ఆవిర్భవించింది. అన్ని రకాల జ్ఞాన అభివృద్ధికి దారులు తెరుచుకున్నాయి. ప్రపంచం విశిష్టమైన శాస్త్రీయ, సాంస్కృతిక పురోగతిని చూసింది. ఇస్లాం ధర్మ ప్రభావం, ప్రభ కొన్ని వందల సంవత్సరాల పాటు మకుటం లేని మారాజుగా కొనసాగింది. ఈ చారిత్రక యదార్థానికి విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన న్యాయశీలురయిన అనేక .మంది సీనియర్ చరిత్రకారులు సాక్షులుగా ఉన్నారు



మొరాకో ఆర్కిటెక్చర్





కాల్యాన్ బుఖారీ మస్జిద్ – ఉజ్బెకిస్తాన్



కోల్ షరీఫ్ మస్జిద్ – వాజాన్ – రష్యా





ముందు మీ అమ్మ



ఒక వ్యక్తి దైవ ప్రవక్త పవిత్ర సన్నిధికి వచ్చి – ఇలా విన్నవించుకున్నాడు: ఓ దైవ ప్రవక్తా! నా సత్ప్రవర్తనకు అత్యంత ఎక్కువ అర్హులు ఎవరు? దానికి: "నీ అమ్మ" అని సమాధానమిచ్చారు ప్రవక్త (స). ఆ తర్వాత ఎవరు? అని మళ్ళీ అడగ్గా – "నీ తల్లి... అని సమాధానమిచ్చారు ప్రవక్త (స). ఆ పిదప ఎవరు? అని తిరిగి ప్రశ్నించగా – "నీ అమ్మ." అని సమాధాన మిచ్చారు ప్రవక్త (స). ఆనక ఎవరు? అని మళ్ళీ అడగ్గా "నీ తండ్రీ" అని బదులిచ్చారు ప్రవక్త (స). (బుఖారీ, ముస్లిం)

అధ్యాయం 10

ఇస్లాం మహిళకు చేసిన మేలేమిటి?

1 మహిళల హక్కుల విషయంలో ఇస్లాం ఒక మేలిమి మలుపు

ఇస్లాం – విశ్వ ప్రభువు తరఫు నుండి విశ్వ జనులందరి కోసం ఎన్నుకోబడిన విశ్వజనీన ధర్మం. వర్ణ, వర్గ, రంగు, రూపు, భాషా, ప్రాంతం, ఆడ, మగ అన్న తేడా లేకుండా – అందరి హక్కును సమానంగా, న్యాయబద్ధంగా అంగీకరించే ధర్మం ఇస్లాం. వారి హక్కులకు హామీ ఇచ్చే ధర్మం ఇస్లాం. ఇస్లాంలో స్త్రీలు – వారు పసి పిల్లలయినా, యవ్వనస్తులయినా, , కూతురు అయినా, భార్య అయినా, తల్లి అయినా, చెల్లి అయినా, అమ్మమ్మ అయినా, నాన్నమ్మ అయినా – వారందరికీ ఎంతో గొప్ప స్థానం ఉంది.

> అనేక సందర్భాల్లో దైవ ప్రవక్త (స) మహిళల యెడల మంచిగా వ్యవహరించాలని నొక్కి వక్కాణించారు. మీరు మహిళల యెడల మంచిగా వ్యవహరించండి. (బుఖారీ, ముస్లిం). ధర్మ ఆదేశాలు వర్తించే విషయంలో – "నిశ్చయంగా స్త్రీలు పురుషుల తోబుట్టువులు" అన్నారు. (అబూ దావూద్)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం, మహిళల సామాజిక మరియు ఆర్థిక హక్కులు మంజూరు చేయబడ్డాయి. వాటికి పురుషుల మాదిరిగానే ఇస్లాంలో హామీ ఇవ్వబడింది. ఈ హామీ అనేది భద్రత, రక్షణ, న్యాయం మరియు స్థిరత్వం రీత్యా ఉన్నత ప్రమాణాన్ని కలిగి ఉంటుంది. ఇవి ప్రపంచంలోని అనేక దేశాలలో స్త్రీలకు లేని, ఇవ్వని విలువలు.

* 1,440 సంవత్సరాల క్రితం ఇస్లాం ధర్మం పరిపూర్ణమయింది. అది మహిళల హక్కులకు సంబంధించి చారిత్రాత్మకమైన మేలిమి మలుపు. అరేబియా ద్వీపకల్పం మరియు ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో స్త్రీ, పురుషుల మధ్య వివక్ష, ఆడ శిశుహత్య, స్త్రీల ఆర్థిక మరియు సామాజిక హక్కులను స్వాహా చేసుకోవడం, బాలికలను బలవంతంగా వివాహం చేసుకోవడం వంటి మహిళలకు హాని కలిగించే దౌర్జన్యపూరిత ఆచారాలు అమల్లో ఉండేవి. ఈ వికృత విధానాలన్నింటి ఇస్లాం నిషేధించింది. అన్ని రకాల వైవాహిక అపమానాల నుండి మహిళలను కాపాడింది.


* ఇస్లాం మహిళల సంపాదన, ఆస్తిపాస్తుల్ని రక్షిస్తుంది. వాటిని ఎవరూ వారి నుండి లాక్కోలేరు. ఇస్లాం మహిళల వారసత్వపు హక్కును ఆమోదించింది. ఆమె కుటుంబ స్థితిని బట్టి వారసత్వపు వాటాను నిర్ణయించే ఒక దైవిక చట్టాన్ని తీసుకువచ్చింది. ఇది ఒక గొప్ప సాంస్కృతిక, సాంఘిక, ఆర్థిక మార్పు. మహిళలకు వారసత్వ హక్కును ఇవ్వని సమాజాలకు ఇది ఓ కనువిప్పు. పూర్వం – స్త్రీ పురుషుని ఆస్తిలో భాగంగా, భర్త చనిపోతే వారసత్వపు సొత్తుగా భావించేవారు. ఇస్లామీయ వారసత్వ చట్టం నేటికీ అనేక పాశ్చాత్య న్యాయస్థానాలలో చట్టపరమైన దిక్సూచిగా ఉంది అనేది నిర్వివాదాంశం.

* ఇస్లాం వివాహితులు, విడాకులు పొందిన మరియు వితంతువుల స్త్రీలకు స్పష్టమైన, నిర్దిష్టమైన హక్కులను కేటాయిస్తుంది. మరియు భార్యకు తన భర్తపై ఉన్న హక్కులకు సమానమైన హక్కులను ఆమెకు ఇస్తుంది. ఖుర్‌ఆన్ లో ఇలా ఉంది: సాధారణంగా స్త్రీలపై పురుషులకు ఎలాంటి హక్కులున్నాయో న్యాయపరంగా పురుషులపై స్త్రీలకు కూడా అలాంటి హక్కులే ఉన్నాయి. కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒక మెట్టు ఆధిక్యత ఉంది. అల్లాహ్ శక్తిమంతుడు, వివేచనాపరుడు. (అల్–బఖరహ్: 228)

మహిళల యెడల మంచిగా వ్యవహరించండి.

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; ఎవరైతే ఇద్దరు ఆడ పిల్లల పోషణా బాధ్యతను స్వీకరించి నవారు యవ్వన దశకు చేరుకునేంత వరకు వారి బాగోగులను చక్కగా గమనిస్తారో – వారు రేపు ప్రళయ దినాన వచ్చినప్పుడు – నేను మరియు వారు ఈ రెండు వ్రేళ్ళలా ఉంటారు అని ఆయన తన రెండు వ్రేళ్ళను కలిపి చూపించారు.(ముస్లిం)





స్త్రీకి స్వతంత్ర వ్యక్తిత్వం ఉంటుంది

* ఇస్లాం స్త్రీలను తన స్వంత అస్తిత్వం మరియు స్వతంత్ర వ్యక్తిత్వం గల స్వేచ్ఛాయుత స్త్రీగా చూస్తుంది. ఆమె తన వంశం, కుటుంబ పేరుతోనే పిలువబడుతుంది. అనేక పాశ్చాత్య సమాజాలలో జరిగే విధంగా వివాహం తర్వాత తన ఇంటి పేరును మార్చుకోదు. మహిళలకు హక్కులున్నట్లే బాధ్యతలు కూడా ఉంటాయి. విధులు, బాధ్యతలు రూపేణా తప్ప స్త్రీపురుషుల మధ్య వ్యత్యాసం ఉండదు.

ఇస్లామీయ సమాజంలో మహిళలకు గొప్ప స్థానం ఉంది

* సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర చాల కీలకం అన్న విషయాన్ని ఇస్లాం గుర్తిస్తుంది. ఆమె సమాజ అభివృద్ధిలో పాలు పంచుకునేలా ప్రోత్సహిస్తుంది. ఈ కర్తవ్య నిర్వహణలో ఎక్కడా ఆమె పురుషునితో విభేదించదు. పైగా ఒకరు మరొకరని బల పరుస్తారు, పూర్ణతను సాధిస్తారు. మహిళల కార్య పరిధి ప్రధానంగా పిల్లల ఆలనా పాలన, వారికి సుశిక్షణ ఇచ్చి సక్రమంగా పెంచడం కోసం ప్రత్యేకించబడింది. తద్వారా పిల్లలు సత్పౌరులుగా, సత్సమాజ నిర్మాతలుగా, భావి పౌరులుగా ఎదుగుతారు. సమాజ విచ్ఛిన్నానికి కాకుండా ఆదర్శ సమాజ నిర్మాణానికి బలమయిన పునాదులుగా రూపు దిద్దుకుంటారు. అదనంగా ముస్లిం మహిళలు సామాజిక మరియు రాజకీయ జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషించి, తనదైన బలమైన ముద్రను వేస్తారు కూడా.
* దైవ ప్రవక్త (స) మహిళా శిక్షణార్థం, విద్యాబోధ నిమిత్తం ప్రత్యేకంగా కొన్ని రోజులను కేటాయించేవారు. మహిళలు సామూహిక నమాజు, ఈద్ నమాజు, ప్రమాణం, స్వఅభిప్రాయాన్ని తెలియజేయడం కోసం రావలసిందిగా ఆయన ప్రోత్సహించారు. స్వయంగా ప్రవక్త (స) ప్రాపంచిక విషయాలలో తన సహచరులతో సలహా సంప్రతింపులు జరిపినట్లే, తన సతీమణులు సలహాలు సయితం తీసుకోకునేవారు. అలాగే సంఘ ఇతర మహిళలు కూడా వారి వారి అవసరాలను ప్రవక్త (స) వారి వద్దకు వచ్చి చెప్పుకునేవారు. అయన ఇచ్చిన సలహాలను, చూపిన పరిష్కారాలను అమలు పరచేవారు కూడా, ఎంతవరకంటే, ఒక సామాన్య బానిస మహిళ, పని మనిషి తన సమస్యను ప్రవక్త (స) వారి ముందర పెట్టడానికి భయ పడేది కాదు.
* సమాజసేవ, విద్య, నర్సింగ్, వైద్యం వంటి రంగాలలో ముందు తరాల సుశిక్షణ నిమిత్తం పని చేయాలని ఇస్లాం మహిళలను ప్రోత్సహిస్తుంది.
* అనేక సందర్భాల్లో ప్రవక్త (స) స్త్రీల పట్ల మంచిగా వ్యవహరించాలని తాకీదు చేశారు. పెరిగి పెద్దయ్యే వరకు ఆడపిల్లలను మంచిగా తర్బీదు ఇవ్వాలని, వారిని ఆదర్శ మహిళగా తీర్చిదిద్దాలని ఆయన అభిలషించారు.

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: ఎవరైతే ఆడపిల్లల విషయంలో పరీక్షకు గురి చేయబడి, ఓర్పు, నేర్పుతో వారిని చక్కగా పెంచి, వారు పెద్దయ్యే వరకు ధర్మమార్గంలో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకుంటారో – వారిని నరకాగ్ని నుండే కాపాడే కవచాలుగా ఆడ పిల్లలుంటారు. (బుఖారీ, ముస్లిం)

2 ఆధునిక యుగంలో మహిళలు మరియు ఇస్లాం

ఆధునిక యుగం – మునుపటి చారిత్రక యుగాలకు భిన్నంగా వేగవంతమైన మార్పులను చూస్తోంది. మరి ఇస్లాం బోధనలు ప్రస్తుత మహిళల అవసరాలను తీరుస్తున్నాయా? ప్రపంచంలోని చాలా దేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న మూడు సార్వజనీన సమస్యలను మేము క్రింద ఇస్తున్నాము. ఇస్లాం వాటికి శాశ్వత పరిష్కారాలను ఎలా చూపిందో కూడా మేము క్లుప్తంగా మేము అందిస్తున్నాము.

1 – స్త్రీ శరీరాన్ని దుర్వినియోగం చేయడం.

2 – వివాహేతర సంబంధాలు మరియు అధర్మ సంతానం.

3 – గృహ హింస మరియు మహిళలపై వేధింపులు.

1 - ఆడదాని శరీరం అంగడి సరుకు కాదు




ఇస్లాం స్త్రీలను గౌరవించింది, శారీరక దుర్వినియోగం నుండి వారిని రక్షించింది. ఆమె దేహాన్ని విలాస వస్తువుగా చూడటాన్ని, ఆమెను వ్యభిచారం కుంపటిలోకి నెట్టడాన్ని, వారిని పురుషులకు ఎరగా వాడుకోవడాన్ని గర్హించింది, నిషేధించింది. అలాగే మగువ జీవితాన్ని నాశనం చేసే, ఆమె గౌరవానికి, ఆత్మాభిమానానికి భంగం కలిగించే నగ్నత్వాన్ని. అర్ధ నగ్నత్వాన్ని, సంఘ నీతికి, నైతికతకు విరుద్ధమైన ప్రతి చర్య మరియు క్రియను ఇస్లాం నిషేధించింది. సిగ్గుమాలిన చేష్టల వల్ల ఆమె లైంగిక వేధింపులకు గురవ్వడమేకాక, ఒక్కోసారి అపహరణకు, అత్యాచారానికి గురయ్యే ప్రమాదం కూడా ఉంది.

లైంగిక వ్యాపారం, వ్యభిచారంలో చిన్న వయసు గల ఆడపిల్లలను దించడం ద్వారా – అశ్లీల సాహిత్యం, బూతు సినిమాలు, నగ్న, అర్ధ నగ్న చిత్రాల వెల్లువ అనేక సాంఘిక రుగ్మతలకు దారి తీస్తున్నది. ఫలితంగా – ప్రాణాంతక వ్యాధులు నేటి యుగానికి, రాబోయే తరానికి భయంకర శాపంగా మారనున్నాయి.

ఆదం సంతానమా! మీరు మీ మర్మావయవాలను కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాము. అయితే అన్నిటికంటే భయభక్తుల దుస్తులే ఎంతో శ్రేష్ఠమైనవి. ఇది (వస్త్రధారణ) అల్లాహ్ సూచనల్లో ఒక సూచన. మీరు విషయం గ్రహిస్తారని (ఇలా తెలుపుతున్నాం).” (అల్ – ఆరాఫ్: 26)

వ్యభిచారం దరిదాపులకు పోకండి. అది చాలా హేయమైనది, పరమ చెడ్డదారి. (బనీ ఇస్రాయీల్: 32)

2 - వి వాహేతర సంబంధాలు మరియు అధర్మ సంతానం లేని సంక్షేమ సమాజం



నేడు ప్రపంచ అనేక దేశాల్లో ఉన్నట్టు – స్త్రీ పురుషుల మధ్య వివాహేతర సంబంధాన్ని ఇస్లాం అనుమతించదు.

ఒక పురుషుడు మరియు స్త్రీకి మధ్య లైగిక సంబంధం వివాహం అనే పవిత్ర పద్ధతిలోనే ఏర్పడాలి. ఇస్లాం చెప్పే ఈ సువర్ణ సూత్రం నేడు ప్రపంచంలో పేచ్చుమీరుతున్న అనేక సామాజిక, సాంసారిక, దాంపత్య సమస్యలకు చక్కటి పరిష్కారం. వాటిలో ముఖ్యమైనవి: మహమ్మారి రోగాల వ్యాప్తి, వంశ మూలాలను కోల్పోవడం, అక్రమ సంతానం అధిక మవ్వడం, అసలు తల్లిదండ్రులెవరో కూడా తెలియని అనామక, ఆశ్రయరహిత సంతానం పెరిగిపోవడం.

ఇస్లామీయ బోధనలు వంశ వృక్ష, పరంపర పరిరక్షణను, పిల్లలు వారి తండ్రులు మరియు తల్లులతో ఉండాలన్న ఖచ్చితమైన నియతిని కలిగి ఉంటాయి. గొప్ప విషయం ఏమిటంటే, ఇస్లాం ప్రజల సృష్టికర్త తరఫు నుండి అందజేయబడిన కుటుంబ చట్టాల ఆధారంగా ఒక ఆదర్శవంతమైన కుటుంబం ఉనికిలోకి రావాలని అభిలషిస్తోంది. ఆ కుటుంబ వాతావరణం – స్త్రీలను గౌరవించేలా, వారి మనో భావాలను గుర్తించేలా, వారి ఆత్మాభినాన్ని రక్షించేలా, వారి హక్కులను కాపాడేలా ఉండాలని కోరుకుంటుంది. అలాగే మహిళకు తన భర్తను ఎన్నుకునే స్వేచ్ఛ, హక్కు హామీని ఆమెకిస్తుంది. ఆమె గౌరవార్థం వివాహ సందర్భంగా మహర్ ను భర్తపై తప్పనిసరి చేసింది.



ఇస్లాం, పురుషుడు తన కుటుంబం మరియు పిల్లల ఆర్థిక బాధ్యత స్వీకరించాలని కోరుతుంది. అనివార్య కారణాల వల్ల విడిపోయినప్పుడు లేదా విడాకులు తీసుకున్నప్పుడు, భరణం పొందే హక్కు స్త్రీకి ఉంటుంది అంటుంది. గడువు ముగిసే వరకు ఆమెకు సంబంధించిన కూడు, గూడు, గుడ్డ ఏర్పాటు పురుషునిపై తప్పనిసరి.

గమనిక: 2007లో కాంగోలో నిర్వహించిన ఒక సర్వేలో దేశవ్యాప్తంగా రోజుకు 1,000 మందికి పైగా మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని తేలింది. ఇది సరిపోదన్నట్టు, అలా లైంగిక వేధింపులకు గురైనవారి కుటుంబాలు మరియు వారు నివసించే సంఘాలు తరచుగా ఈ బాధిత మహిళలను తిరస్కరించడమో లేదా బహిష్కరించడమో చేస్తున్నాయి అని తేలింది.

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "యువకుల్లారా! మీలో వివాహం చేసుకునే శక్తి కలవారు వివాహం చేసుకోవాలి. ఆ శక్తి లేనివారు ఉపవాసవ్రతం పాటించాలి. ఉపవాసం కామవాంఛను అదుపులో ఉంచుతుంది." (బుఖారి, ముస్లిం)

ఆయన ఇంకా ఇలా అన్నారు: ఒక వ్యక్తి వ్యభిచారం చేసేటప్పుడు విశ్వాస స్థితిలో ఉండడు. ఒక వ్యక్తి దొంగతనం చేసేటప్పుడు విశ్వాస స్థితిలో ఉండడు. ఒక వ్యక్తి మద్యం త్రాగేటప్పుడు విశ్వాస స్థితిలో ఉండడు. (అంటే ఆ స్థితిలో విశ్వాసం అతన్నుండి వైదొలుగుతుంది).(బుఖారీ)

ఆయన మీకోసం మీజాతి నుండే జీవిత భాగస్వాము(స్త్రీ)లను సృజించాడు, వారి దగ్గర మీరు సౌఖ్యం పొందడానికి. ఇంకా ఆయన మీ మధ్య ప్రేమానురాగాలు, దయా దాక్షిణ్యాలను కూడా జనింపజేశాడు. ఇది కూడా ఆయన సూచనల్లోనిదే. యోచించే వారికి ఇందులో అనేక నిదర్శనాలున్నాయి. (అర్–రూమ్: 21)

3 - గృహ హింస మరియు మహిళలపై వేధింపులు

* ప్రపంచవ్యాప్తంగా స్త్రీలు ఎదుర్కొనే మిక్కిలి విచారకర సమస్యల్లో గృహ హింస కూడా ఒకటి. స్త్రీలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా, కొన్ని ఆఫ్రికన్ దేశాలు ప్రపంచంలో అత్యధిక గృహ హింస మరియు అత్యాచార నేరాలను నమోదు చేశాయి.



* యునైటెడ్ స్టేట్స్‌లో, గృహ హింస సంఘటనల కారణంగా సంవత్సరానికి 100$ మిలియన్లకు పైగా నష్టపోవాల్సి వస్తుంది, ఇందులో పనికి హాజరుకాకపోవడం మరియు అనారోగ్య సెలవులు ఉన్నాయి. హింస ఫలితంగా మొత్తం వైద్య ఖర్చులు సంవత్సరానికి సుమారు 5$ బిలియన్లు చేరాయి.

* స్పెయిన్‌లో, మహిళలపై హింసాత్మక సంఘటనలు అత్యంత దారుణంగా ఉన్నాయి. 2017 గణాంకాల ప్రకారం మహిళలపై హింస సంబంధిత కేసులు 158,000 కంటే ఎక్కువ నమోదవదయ్యాయి.

* దాంపత్య సంబంధ బాంధవ్యం – ప్రేమ, దయ, పరోపకారం, త్యాగం, నిబద్ధత, పరస్పర గౌరవం అనే పునాదులపై నిర్మితమవ్వాలని ఇస్లాం ధర్మం పిలుపునిస్తుంది.

దంపతులిద్దరు దైవనిర్ణీత పరిమితులకు కట్టుబడి ఉండలేమని భయపడినప్పుడు స్త్రీ తన భర్తకు ఏమైనా ఇచ్చేసి అతని నుండి వేరుపడ దలచుకుంటే వారిద్దరి మధ్య ఏదైనా ఒప్పందం కుదరడంలో తప్పు లేదు. (బఖరః – 229)

3 మహిళకు సంబంధించి మహనీయ ముహమ్మద్ (స) చేసిన మహితోక్తులు

జీవితానికి సంబంధించిన సకల విషయాలలో ప్రజలందరికీ పరమ ఆదర్శప్రాయులు మహనీయ ముహమ్మద్ (స). అయన – మహిళల యెడల మంచిగా వ్యవహరించాలని నొక్కి వక్కాణించారు.

మహనీయ ముహమ్మద్ (స) జీవిత కాలంలో ఎవ్వరినీ ఎప్పుడూ కొట్ట లేదు. ఏ స్త్రీని కొట్టింది లేదు. ఏ సేవకుణ్ణి కొట్టింది లేదు. అల్లాహ్ మార్గంలో జిహాద్ చేసేటప్పుడు తప్ప. అలాగే ఆయన్నుండి ఎవరికీ ఎలాంటి హాని, ఇబ్బంది కలిగింది లేదు. ఆయన ఎవరితోనూ ఎలాంటి ప్రతీకారం తన స్వయం కోసం తీర్చుకుంది లేదు. అల్లాహ్ నిషేధితాలకు ఆ వ్యక్తి పాల్పడి ఉంటే తప్ప, అలాంటి స్థితిలో ఆయన అల్లాహ్ కోసం ఆ వ్యక్తికి దండన విధించేవారు. (ముస్లిం)


ముహమ్మద్ (స) ఒక భర్తగా బాధ్యతాపరులైన గొప్ప నిజాయితీపరులు. వివాహం చేసుకోవాల్సిందిగా, ఉత్తమ కుటుంబాన్ని స్థాపించాల్సిందిగా, సంతానాన్ని – ఆడ మగ అనే వివక్ష చూపకుండా సత్సోరులుగా తీర్చి దిద్దాల్సిందిగా ఆయన (స) యువకుల్ని ప్రోత్సహించేవారు.

మహనీయ ముహమ్మద్ (స) – విద్య నేర్చుకోవాల్సిందిగా, పండుగ సమాజు వంటి సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనాల్సిందిగా ఆయన మహిళల్ని ప్రోత్సహించేవారు. అలాగే పురుషులు వారి బాధ్యతలను నిర్వర్తించినట్లే, స్త్రీలు – వారి బాధ్యతలను సజావుగా నెరవేర్చాలి అని హితవు పలికేవారు. ఇస్లాంలో మహిళలు కూడా అల్లాహ్ సమక్షంలో వారికి సంబంధించిన బాధ్యతల గురించి ప్రశ్నించబడతారు. ఖుర్ఆన్ మరియు ప్రామాణికమైన హదీసుల ఆధారంగా – సాంఘిక, సాంసారికి బాధ్యతలను నిర్వర్తించాలి. అప్పుడే ఆమె అన్ని రకాల అపమార్గాల నుండి, అపసవ్యతల నుండి, పొరపాట్ల నుండి కాపాడబడుతుంది. ఫలితంగా ఓ సత్సమాజం నిర్మాణంలో ఆమె బలమైన ముద్రను వేయగలుగుతుంది.

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: ప్రవర్తన రీత్యా ఉత్తములైన వారే విశ్వాసం రీత్యా పరిపూర్ణులు. మీ మహిళల యెడల ఉత్తములైన వారే మీలో పురుషోత్తములు. (తిర్మిజీ)

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: నేను మరియు ఓ అనాథ పోషణ బాధ్యతను తీసుకున్న వ్యక్తి స్వర్గంలో ఇలా తోడుగా ఉంటాము – అని ఆయన తన చూపుడు వ్రేలుని, మధ్యస్థ వ్రేలుని కాస్త ఎడంగా ఉంచి చూపించారు. (బుఖారి)

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: నువ్వు ఎక్కడ ఏ అవస్థలో ఉన్నా అల్లాహ్ యెడల తఖ్వా కలిగి జీవించు. నీ వల్ల ఒక తప్పు జరిగితే వెనువెంటనే ఓ మంచి కార్యానికి శ్రీకారం చుట్టు. ప్రజలతో మంచిగా మసలుకో. (తిర్మిజీ)



ప్రకృతిసిద్ధ ధర్మం ఇస్లాం

అల్లాహ్ మనిషిని ఏ నైజం మీద అయితే పుట్టించాడో, ప్రకృతిసిద్ధంగా ఏ అవసరాలయితే అతనికుంటాయో – వాటన్నిటికి అనుకూలంగా ఇస్లాం ధర్మం ఉంటుంది. ఇస్లాం ధర్మం – మనిషి శారీరక, ఆత్మ పరమైన అవసరాలను ధర్మ రీతిలో పూర్తి చేస్తుంది. చోటు చేసుకున్న రుగ్మతలను ప్రక్షాళిస్తుంది. మనిషిలో సహజాంగా ఉండే భావోద్రకాలను చక్కటి పద్ధతిలో పూర్తి చేయడంలో తనకి గానీ, ఇతరులకు గానీ ఎలాంటి హాని కలగని విధానాన్ని అవలంభిస్తుంది.

అధ్యాయం
11

ఇస్లాం ఓ సంపూర్ణ జీవన సంవిధానం

1 ఇస్లాం ఓ సంపూర్ణ జీవన సంవిధానం ఎలా అయింది?

* ఇస్లాం నిజ దైవమైన అల్లాహ్ ను మాత్రమే ఆరాధించే (తౌహీద్) ధర్మం. అది విశ్వజనీన సందేశం, గ్రంథం, శాస్త్రం కలిగిన ధర్మం. అది ప్రజలందరి కోసం వారి ప్రభువు తరఫున సమ్మతించి ఆమోదించబడిన అంతిమ ధర్మం. అల్లాహ్ – ఆయన తప్ప మరో నిజ ఆరాధ్యుడు లేడు. ఆయన తప్ప వేరే నిజ సృష్టికర్త, పూజ్యనీయుడు లేడు. ఆయన తన దాసులు మరియు సృష్టి చరాచరాల యెడల కరుణ, వాత్సల్యం గలవాడు. ఆయన వారందరి శ్రేయాన్ని, క్షేమాన్ని, మేలునే కోరుకుంటాడు. వారిని మార్గభ్రష్టత్వం నుండి , వృధా అవ్వడం నుండి కాపాడుతాడు. ఆ నిమిత్తమే ఆయన – వారి జీవితాలను క్రమబద్ధీకరించడానికి, క్రమశిక్షణలో పెట్టడానికి ధర్మ శాస్త్రాన్ని అవతరింపజేశాడు. ఆయన పంపిన ధర్మశాస్త్రం – భిన్న సంస్కృతులు, విభిన్న తెగలు, వైవిధ్య భాషలు గల ప్రజలందరికీ ఏక సమయంలో సరిపోతుంది.
* ఇస్లాం ధర్మం – అంతిమ ఆకాశ గ్రంథమైన ఖుర్ఆన్ తో వచ్చింది. ఖుర్ఆన్ గ్రంథం స్పష్టమైన సత్యంతో అవతరించింది. అది తనకు పూర్వం వచ్చిన ఆకాశ గ్రంథాలను ధృవీకరించడంతోపాటు – ఆయా గ్రంథాల సారాంశాన్ని సంరక్షిస్తుంది. అన్ని యుగాలు, అన్ని కాలాలకు, ప్రాంతాలకు అనుకూల జీవన విధానాన్ని అందించే గొప్ప రాజ్యాంగ గ్రంథం. దానికి సంపూర్ణ రక్షణను అల్లాహ్ కల్పించాడు.


* సమస్త మానవాళి కోసం అల్లాహ్ సమ్మతించి ఆమోదించిన ధర్మం ఇస్లాం. మొత్తం మానవాళి మేలును కోరే గొప్ప విలువలతో కూడిన ధర్మం ఇస్లాం.. అది మానవాళికి సౌభాగ్యవంతమైన జీవితాన్ని ప్రసాదించడమే కాక, జాతులు ఉన్నతిని సాంధించుకోగలిగే గొప్ప ఘన సంస్కృతిని అది మానవాళికి అందజేస్తుంది. భాషలు మరియు జాతులతో సంబంధం లేకుండా ప్రజలను ఏకం చేసే స్థిర ధర్మం ఇస్లాం.

* గత అధ్యాయాల్లో – సామాజిక, సాంఘీక జీవనంలో ఇస్లాం ధర్మ సౌందర్యాన్ని చూశాము. ఇస్లాం – న్యాయ శీల ధర్మం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ధర్మం. శాంతి కరుణల ధర్మం. మధ్యస్థ ధర్మం. జ్ఞాన వివేకాల ధర్మం. కుటుంబ, సాంఘీక ధర్మం, చైతన్యం, అభ్యుదయాల ధర్మం. శుచీశుభ్రతల ధర్మం. అందం, ఆరోగ్యాల ధర్మం.

* రాబోయే అధ్యాయంలో – మనిషి వ్యక్తిగత జీవితంలో ఇస్లాం ధర్మం తీసుకొచ్చే గొప్ప మార్పును గురించి తెలుసుకుందాం! అది వ్యక్తి జీవితాన్ని ఎంత అందంగా మలచిందో గ్రహిద్దాం! ఇస్లాం ధర్మ సౌందర్యం వ్యక్తి మరియు సంఘ జీవనంలో ఎలా ప్రతిబింబించిందో, సానుకూల జీవనాన్ని ఎలా ప్రసాదించిందో, ఎలా ఓ శ్రేయోదాయకమైన వాతావరణాన్ని అది అనుగ్రహించిందో తెలుసుకుందాం!

* మహనీయ ముహమ్మద్ (స) – 23 సంవత్సరాలు – ధర్మాన్ని విశ్వాసం మరియు ఆచారం రీత్యా ఎలా పాటించాలి అన్న విషయాన్ని ముస్లింలకు నేర్పారు. వారి వయక్తిగత, సాంఘీక జీవనం ఎలా ఉండాలో బోధ పర్చారు. ఎవరు ఎవరితో ఎలా వ్యవహరించాలో పూస గుచ్చినట్టు ఎరుక పర్చారు. ఇస్లాం – విశ్వాసం సదాచరణల ధర్మం, సైద్ధాతిక ఆచరణల ధర్మం. ఈ ప్రత్యేకతలు కారణంగానే – ఇస్లాం స్వీకరించిన వ్యక్తి నడకలో, నడవడికతో, మాటలో, బాటలో ఇస్లామీయ బోధనలు ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. ఫలితంగా వారి జీవితం సానుకూల, ప్రభావవంతమైన విధానం అవుతుంది.

ఇస్లాం – మీ అనుబంధాన్ని మీ ప్రభువుతో అనుసంధానించడమే కాక, మిమ్మల్ని మీకు మీ కుటుంబానికి , మీ సంఘానికి, మీ పరిసరాలకు దగ్గర చేస్తుంది. ఫలితంగా మీరు మీ హృదయ క్షేత్రంలో శాంతి ప్రశాంతతలను చూస్తారు – అదే మీ ప్రవర్తనలో ప్రతిబింబిస్తుంది.



ఇచ్ఛ, వాంఛ అంటే, మనసుకు పసందైన ఆహారపానీయాలు, కామ కోరిక, ధన, సంతాన కాంక్ష. అదొక చోదక శక్తి దానికి సర్దుబాటు మరియు దిశ నిర్దేశం అవసరం.

మీ ఇచ్ఛ, వాంఛను సరైన మార్గంలో పెట్టడానికి, మీ కోరికలను నియంత్రణలో ఉంచడానికి, శ్రేయస్కర మార్గంలో నడిపించడానికి మంచీచెడుల విచక్షణా జ్ఞానాన్ని అల్లాహ్ మీకు అనుగ్రహించాడు.




మీ సమయం మరియు మీ నిద్ర

* మీరు వాస్తవ రూపంలో ఇస్లామీయ జీవన మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించాలంటే, సూర్యోదయం నుండి రాత్రి వరకు అల్లాహ్ తన యుక్తితో విధిగావించిన నమాజులు సజావుగా, శ్రద్ధాసక్తులతో ఆచరించాలి. నమాజు పరిరక్షణలో మీ సమయ రక్షణ దాగుంది. ఫజ్ర్ నమాజు సమయానికి చేయడం అలవాటయితే, ఎప్పు డు లేవాలి, ఎప్పుడు పడుకోవాలి? అన్న విచక్షణ మీకు అలవడుతుంది.

* మనిషి తన దినచర్యను ఉదయం పెందలాడే ప్రారంభించడం ఎంతో అభిలషణీయ మైనది. ఇస్లాం తన అనుయాయుల్ని తెల్లవారుజామునే జీవనోపాధి అన్వేషణ ప్రారంభించాల్సిందిగా ప్రోత్సహిస్తుంది. సఖర్ అల్ గామిదీ (ర) గారి కథనం ప్రకారం ప్రవక్త (స) – ఓ అల్లాహ్! నా సముదాయపు ఉదయపు తొలి వేళలో శుభాన్ని ప్రసాదించు అని వేడుకున్నారు. (తిర్మిజీ)

  అల్లాహ్ పగటిని జీవనోపాధి సమయంగా చేశాడు. ఈ కారణంగానే ప్రజలు పెందలాడే పనులకు బయలుదేరడం మనం చూస్తాము.

* అనేక అభివృద్ధి చెందిన పాశ్చాత్య సమాజాలలో ప్రజలు త్వరగా మేల్కొలపడం మనం చూస్తాము. వారు తమ రోజును ఎంతో ఆహ్లాదంగా, హుషారుగా ప్రారంభిస్తారు. చక్కటి వ్యాయామంతో పొద్దును ప్రారంభిస్తారు. ఆనక పనికి వెళ్తారు. అలాగే రాత్రి తొందరగా నిద్రపోతారు.





ఒక ముస్లిం ఆరోగ్యవంతమైన, చైతన్యవంతమయిన జీవితాన్ని గడుపుతాడు.

మీ ఆహారపానీయాలు



* ఒక ముస్లిం పరిశుద్ధమైన ఆహారపానీయాలను మాత్రమే భుజిస్తాడు. ఉదాహరణకు – మాంసాహారం: అల్లాహ్ హలాల్ చేసిన కొన్ని జంతువుల మాంసాన్నే ఆరగిస్తాడు. ఇతర జంతువులను వేటాడని జంతువుల మాంసం, చనిపోయిన, కుళ్లిపోయిన జంతువులను తినని జంతుల మాంసం మాత్రమే హలాల్. (ఉదాహరణ: ఆవులు, గొర్రెలు, ఒంటెలు మరియు కోళ్లు).
* హలాల్ జంతువుల మాంసాన్ని ఆరోగ్యవంతంగా ఎలా భుజించాలో ఇస్లాం మనకు నేర్పుతుంది. చనిపోయిన జంతువులు, రక్తం, పంది మాంసం మరియు ఇతర జంతువులను వేటాడే, పీక్కు తినే, క్రూర జంతులను భుజించకూడదు అంటుంది. ఒక ముస్లిం – పిల్లి, గబ్బిలం, పాము, ఎలుక, కోతిని తినడు. అదే సమయంలో కొన్ని సమాజాలు ఈ జంతువులపై దాడి చేసి వాటిని ధర్మ విరుద్ధంగా క్రూర పద్ధతిలో చంపేయడం మనము చూస్తాము. వారి ఈ వైఖరి అంతకు పూర్వం ఎరుగని వైరస్ల, వ్యాధుల వ్యాప్తికి దారి తీయవచ్చు.
* ఒక ముస్లిం మత్తుపానీయాలు, మాదక ద్రవ్యాలు, మద్యం సేవించడు. వీటికి బదులుగా – ఆరోగ్య పానీయాలు, పళ్ళ రసాలను సేవిస్తాడు.



మీ ఆహార అలవాట్లు

* ఇస్లాం విశిష్టతను తెలియజేసే ఆహార పానీయాలకు సంబంధించిన మర్యాదలను ఇక్కడ పొందు పరుస్తున్నాము. ఆహార పానీయాల్లో వృధా ఖర్చును ఇస్లాం ఖండిస్తోంది. దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు; మనిషి నింపే పాత్రల్లో అతి చెడ్డ పాత్ర అతని కడుపు. ఆదమ్ పుత్రుని నడుమును నిలబెట్టగలిగే కొన్ని ముద్దలు అతనికి సరిపోతాయి. ఒకవేళ బాగా తినాలనుకుంటే, ఒక భాగం ఆహారానికి, ఒక భాగం పానీయానికి, ఒక భాగం శ్వాస తీసుకోవడానికి. (తిర్మిజీ)
* అలాగే దైవ ప్రవక్త (స) మనిషి దేహానికి మేలు చేసే కొన్ని ఆహార పదార్థాలను, పళ్ళను గురించి తాకీదు చేయడమే కాక, స్వయంగా ఆయన (స) తన రోజువారీ ఆహారంలో వాటిని విరివిరిగా సేవించేవారు. ఉదాహరణకు – జైతూన్–ఆలివ్, తేనే, ఖర్జూరం, కలోంజీ, వెనిగర్, పుట్టగొడుగులు – మష్రూమ్.

ఆయన ఇలా అన్నారు: వెనిగర్ ఎంత స్వాదిష్టమైన కూర! (ముస్లిం)


నిశ్చయంగా కలోంజీ – సర్వ రోగ నివారిణి. మరణం తప్ప. (బుఖారీ)

ఆలివ్ నూనె తినండి, శరీరానికి పూసుకోండి, నిశ్చయంగా అది (జైతూన్ నూనె) శుభప్రదమైన చెట్టుకి చెందినది. (అహ్మద్)





* ఒక వ్యక్తి తన జీవితంలో ఇస్లాం ధర్మాన్ని వర్తింపజేసినప్పుడు, తన ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారం, పానీయం, మాదకద్రవ్యాలు, మత్తుపానీయాలు – వేటికయినా దూరంగా ఉంటాడు.
* ఇస్లాం ధర్మ ప్రత్యేకత ఏమిటంటే, దాని అభ్యాసం మానవ ఆరోగ్యాన్ని మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వుజూ మరియు స్నానం ద్వారా ఆరోగ్యం మరియు రక్షణ లభిస్తుంది. రోజువారీ ఐదు పూటల నమాజు చేయడం, రుకూ చేయడం, సజ్దా చేయడం ద్వారా ఎంతో మేలు కులగుతుంది. రమజాన్ పూర్తి మాసపు ఉపవాసాలు, స్వచ్ఛంద ఉపవాసాలు శరీరానికి ఎంతో మేలైనవి, ఆరోగ్యకరమైనవి, శ్రేయస్కరమైనవి.
* నిద్రకు, దంత ధావనం, హిజామా (చెడు రక్తాన్ని ప్రక్షాళించే ప్రక్రియ)కి సంబంధించి దైవప్రవక్త (స) వారి సున్నత్‌లను అనుసరించడం, ఇతర సున్నత్‌లను పాటించడం శరీరానికి ఆరోగ్యం, బలం మరియు శ్రేయస్సు.
* ఇస్లాం మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి సహాయపడుతుంది. ప్రయోజనకరమైన క్రీడలు, సాధన, వ్యాయామం చేయమని మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. అవి ప్రమాదకరం, ప్రాణాంతకం కానంత వరకూ.
* దైవ ప్రవక్త (స) శరీరాన్ని దృఢతరం చేసుకోవడానికి మధ్యాహ్నం నిద్రపోవడాన్ని ప్రోత్సహించారు. ఆయన ఇలా అన్నారు: "మధ్యాహ్నం మీరు కాసేపు మేను వాల్చండి, ఖైలూలా చేయండి. ఎందుకంటే షైతాన్ ఖైలూలా చేయడు. (అల్–తబరానీ) దీనిని ఆధునిక విజ్ఞాన భాషలో ఉత్తేజ పర్చే అల్పనిద్ర అని పిలుస్తారు.



బలహీనమైన విశ్వాసికన్నా
బలవంతుడైన విశ్వాసి ఉత్తముడు
మరియు అల్లాహ్ కు మిక్కిలి ప్రియుడు.
(ముస్లిం)




* ఒక ముస్లిం దివారాత్రుల్లో అయిదు పూటల ప్రార్థనలు ఎంతో శ్రద్ధాసక్తులతో చేస్తాడు. ఇది అతని శ్రమైక జీవనానికి, కార్యపరిధికి ఒక ఉపశమనం, ఒక విశ్రాంతి, సమతౌల్యంతో కూడిన ప్రక్రియ. అతని ఈ జీవన ప్రక్రియ చివరి వరకూ ఇలానే ఎంతో క్రమబద్ధంగా, క్రమశిక్షణగా ముందుకు సాగుతుంది. ఒక ముస్లింకి ఆత్మశూన్యత అన్న సమస్యే ఉండదు. ప్రపంచ జనాభాలో దాదాపు మూడింట ఒక వంతు లేదా అంతకంటే ఎక్కువ మంది ఈ సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారు. వారిలో అనారోగ్యంతో బాధ పడుతున్నవారు ఆత్మహత్యను ఆశ్రయిస్తారు.
* ఒక ముస్లిం తన నిజప్రభువుని వేడుకుంటాడు. పూర్తి నమ్మకంతో ఆయన్నే నమ్ము కుంటాడు. ఆయన తీర్పుకి తలవంచుతాడు. ఆయన యుక్తితో సంతుష్టి చెందుతాడు. ఫలితంగా – మనశ్శాంతిని పొందుతాడు. విధివ్రాత పట్ల విశ్వాసం ఈమాన్ అర్కానులలోని ఒక రుక్న్ అని గమనించాలి.
* నోమాన్ బిన్ బషీర్ (ర) గారి కథనం – దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: దుఆ అదే అసలు ప్రార్థన. ఆ తర్వాత ఆయన ఈ ఆయతుని చదివారు: మీ ప్రభువు చెబుతున్నాడు: "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థన స్వీకరిస్తాను. అహంకారంతో నన్ను ఆరాధించ డానికి అంగీకరించనివారు నీచులై నరకానికి పోతారు. (అల్–మోమిన్: 60) (తిర్మిజీ, అబూ దావూద్)
మనం ప్రతి చిన్నాపెద్ద విషయంలో దీనాతిదీనంగా అల్లాహ్ సహాయాన్ని కోరుకోవాలని, ఆయన్ను వేడుకోవాలని ఉపదేశించారు ప్రవక్త (స).





* నకారాత్మక (నెగిటివ్) ఆలోచన, భవిష్యత్తు తాలూకు అనవసర భయం అన్నది – అల్లాహ్ కు మనల్ని మనం పూర్తిగా చేసుకునే స్వయం సమర్పణకు పూర్తి విరుద్ధం. దైవ ప్రవక్త (స) సకారాత్మక (పాజిటివ్) ఆలోచనను ప్రోత్సహించేవారు. బాధ, ఖేద, స్వయం కీడు, షైతాన్ చెడు నుండి అల్లాహ్ శరణు కోరేవారు.
* హజ్రత్ అబూ బకర్ (ర) గారి కథనం – ఆయన దైవప్రవక్తతో ఇలా అన్నారు:
ఓ దైవ ప్రవక్తా! నేను ఉదయం సాయంత్రాలు ఏం చెప్పాలో నాకు నేర్పించండి. అందుకాయన – ఓ అబూ బకర్! ఇలా అను, అని ఈ క్రింది దుఆను నేర్పించారు.
అల్లాహుమ్మ ఫాతిరస్సమావాతి వల్ అర్జి ఆలిమల్ గైబి వషహాదతి రబ్బ కుల్లి షైఇన్ వ మలీకహు అష్ హదు అల్లా ఇలాహ ఇల్లా అంత అఊజు బిక మిన్ షరి నఫ్సీ వ షరిష్ షైతాని వ షిర్కిహీ, వఅన్ అక్తరిఫ అలా నఫ్సీ సూఅన్ ఔ అజుర్రహూ ఇలా ముస్లిమ్. (తిర్మిజీ)
* దైవ ప్రవక్త (స) మనకు ముఅవ్వజాత్ నేర్పించారు. అంటే, సూరహ్ ఇఖ్లాస్, సూరహ్ ఫలక్, సూరహ్ నాస్. ఒక ముస్లిం వీటి ద్వారా – మాటిమాటికి వచ్చి భ్రమలు కలిగించి కలతలు రేపేవాడి కీడు నుండి అల్లాహ్ శరణు వేడుకుంటాడు. – ప్రజల హృదయాలలో భ్రమలు కలిగించి కలతలు రేపేవాడు మానవుల్లోనూ ఉండవచ్చు; జిన్నుల (భూతాల)లోనూ ఉండవచ్చు – వారందరి కీడు నుండి అల్లాహ్ శరణు వేడుకుంటాడు.



మీ నోరు, మీ మాట



* అల్లాహ్ కు నచ్చని, ఆయన మెచ్చని మాట – నింద, పరోక్ష నింద, అసత్యం, అశ్లీలం, నీతిబాహ్య సంభాషణ, పరదూషణ, పరుష పదజాలం , శాపనార్థాలు వంటివి మన నోట రాకుండా కాపాడుతుంది ఇస్లాం. ఈ సుశిక్షణ మూలంగా అతని నోరు మంచిదవుతుంది, మేలైనది, సత్యమైనది, ధర్మమైనది తప్ప అతని నోట మరో మాట రాదు. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది అన్న నానుడి మనందరికీ తెలిసిందే కదా!
* దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు; నిజమైన ముస్లిం ఎవరంటే, తన నోటితోగానీ, తన చేతితోగానీ ఇతర ముస్లింలకు ఎలాంటి హాని కలుగజేయనివాడు. (బుఖారీ) మరో సందర్భంలో ఆయన ఇలా అన్నారు: అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి – పలికితే మంచి మాటలే పలకాలి లేదా మౌనం వహించాలి. అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి – తన ఇరుగు పొరుగుని గౌరవించాలి. అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి – తన అతిథిని సత్కరించాలి, గౌరవించాలి.. (బుఖారీ, ముస్లిం)
* దైవ ప్రవక్త (స) ఫాల్ ను ఇష్టపడవారని తెలుస్తుంది. ఫాల్ అంటే – మంచి మాట.

మీ హృదయం - మీ హృదయం - మీ హృదయం



మనం నిష్కల్మషమైన మనసు ఎలా కలిగి ఉండాలి అన్న విషయం ఇస్లాం మనకు నేర్పుతుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: మానవులారా! మీ ప్రభువు నుండి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. ఇది మీ హృదయ రుగ్మతలకు నివారిణి. దీన్ని స్వీకరించేవారికి ఇది మార్గదర్శిని, కారుణ్యప్రదాయిని.(యూనుస్: 57)

ఆరోజు సంతానం, సిరిసంపదలు ఏమాత్రం ఉపయోగపడవు. నిష్కల్మషమైన హృదయంతో అల్లాహ్ సన్నిధికి వచ్చినవారికే ఆరోజు ప్రయోజనం ఉంటుంది." (అష్–షుఅరా: 87,88)

ఇక్కడ ఇవ్వబడుతున్న ఈ గాథను చదవండి! ఇందులో దైవ ప్రవక్త (స) మనిషి వినిర్మల హృదయం యొక్క ప్రాముఖ్యతను ఎంతో హృద్యంగా తెలియజేశారు. మనిషి తన మనసుని అపోహలు నుండి, అపార్థాలు నుండి, శంకలు, సందేహాలు వంటి హృదయ రోగాలు, రుగ్మతల నుండి కాపాడుకోవాలన్నారు. ఈ గాథను అందరి సౌకర్యార్థం ముక్తసరిగా పేర్కొంటున్నాము.



హజ్రత్ అనస్ (రజి) వారు ఇలా తెలియజేశారు. మేమంతా మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి వద్ద కూర్చుని ఉన్నాము. మాతో ప్రవక్త (స) వారు మీ వద్దకు ఇప్పుడు ఓ స్వర్గవాసి రానున్నాడు. మరుసటి రోజు కూడా అలానే అన్నారు. అలానే మూడో రోజు మీ వద్దకు ఇప్పుడు ఓ స్వర్గవాసి రానున్నాడు అన్నారు. అక్కడ అబ్దుల్లాహ్ బిన్ అమర్ బిన్ ఆస్ (రజి) వారు కూడా ఉన్నారు. ఆయనకు ఒక ఆలోచన తట్టింది. సదరు వ్యక్తి చేస్తున్నది ఏమిటి అన్నది తెలుసుకొని తను కూడా అలానే ఆచరించి స్వర్గాన్ని పొందే మార్గాన్ని సులభతరం చేసుకోవాలని భావించి ఆ వ్యక్తి వద్దకు వచ్చి – తన తండ్రితో తగాదా పడ్డానని చెప్పి మూడురోజుల పాటు ఆయన ఇంటిలో ఉండేందుకు అనుమతి కోరారు. ఆ వ్యక్తి అబ్దుల్లా (రజి) వారికి ఉండేందుకు అనుమతి ఇచ్చారు. ఉన్నన్ని రోజులు ఆయన ఆ వ్యక్తిలో ఎలాంటి ప్రత్యేకతలు చూడలేదు. ఆయన రాత్రిపూట తరచూ తహజ్జుద్ చదివే అలవాటు లేదు. మరే ప్రత్యేకమైన విషయాలు ఆయనకు కనిపించలేదు. కాని ఆయన నిద్రలో అటు ఇటు పొర్లినప్పుడు సుబ్హానల్లాహ్ ..అలాముల్లిహ్ అన్న జిక్ తప్ప మరే ప్రత్యేకత అతనిలో ఆయనకు కనిపించలేదు. మూడోరోజు ఆ వ్యక్తితో తను వచ్చినది ఎందుకో వివరించారు. నాకు మా నాన్న గారికి ఎలాంటి గొడవ జరగలేదు. ప్రవక్త (స) మేము కూర్చుని ఉండగా మీరు వచ్చేముందు స్వర్గవాసి రానున్నాడు అన్నప్పుడు మూడుసార్లు మీరే వచ్చారు. ఇంత ఘనత మీకు దక్కడానికి మీరు ఆచరించే ఆచరణ ఏమిటా.. అన్నది తెలుసుకోవాలని మూడురోజులు మీ ఇంటిలో ఉన్నాను. కాని నాకు మీలో స్వర్గాన్ని చేర్చే ఆ ప్రత్యేక ఆచరణ ఏమిటో అర్థం కాలేదు. మీరే చెప్పండి మీ ప్రత్యేకత ఏమిటి? అన్నారు. అది విని ఆ వ్యక్తి – నేను చేసే ఆచరణ నీవు మూడు రోజులు చూసావు. ఇవి కాకుండా ఇంకో రెండు ఆచరణలు నేను పాటిస్తూ ఉంటాను. 1. ఏ ముస్లింపై ఎలాంటి కుళ్ళు కపటం, కల్మషం ఉంచుకోను. 2. అల్లాహ్ ఎవరిపైన అయినా అనుగ్రహించి వారికి మేలు జరిగితే నేను అది చూసి అసూయ పడను. కుళ్ళు, ఈర్ష, ద్వేషాల నుండి దూరంగా ఉంటాను. అప్పుడు ఆయన ఆ వ్యక్తిని ఉద్దేశించి ఇలా అన్నారు – (శత విధాలా ప్రయత్నించినా) మా వల్ల సాధ్య పడనిది మీ వల్ల అయ్యింది. అల్లాహ్ మీ కల్మషం లేని మనస్సు గుర్తించే మీకు స్వర్గాన్ని ప్రసాదించాడు అన్న విషయం నాకు అర్థం అయ్యింది అన్నారు అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి). (షుఅబ్ అల్ –ఇమాన్‌లో అహ్మద్ మరియు అల్ –బైహకీ ద్వారా వివరించబడింది మరియు దాని సనద్ (ప్రసార గొలుసు) బుఖారీ మరియు ముస్లింల షరతుల ప్రకారం ఉంది.)

2 ఆధ్యాత్మిక మరియు భౌతిక సమతుల్యత

* అల్లాహ్ మనిషిని శరీరం, మేధ మరియు ఆత్మ – మూడింటి మేలిమి కలయికతో సృష్టించాడు. అతని అన్ని అవసరాలను తీర్చాడు. ఆరోగ్యకరమైన జీవితానికి వాటి మధ్య సమతుల్యత అవసరం. పదార్థం మానవ శరీరం ద్వారా ప్రాతినిధ్యం వహిస్తుంది. ఇది పని, ఆరాధన మరియు కదలికలకు బాధ్యత వహిస్తుంది. అయితే ఆత్మ ఈ శరీర జీవానికి మూలం మరియు దానికి కార్యాచరణ మరియు శక్తిని ఇస్తుంది. మేధ విషయానికొస్తే, మనిషి మేధ ఆధారంగా సత్యాసత్యాల మధ్య, తప్పొప్పుల మధ్య, మంచీచెడుల మధ్య తేడాను గుర్తిస్తాడు. అతను తన శరీరం మరియు ఆత్మ అవసరాలకు మధ్య నిర్ణయాధికారిగా ఉంటాడు.

శరీరం

దేహ అవసరాల్లో ఆహారపానీయాలు, వాంఛ, విశ్రాంతి.


మెదడు

మెదడు అవసరాల్లో ప్రయోజనకరమైన విద్య, మెదడుకు మంచి ఆలోచనల మేత.

ఆత్మ

మానసిక సమతుల్యతను సాధించడానికి ఆత్మ అవసరాలలో ఒకటి ప్రశాంతత, స్థిరత్వం మరియు ఆప్యాయత.

* అతి అంటే ప్రాపంచిక విషయాలలోగానీ, మత సంబంధిత విషయాలలో మధ్యే విధాన పరిమితులను మించిపో పోవడం. "అతి సర్వత్ర వర్జయేత్" అనేది మనందరికీ తెలిసినదే. ఈ అతిని అణగత్రొక్కడానికి ప్రవక్త (స) మేధో పరమైన, ప్రవర్తన పరమైన నియమాలను ఏర్పాటు చేశారు. ఆయన ధర్మ విషయంలో కాఠిన్యాన్ని, కరకుదనాన్ని, మూర్ఖత్వాన్ని, మౌఢ్యాన్ని అసహ్యించుకున్నారు. ఆయన ఆహారం, దుస్తులు – ఆహార్యం మరియు ఇతర ప్రాపంచిక, భౌతిక సంతోష, సంతాప విషయాలలో సయితం అతిని అసహ్యించుకున్నారు.



హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (ర) గారి కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ధర్మంలో తమకు తాముగా కాఠిన్యతను సృష్టించుకున్నవారు నాశనం అయ్యారు. ఇదేమాట మూడుసార్లు అన్నారు.

(ముస్లిం, అబూ దావూద్)

'ముతనత్తిఊన్' అంటే షరీఅత్లో కాఠిన్యత లేనిచోట కాఠిన్యతను ప్రదర్శించటం, కొత్త పోకడలు, బిద్అత్లు, అనవసరంగా కూపీలు లాగేవారు అని భావం.

* హజ్రత్ అనస్ (రజి) కథనం: ముగ్గురు వ్యక్తులు దైవప్రవక్త సతీమణుల ఇండ్లకు వచ్చి, దైవప్రవక్త ఆరాధన విషయమై వారిని ప్రశ్నించసాగారు. వారికి ఆయన (స) ఆరాధన విధానం బోధించబడింది. వారు దాన్ని తక్కువగా భావించి, "ఆయనెక్కడా? మేమెక్కడా? ఆయన వల్ల గతంలో జరిగిన పాపాలు, జరగబోయే పాపాలన్నీ క్షమించ బడ్డాయి. (కనుక మేము ఆయనకంటే ఎక్కువగా ఆరాధన చేయాలి)" అని అనుకున్నారు. వారిలో ఒకడు, "ఇక నుంచి నేను ఎల్లప్పుడూ రాత్రంతా పడుకోకుండా నమాజుల్లో గడుపుతాను" అని అన్నాడు. రెండవవాడు, "నేను ఇకపై ఎల్లప్పుడూ ఉపవాసముంటాను. ఉపవాసాన్ని విరమించను" అని అన్నాడు. మూడో వ్యక్తి, "నేనైతే స్త్రీలకు దూరంగా ఉంటాను. ఎన్నటికీ వివాహం చేసుకోను" అని ప్రతిజ్ఞ చేశారు. (వారి మాటల గురించి తెలుసుకొని) దైవప్రవక్త (స) వారివద్దకు వెళ్ళి, "మీరు ఇలా అన్నారా?" అని ప్రశ్నించారు. (వారు అవునని సమాధానమివ్వగా) ఆయన, "జాగ్రత్త! అల్లాహ్ సాక్షి! నేను మీ అందరికంటే ఎక్కువగా అల్లాహ్ కు భయపడేవాడ్ని, అందరికంటే ఎక్కువగా ఆయన పట్ల భీతి గలవాడ్ని. కాని నేను ఉపవాసాలూ ఉంటాను, (అప్పుడప్పుడూ) వాటిని వదలుతాను కూడా. (రాత్రి పూట) నమాజూ చేస్తాను. పడుకుంటాను కూడా. ఇంకా నేను స్త్రీలను వివాహం కూడా చేసుకుంటాను. (కనుక ఈ పనులన్నీ నా సంప్రదాయాలే). ఎవడైతే నా విధానం పట్ల విముఖత చూపుతాడో అతడు నా వాడు కాదు. నాకు అతనితో ఎలాంటి సంబంధం లేదు)" అని హెచ్చరించారు. (బుఖారీ – ముస్లిం)

ఇస్లాం ధర్మం – దేహ అనేక అవసరాలను పరిత్యజించాలని చెప్పే వైరాగ్యాన్ని, సన్యాసత్యాన్ని నిషేధిస్తుంది. దైవ ప్రవక్త (స)తో రూఢి అయిన విషయం – ఆయన ఇలా అన్నారు: నమాజు కోసం ఇఖామత్ చెప్పబడింది, అదే సమయంలో రాత్రి భోజనం హాజరు పరచబడి ఉంది. అలాంటి స్థితిలో ముందు రాత్రి భోజం పూర్తి చేయండి. (బుఖారీ, ముస్లిం) ప్రవక్త మహనీయ (స) ఇలా ఎందుకు చేశారంటే, ఆకలితో అలమటిస్తూ నమాజు చేయకూడదనే. అలాగే ప్రవక్త (స) – శక్తి మేర మాత్రమే రాత్రి ప్రార్థనలు చేయాలని, అలసిపోతే విశ్రాంతి తీసుకోవాలని నొక్కి వక్కాణించారు.

3 ఇస్లాం సానుకూల దృక్పథం - శాశ్వత సౌభాగ్యాన్ని అందించే ధర్మం

* మనిషి ఇస్లాంను తన ధర్మంగా, సంపూర్ణ జీవన సరళిగా స్వీకరిస్తే – అటు భౌతికంగానూ, ఇటు ఆధ్యాత్మికంగానూ మహోన్నత స్థాయికి చేరుకుంటాడు. తద్వారా ఇహపరాల సాఫల్యం, మోక్షం అతని సొంతమవుతుంది.

* ఇస్లాం ధర్మ మూలంగా మనిషి తనకు ఉనికినిచ్చిన నిజకర్త స్వామిని తెలుసుకుంటాడు, ఆయనతో తన అనురక్తిని, అనుబంధాన్ని బలోపేతం చేసుకుంటాడు. నఖ శిఖ పర్యంతం అందంగా మలచిన తన దేహ సౌందర్యం, ఆత్మగౌరవం మరింత మెరుగు పడేలా, మెరిసేలా చేసుకుంటాడు.

* ఇస్లాం ప్రబోధించే విశ్వాసం ఎలాంటిదంటే, అది హృదయంలో ఒక్కసారి గూడు కట్టుకున్న తర్వాత – దాని శుభ ప్రభావం – ప్రజల యెడల అతని ఉత్తమ ప్రవర్తన రూపంలో, సానుకూల ప్రతిస్పందన రూపంలో ప్రతిబింబిస్తుంది. మనిషి తన చుట్టూ ఉన్న ప్రజలతో, పరిసరాలతో ఎంతో చక్కటి వ్యవహార సరళి కలిగి ఉంటాడు. మనిషి తన నైజం రీత్యా – తన విజయాన్ని, తను సాధించిన సత్ఫలితాలను చూసుకొని సంతోషిస్తాడు.

* అలా ఇస్లాం ధర్మం – మనిషి సౌభాగ్యాన్ని, సంతోషాన్ని సులభంగా సొంతం చేసుకునే మార్గాన్ని సుగమం చేస్తుంది. ఫలితంగా మనిషి ప్రశాంత జీవితాన్ని గడుపుతాడు. అలాగే పరలోక మోక్షపు జమానతు కూడా పొందుతాడు. అదే సమయంలో – అల్లాహ్ ప్రసన్నతను పొంది, భూమ్యాకాశాల అంతటి విశాలమైన స్వర్గానికి అతను వారసుడవుతాడు.

  పురుషుడైనా, స్త్రీ ఐనా విశ్వాసి అయి సత్కార్యాలు చేస్తే, వారికి మేము పరిశుద్ధ జీవితం గడిపేలా చేస్తాం. వారి సత్కర్మలకు అతి శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాం. (అన్–నహల్: 97)



4 ప్రవక్త ముహమ్మద్ (స) వారితో ఒక రోజు (ఆయన జీవన సరళి గురించి సంక్షిప్తంగా)

సానుకూలమైన, సౌభాగ్యవంతమైన, ఆరోగ్యవంతమైన, ఫలవంతమైన జీవితం గురించి మీరు అన్వేషిస్తున్నారా? జీవిత సాఫల్యానికి కావాల్సిన తాళంచెవిని మీరు కోరుకుంటున్నారా?

* ఈ సంక్షిప్త వివరణలో – ప్రవక్త (స) వారి జీవన సరళిని మీకు అందిస్తున్నాము. తద్వారా సగౌరవంగా, సమతౌల్యం గల జీవితాన్ని ఎలా జీవించాలో మీరు తెలుసుకుంటారు. మీరు జీవించే ఆ జీవితం సంపూర్ణంగా – నిత్య చైతన్యంగా, ఆరోగ్యంగా, ఆహ్లాదకరంగా, పరమానందభరితంగా, అదృష్టంతో, ఆశావాద దృక్పథంతో నిండి ఉంటుంది. సమస్యను పరిష్కరించే నైపుణ్యం, మహా కార్యాలకు శ్రీకారం చుట్టే సామర్థ్యం మీ సొంతం అవుతుంది. దీన్నే ఆంగ్లంలో – Live your life to the fullest (మీ జీవితాన్ని సంపూర్ణంగా జీవించండం) అంటారు.

* ప్రవక్త (స) వారి పవిత్ర జీవనిలో ముత్యాలు పగడాల్లాంటి అనేక గొప్ప గొప్ప విషయాలు – ఆయన బోధనలు, ఆయన సత్సంప్రదాయాలు, ఆయన ప్రవర్తనా నియమావళులు, ఆయన వ్యక్తిగత, సాంసారిక, సాంఘిక జీవితం, ఆధ్యాత్మిక, రాజకీయ సకల విషయాలు మనసు సుందరంగా, సంపూర్ణంగా దర్శనమిస్తాయి.. వాటి ఆధారంగా మనిషి – తన రోజువారి జీవితాన్ని జయవంతం చేసుకోగలదు. మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి పవిత్ర జీవని అన్ని కాలాలకు, అందరూ వ్యక్తులకు గొప్ప ఆదర్శం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

* ప్రవక్త (స) వారి పవిత్ర జీవనిలోని ప్రాథమిక అంశాలు, ప్రధాన అక్షాలను మీరు మొదట అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాము. అవి సమతుల్యతో కూడిన సానుకూల జీవిత సూత్రాలను బోధించి.. జీవితంలో విజయాన్ని సాధించేలా, ఆస్వాదించేలా మీకు గొప్ప ప్రేరణను ఇస్తాయి.

* ఈ ప్రాథమిక అంశాలలో – మీరు మీ రోజువారీ జీవితాన్ని ఎలా విభజిస్తారు? – మీ నిద్ర, మీ కార్యాచరణ, మీ ఆహారం, మీ ఆరోగ్యం, మీ కుటుంబం, సంఘం, మీ పని, మీ విద్య, మీ విశ్రాంతి మరియు వినోదం.



ప్రవక్త ముహమ్మద్ (స) తన దినచర్యను ఎలా ప్రారంభించేవాబు? ఆయన ఎలా నిద్రకు ఉపక్రమించేవారు?

* ప్రవక్త ముహమ్మద్ (స) ఫజ్ర్ నమాజుతో తన రోజుని ప్రారంభించేవారు. ఒక్క సారి నిద్ర లేచాక, మళ్ళి నిద్ర పోయేవారు కాదు. మధ్యాహ్న వేళలో కాసేపు (ఖైలూలా) మేను వాల్చడం తప్ప. ఆ సమయం 15-40 నిమిషాలు ఉండేది. (ఖైలూలా లాభాలు ఎన్నో ఉన్నాయి... తర్వాత వాటిని గురించి తెలుసుకుందాం!).

* ఆయన (స) ఒక్క సారి నిద్ర మేల్కొన్నాక ఇషా నమాజు తర్వాత వరకు ఆయన మళ్ళి నిద్ర పోయేవారు కాదు. ఆయన రాత్రి తొలి జాములోనే నిద్రకు ఉపక్రమించేవారు. సగం రాత్రి నిద్ర పోయి ఆనక లేచి మూడోవంతు రాత్రి, లేదా కాస్త ఎక్కువ ప్రార్థన చేసేవారు. రాత్రి ఆరవ వంతు అయ్యాక ఆయన మళ్ళి నిద్రకు ఉపక్రమించేవారు. హజ్రత్ బిలాల్ (ర) అజాన్ ఇచ్చేంత వరకు పడుకునేవారు. ఫజ్ర్ అజాన్ అవ్వగానే లేచి తన ఇంట్లోనే రెండు రకాతుల సున్నత్ నమాజు చేసుకొని, పిదప మస్జీద్ లో ముస్లిం సంఘంతో కలిసి నమాజు చేసేవారు.

ప్రవక్త (స) వ్యాయామం చేసేవారా?

* ప్రవక్త ముహమ్మద్ (స) ప్రయోజనకరమైన వ్యాయామం చెయ్యమని ప్రోత్సహించే వారు. ఆయన ప్రోత్సహించే క్రీడల్లో ముఖ్యమైనవి కాలి నడక, పరుగు, విలువిద్య, ఈత మరియు గుర్రపుస్వారీ. స్వయంగా ఆయన (స) సతీమణి ఆయిన్ హజ్రత్ ఆయిసా (ర.అ) ప్రవక్త (స)తో పరుగు పందెంలో పోటీ పడేవారు.ఒక సారి ఆమె గెలిచింది. ప్రవక్త (స) ఆమె కాస్త లావెక్కాక ఆమెతో పోటీ పడ్డారు. అపుడు ఆయన గెలిచారు. ఇది దానికి బదులు అని ఆయన ఆ సందర్భంలో సరదాగా అన్నారు. (ముస్నద్ అహ్మద్ – అబూ దావూద్, నసాయి, ఇబును మజహ్) ఇది ప్రవక్త (స) వారి నిరాడంబరత, గొప్ప స్ఫూర్తి మరియు మంచి ప్రవర్తనలో భాగం.

* దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: బలమైన విశ్వాసి, బలహీనమైన విశ్వాసికన్నా మిన్న. అల్లాహ్ కు ఎంతో ఇష్టమైనవాడు. మేలు అందరిలోనూ ఉంది. (ముస్లిం)



ప్రవక్త ముహమ్మద్ (స) వారి ఆహారపానీయాలు ఎలా ఉండేవి?

* దైవప్రవక్త (స) మితాహారి. ధృవీకృత హదీసులో ఇలా ఉంది. మనిషి నింపుకునే పొట్టకన్నా నికృష్టమయిన కంచం మరొకటి లేదు. మనిషి వెన్నెముకను నిలిపి ఉంచటానికి కొన్ని ముద్దల తిండి చాలు. ఇంకా ఎక్కువ తినటం తప్పదనుకుంటే మొత్తం కడుపులో మూడో వంతును అన్నం కోసం మరో మూడో వంతును నీళ్ళకోసం, ఇంకో మూడో వంతును శ్వాసకోసం కేటాయించుకోవాలి (సునన్ తిర్మిజీ)

* దైవప్రవక్త (స) ఆహారపానీయాలు సేవించడానికి ముందు బిస్మిల్లాహ్ అనేవారు. కుడి చేతితో భుజించేవారు. హజ్రత్ ఉమర్ బిన్ అబూ సలమా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఓసారి నాకు హితోపదేశం చేస్తూ, "(భోజనానికి ముందు) అల్లాహ్ పేరు చెప్పు. కుడిచేత్తో తిను. నీకు దగ్గరగా ఉన్న వాటిని తీసుకొని తిను" అని అన్నారు. (బుఖారీ – ముస్లిం)

* దైవప్రవక్త (స) కూర్చొని మూడు శ్వాసల్లో నీరు త్రాగేవారు. ఒక సారికి మరో సారికి మధ్య కాసింత వ్యవధి ఇచ్చేవారు. ఆ రెంటికి మధ్య ఆగి శ్వాస తీసుకునేవారు.

* దైవప్రవక్త (స) ఆరోగ్యవంతమైన ఆహారాన్ని ఇష్ట పడేవారు. తెల్ల పిండి పదార్థాలను ఆయన సేవించేవారు కాదు. దానికి బదులు గోధుమ పిండిని వాడేవారు. ఆయనకు ఇష్టమైన ఆహార పదార్థాల్లో – ఖర్జూరం, అంజూరం, ద్రాక్ష, దానిమ్మ, పుచ్చకాయ, తేనే, జైతూన్ – ఆలివ్ నూనె మొదలయినవి. ఆయన మాసం, గుమ్మడికాయ, సరీద్ (మాంసం కూర, రొట్టె కలిపిన ఆహార పదార్థం) కూడా తరచుగా తినేవారు.

*



హజ్రత్ ఆయిషా (ర.అ) కథనం: దైవ ప్రవక్త (స) తీపి పదార్థాలను, తేనెను ఇష్ట పడేవారు. (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఎన్నడూ ఏ ఆహార పదార్థంలోనూ లోపాన్ని ఎంచ లేదు. ఆయనకు అది ఇష్టమయితే తినేవారు, ఇష్టం లేకపోతే మానుకునేవారు. (బుఖారీ, ముస్లిం) ఆయనకంటూ ఓ ప్రత్యేక భోజన ప్రణాళిక ఉండేది కాదు. కొన్ని సందర్భాలలో – నెల రెండు నెలలు గడిచిపోయినా – ఆయన ఇంట్లో పొయ్యి వెలిగేది కాదు. ఎలాంటి తిండి పదార్థాలు లేకుండానే నెలలు గడిచిపోయేవి. ఆయనతో రూఢి అయిన మాట – "ఎవరైతే ఉదయం ఏడు అజ్వా ఖర్జూరాలు తింటారో, ఆ రోజు అతనికి విషం లేదా చేతబడి మంత్రం హాని చేయదు. (ముస్లిం) దీన్ని బట్టి ఆయన ఉదయం ఖర్జూరాన్ని తినేవారని తెలుస్తుంది. ఆయన ఇలా అన్నారు; ఖర్జూరం లేని ఇంటి వారు పస్తులతో ఉంటారు. (ముస్లిం)

* దైవప్రవక్త (స) వారి రోజువారీ జీవితంలో ఉపవాసం అవిభాజ్యమైనది. ఆయన వారాంతరం రెండు రోజులు – సోమ, గురువారాలు ఉపవాసాలుండేవారు. ప్రతి మాసంలో మూడు రోజులు (చంద్రమానపు 15 ,14 ,13) ఉపవాసముండేవారు. ఆధునిక సైన్స్ (Intermittent Fasting) సమయ పరిమితితో ఉండే ఉపవాసం యొక్క గొప్ప ప్రయోజనాలను వెల్లడించింది. నేడు అది ఆరోగ్యకరమైన జీవితానికి, చురుకైన శరీరానికి అత్యంత ముఖ్యమైన విధానాలలో ఒకటిగా మారిపోయింది.

* హజ్రత్ ముఆజా అదవియ్యా, "దైవప్రవక్త (సల్లం) ప్రతి నెల మూడు రోజులు ఉపవాసం ఉండేవారా?" అని హజ్రత్ ఆయిషా (రజి.అన్ హా) ని అడిగారు. అందుకామె 'అవున'న్నారు. తర్వాత అదవియ్యా మళ్ళీ, "అయితే ఆయన నెలలోని ఏ నెలలో ఉపవాసం ఉండేవారు?" అని అడిగారు. అందుకు ఆయిషా (రజి.అన్హా) "నెలలోని ఏ నెలన్న విషయాన్ని పట్టించుకోకుండా ఆయన ఉపవాసం ఉండేవారు" అని చెప్పారు. (సహీహ్ ముస్లిం)

హజ్రత్ అబూ జర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: నువ్వు నెలలో మూడు రోజులు ఉపవాసం ఉండదలచుకుంటే, 15 ,14 ,13వ తేదీల్లో ఉపవాస ముండు. (తిర్మిజీ–హసన్) (అంటే చంద్రమానపు 14,15 ,13 తేదీలు)

మధ్యేమార్గం, నియంత్రణ, సమతౌల్యం గల జీవితం

* దైవప్రవక్త (స) జీవితానికి సంబంధించిన సకల వ్యవహారాల్లో మధ్యేమార్గాన్ని అనుసరించేవారు. ఈ విషయంలో హద్దు దాటి వ్యవహరించేవారు కాదు. ఏ వ్యవహారంలోనూ దాని స్థాయిని తగ్గించేవారు కాదు. అన్ని విధాలా అతిని ఆయన పరిత్యజించేవారు. ఆయన తన సహచరుల్ని – ప్రాపంచిక లావాదేవీల నుండి ఆపేవారు కాదు. తనకు చెందినది తానూ తీసుకోవడంతోపాటు సమస్త విషయాల్లో మధ్యే మార్గాన్ని అవలంబించమని ఉపదేశించేవారు. ప్రపంచాన్ని పరలోక పంటపొలంగా భావించమని తాకీదు చేసేవారు.

* హజ్రత్ అబూ జుహైఫా సహబ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) సల్మాన్ (రజి)కు మరియు అబూ దర్దా (రజి)కు మధ్య (హిజ్రత్ అనంతరం) సోదరత్వాన్ని ఏర్పరచారు. సల్మాన్ (రజి) (ఒక రోజు తన ఇస్లామీయ సోదరుడు) అబూ దర్దాను కలవటం కోసం ఆయన ఇంటికి వెళ్ళారు. అప్పుడు ఆయన (అబూ దర్దా గారి భార్య) ఉమ్మె దర్దా (ర.అన్హా) మురికిగా ఉన్న బట్టలు తొడుక్కొని ఉండటం గమనించారు. అది చూసి ఆయన కుశల ప్రశ్నలు వేస్తూ "ఏమిటి మీరు ఇలా తయారయ్యారేంటి?" అని అడిగారు. అందుకు ఆమె "మీ సోదరుడు అబూ దర్దాకు ఈ ప్రపంచంలో ఏమీ అక్కర్లేదు" అని (బాధపడుతూ) అన్నారు. (అంతలోనే) అబూ దర్దా (రజి) కూడా వచ్చేశారు. తన సోదరుడు సల్మాన్ (రజి) కోసం భోజనం అన్నం వండించారు. వడ్డించిన తరువాత ఆయనతో "మీరు తినండి, నేను ఉపవాసమున్నాను" అన్నారు. దానికి సల్మాన్ (రజి) "మీరు నాతోపాటు తినంతవరకు నేనూ తినను" అన్నారు. అప్పుడు ఆయన కూడా తన సఫిల్ ఉపవాసాన్ని విరమించుకొని ఆయనతోపాటు కూర్చొని భోజనం చేశారు.రాత్రి అయిన తరువాత అబూ దర్దా (రజి) నఫిల్ నమాజులు చేయటానికి ఉపక్రమించారు. అప్పుడు సల్మాన్ (రజి) "(ముందు) పడుకో (తరువాత లేచి నమాజు చేసుకోవచ్చు)" అని అన్నారు. దాని ప్రకారమే అబూదర్దా (రజి) నిద్రపోయారు. కొంతసేపటికి నిద్రనుండి మేల్కొని తిరిగి నఫిల్ నమాజులు చేయటం ప్రారంభించారు. సల్మాన్ (రజి) (అప్పుడు కూడా ఆయన్ని ఆపి) "ఇంకాస్సేపు నిద్రపో" అన్నారు. ఆ తరువాత రాత్రి ఆఖరి సమయం రాగానే సల్మాన్ (రజి) (మేల్కొని) ఆయనతో "ఇప్పుడు లేచి నమాజు చెయ్యి" అన్నారు. ఇద్దరూ కలసి నమాజు చేశారు. (నమాజు ముగించుకున్న తరువాత) ఆయన అబూదర్దా (రజి)తో ఇలా అన్నారు: నిస్సందేహంగా నీపై నీ ప్రభువు హక్కు ఉంది (నిజమే!). కాని నీపై నీ స్వయానికి కూడా హక్కు ఉంది. నీ ఇంటివారికి (భార్యాపిల్లలకు) కూడా హక్కు ఉంది. కనుక ప్రతి హక్కుదారుని హక్కును నెరవేర్చు! తరువాత సల్మాన్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధిలో హాజరై జరిగినదంతా ఆయనకు వివరించారు. అది విని దైవ ప్రవక్త (సల్లం) "సల్మాన్ నిజం పలికాడు" అన్నారు. (బుఖారీ)

* హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం: "దైవసాక్షి! నేను జీవితాంతం పగలంతా ఉపవాసముంటూ రాత్రంతా నమాజులు చేయటంలో గడుపుతూ ఉంటాను" అని నేను శపథం చేసినట్టు దైవప్రవక్త (సల్లం)కు ఎవరో తెలియజేశారు. అప్పుడు ఆయన (స), "నువ్విలా శపథం చేశావా?" అని నన్ను అడిగారు. దానికి నేను, "నా తల్లి దండ్రులు మీకు అర్పితమవుగాక! నేను ఆ విధంగా శపథం చేసిన మాట నిజమే" అని అన్నాను. దానికి ఆయన "ఈ పని చేసే శక్తి నీలో లేదు. కనుక నీవు కొన్నాళ్ళపాటు ఉపవాసాలు ఉండి, మరికొన్ని రోజులపాటు వాటిని వదిలెయ్యి. అదేవిధంగా (రాత్రిపూట) కొంతసేపు పడుకొని (ఆ తరువాత) నమాజు చెయ్యి. ప్రతి నెలా మూడు రోజులు ఉపవాసాలు పాటించు (చాలు). ఒక్క సత్కార్యానికి పదిరెట్లు పుణ్యం లభిస్తుంది కాబట్టి (మూడు

రోజుల ఉపవాసానికి ముప్పై రోజులు ఉపవాసాలు పాటించినంత పుణ్యం లభిస్తుంది). ఆ లెక్కన నీవు పాటించే (మూడు దినాల ఉపవాస) ఆచరణతో నీవు ఏడాది కాలం ఉపవాసాలు పాటించినట్లవుతుంది" అని నాకు హితబోధ చేశారు. ఈ హితపు విని నేను "నాకు ఇంతకంటే ఎక్కువ శక్తి ఉంది" అన్నాను. దానికి అయన (స), "అయితే ఒకరోజు ఉపవాసం ఉండి, ఆ తరువాత రెండు రోజులు మానెయ్యి" అని అన్నారు. "నాకు అంతకంటే కూడా ఎక్కువ శక్తి ఉంది" అని నేను మళ్ళీ అన్నాను. "మరయితే నీవు ఒకరోజు ఉపవాసం పాటించి తరువాత ఒకరోజు మానేస్తూ ఉండు. ఇది హజ్రత్ దావూద్ (అలైహి) పాటించే ఉపవాస విధానం. ఇంకా ఇది ఉపవాసాలు పాటించే పద్ధతుల్లో అన్నిటికన్నా ఉత్తమమైనది మరియు సమంజసమైనదీను" అన్నారు దైవప్రవక్త. (బుఖారీ)

* మరొక ఉల్లేఖనం ప్రకారం: ఓ అబ్దుల్లాహ్! "నీవు (ప్రతిరోజూ) పగలంతా ఉపవాసముండి, రాత్రంతా నఫిల్ నమాజులు చేస్తున్నావట, నిజమేనా?" అని నన్ను దైవప్రవక్త (సల్లం) అడిగారు. దానికి నేను "మీరు విన్నది నిజమే దైవప్రవక్తా! అన్నాను. అప్పుడు ఆయన – అలా చేయకు. ఒక రోజు ఉపవాసం ఉండు, ఒక రోజు ఉపవాసం విరమించు. రాత్రి లేచి ప్రార్థన చెయ్యి, కాసేపు నిద్ర కూడా పో. నిస్సందేహంగా నీపై నీ కంటికి హక్కు ఉంది నీ భార్యకి (భార్యాపిల్లలకు) కూడా హక్కు ఉంది. కనుక ప్రతి హక్కుదారుని హక్కును నెరవేర్చు! (బుఖారీ, ముస్లిం)

* మనిషి, సంతులన – సానుకూల జీవితానికి పునాది ఏమిటంటే తాను తన ప్రతిభను, శక్తిని సమీకరించుకుంటూ ఉండాలి. మధ్య మధ్యలో విశ్రాంతి, ప్రశాంతత ద్వారా తనను తానూ ఉత్తేజ పరచుకుంటూ ఉండాలి. దీన్నే ఆంగ్లంలో (Sharpen your saw) మీ కత్తికి పదును పెట్టడం అంటారు. ఆధునిక శాస్త్రం పవర్ న్యాప్ లేదా షార్ట్, లైట్ స్లీప్ (ఖైలూలా) ప్రాముఖ్యతను నొక్కిచెప్పింది, ఎందుకంటే ఇది శ్రమ ఫలితంగా వచ్చే మానసిక, శారీరక ఒత్తిడి తగ్గిస్తుంది. ఒక వ్యక్తి ఆలోచన మరియు ఏకాగ్రత సామర్థ్యాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. అతనికి ఉల్లాసాన్ని కలుగజేసి పని పట్ల శ్రద్ధ, ఉత్సాహాన్ని పెంచుతుంది. పనిలో మంచి ఫలితాల్ని సాధించేలా ప్రేరేపిస్తుంది

స్వీయ శుచీ శుభ్రత

* స్వీయ శుచీ శుభ్రత గురించి తాకీదు చేస్తూ ప్రవక్త (స) చేసిన హితవులు మనకు అనేకం ఆయన జీవితంలో కనిపిస్తాయి. గుస్ల్ – స్నానం మొదలు దంతధావనం వరకు అన్నీ విషయాలు ఆయన తెలియజేశారు. . దైవ ప్రవక్త (స) నిద్ర లేచిన తర్వాత తన దినచర్యను మిస్వాక్ తో ప్రారంభించేవారు. అలాగే ఇంట్లో ప్రవేశించేటప్పుడు, ప్రతి నమాజును ముందు మిస్వాక్ తప్పక చేసేవారు. చక్కగా స్నానమాచరించేవారు, అందమైన ఆహార్యం కలిగి ఉండేవారు. మేలిమి దుస్తులతోపాటు, నాణ్యత గల సువాసను ఆయన బాగా ఇష్ట పడేవారు.

* హజ్రత్ ఆయిషా (రజిఅన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: పది విషయాలు మానవ సహజమైనవి. 1) మీసాలు కత్తిరించటం, 2) గడ్డం పెంచటం, 3) పల్లు తోముకోవటం 4) ముక్కుని నీటితో శుభ్రం చేసుకోవటం. 5) గోళ్లు కత్తిరించుకోవటం 6) వ్రేళ్ళ మధ్య భాగాన్ని కడుక్కోవటం 7) చంకలోని వెంట్రుకల్ని తొలగించటం, 8) నాభి క్రింద వెంట్రుకల్ని తీసి వేయటం, 9) మూత్రశుద్ధి చేసుకోవటం తర్వాత ఉల్లేఖకుడు ఇలా అంటున్నాడు– 'పదో విషయం నేను మర్చి పోయాను. బహుశా అది పుక్కిలించటం కావచ్చని నా అభిప్రాయం'.. (ముస్లిం)

ప్రవక్త (స) వారి ప్రవృత్తి మరియు ప్రవర్తన

* దైవ ప్రవక్త (స) వారు మంచి ఆహారం, గొప్ప ఆహార్యం గలవారు. సుందరమైన రూపం, అందమైన ముఖారవిందం, ఉత్తమ వ్యక్తిత్వం, ఉన్నత నైతిక ప్రమాణం ఆయనది. ఎంతో సౌమ్యులు, ఉదార స్వభావులు, , ధైర్యవంతులు. ఎప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా, నిత్యం వినిర్మలంగా ఉండేవారు. చూపరుల్ని యిట్టే ఆకట్టుకునే మందస్మిత ముఖారవైందంతో ఆయన వదనం కళాకాంతులీనుతూ ఉండేది. శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసే ఆయన పవిత్ర నోట వెలువడే స్వర్ణకార మాట – ధ్వని ధ్వనులు మనిషిని బంగారు మనీషిలా, మనసున్న మారాజులా మార్చేవి. ఆయన అమృత పలుకులు విన్న వారి జీవితం ధన్యం అనిపించక మానదు. ఆయన ఉన్నత నైతిక శిఖరాగ్రం. కరుణ, నిజాయితీ, ఐహిక అనాసక్తత, క్షమాగుణం, సహనం, నిజాయితీ, వినయవిధేయత వంటి గొప్ప లక్షణాలు ఆయన స్వంతం. ఆయన (స) మహా సిగ్గరి. ఆయన ఎవరితోనైనా కరచాలనం చేస్తే, ఎదుటి వ్యక్తి చేయి వదలనంత వరకూ ఆయన వదిలేవారు కాదు.ఆయన పెదాల మీద చిరునవ్వు కదలాడుతూ ఉండేది. ఆయన తన స్నేహితులు మరియు కుటుంబ సభ్యులతో ఎంతో సరదాగా ఉండేవారు. ఆయన సరదాగా, నవ్వుకోడానికి చెప్పే మాటల్లో సయితం సత్యం తొణికిసలాడుతూ ఉండేది. ఆయన పిల్లల యెడల అవ్యాజానురాగం, అమిత వాత్సల్యం కలిగి ఉండేవారు. పిల్లల్ని ఎంతో ప్రేమగా చూసుకునేవారు. వారితో కలిసిపోయి ఆడుకునేవాడు. స్వయంగా – మనవళ్లు, మనవరాళ్లతో ఆటలాడుకునేవారు.

* దైవ ప్రవక్త (స) తన రోజువారీ జీవితంలో కొన్ని ఘడియలు – అల్లాహ్ దాసుల అవసరాల్ని తీర్చడం కోసం, ముస్లిం ప్రజా సమస్యలను తీర్చడం కోసం, కుటుంబ వ్యవహారాల్ని చూసుకోవడం కోసం, స్వీయ అవసరాల పరిపూర్తి కోసం కేటాయించేవారు. ఆ రకంగా జీవిత అన్ని రంగాల్లోనూ గొప్ప ఆదర్శం ఆయన పవిత్ర జీవితం.

(విశ్వాసులారా!) దైవప్రవక్త (జీవనసరళి)లో మీకు మంచి ఆదర్శం ఉంది. అల్లాహ్ ను, అంతిమ దినాన్ని నమ్మి, అల్లాహ్ ను అత్యధికంగా స్మరించేవారికి ఈ ఆదర్శం ఎంతో ఉప యోగపడుతుంది. (అల్‌అహ్జాబ్: 21)

* దైవ ప్రవక్త (స) ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఉండేవారు. బడుగు బలహీన ప్రజల్ని ఆదుకునేవారు. అగత్యపరుల్ని అక్కున చేర్చుకునేవారు. అనాథల్ని అనుంగు సంతానంగా చూసుకునేవారు. రోగుల్ని పరామర్శించేవారు. ఆప్తుల్ని కోల్పోయిన వారి యెడల ప్రగాఢ సానుభూతిని తెలియజేసేవారు. ప్రజలకు మంచిని గురించి ఆదేశించేవారు, చెడును గురించి వారించేవారు. దైవభీతి, వినయవిధేయతలకు సంబంధించిన విషయాలలో ముందుండాలని ప్రోత్సహించేవారు. ఆయన తరచూ ఇలా అంటూ ఉండేవారు: మీరు సత్యానికి కట్టుబడి ఉండండి. నిశ్చయంగా సత్యం మంచి వైపునకు దారి చూపుతుంది. మంచి స్వర్గానికి దారి చూపుతుంది. (ముస్లిం)

మహా ప్రవక్త (స) దుఆల్లోని కొన్ని ముఖ్యమైన దుఆలు

1

* మహా ప్రవక్త (స) నిద్ర నుండి మేల్కొన్న తర్వాత ఈ దుఆ చదివేవారు: అల్ హందు లిల్లాహిల్లజీ అహ్యానా బఅ'ద మా అమాతనా వ ఇలైహిన్ నుషూర్. (ముస్లిం).

* మహా ప్రవక్త (స) మస్జిద్ వైపునకు వెళ్తూ ఈ దుఆ చదివేవారు: అల్లాహుమ్మజ్అల్ ఫీ ఖల్బీ నూరా, వ ఫీ లిసానీ నూరా, వజ్అల్ ఫీ సమ్ యీ నూరా, వజ్అల్ ఫీ బసరీ నూరా, వజ్అల్ మిన్ ఖల్ఫీ నూరా, వ మిన్ అమామీ నూరా, వజ్అల్ మిన్ ఫౌఖీ నూరా, వ మిన్ తహ్ తీ నూరా, అల్లాహుమ్మ అఅతినీ నూరా. (ముస్లిం 763, బుఖారి 6316). వేరొక ఉల్లేఖనంలో ఆయన ఇలా అన్నారు: రాత్రి చీకటిలో మస్జిద్ వైపునకు నడిచి వెళ్లేవారికి – ప్రళయ దినాన సంపూర్ణ జ్యోతి ఇవ్వబడుతుందన్న శుభవార్తను తెలియజేస్తున్నాను. (అబూ దావూద్)

* ఆయన (స) దుఆలలోనిది: అల్లాహుమ్మ అస్లిహ్ లీ దీనియల్లజీ హువ ఇస్మతు అమ్రీ, వఅస్లిహ్ లీ దున్యాయల్లతీ ఫీహా మఆషీ, వఅస్లిహ్ లీ ఆఖిరతియల్లతీ ఫీహా మఆదీ, వజ్అలిల్ హయాత జియాదతల్లీ ఫీ కుల్లి ఖైర్ ,వజ్అలిల్ మౌత రాహతల్లీ మిన్ కుల్లి షర్ (ముస్లిం)

* అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుకల్ హుదా వత్తుఖా, వల్ అఫాఫ, వల్ గినా. (ముస్లిం)

* అల్లాహుమ్మ ముసర్రిఫల్ ఖులూబ్ సర్రిఫ్ ఖులూబనా అలా తాఅతిక్ (ముస్లిం)

* యా ముఖల్లిబల్ ఖులూబ్ సబ్బిత్ ఖల్బీ అలా దీనిక (తిర్మిజీ) ఉమ్మ్ సలమా (ర.అ) – ప్రవక్త (స) ఈ దుఆ తరచుగా చేసేవారు అని అన్నారు.

* అల్లాహుమ్మ లక సజత్తు వ బిక ఆమంతు వలక అస్లమ్ తు, సజద వజ్ఞియ లిల్లజీ ఖలకహు వ సవ్వరహు వ షక్క సమ్అహు వ బసరహు తబారకల్లాహు అహ్సనుల్ ఖాలికీన్. (ముస్లిం 771).

* ఒక వ్యక్తి ఇస్లాం స్వీకరించిన తర్వాత – ప్రవక్త (స) అతనికి ఈ దుఆ నేర్పించి ఎక్కువగా చేస్తూ ఉండు అని హితవు పలికేవారు. అల్లాహుమ్మగ్ఫిర్లీ వర్ హమ్నీ వ ఆఫినీ వహ్ దినీ వర్ జుఖ్నీ. (అబూదావూద్ 850).

* ఆయన (స) దుఆలలోనిది: అల్లాహుమ్మ రబ్బ జిబ్రీల వ మీకాఈల వ ఇస్రాఫీల ఫాతిరస్సమావాతి వల్ అర్జి ఆలిమల్ గైబి వష్షహాదతి అంత తహ్కుము బైన ఇబాదిక ఫీమా కానూ ఫీహి యఖ్తలిఫూన్. ఇహ్ దినీ లిమఖ్ తులిఫ ఫీహి మినల్ హఖ్ఖి బిఇజ్నిక ఇన్నక తహ్ దీ మన్ తషాఉ ఇలా సిరాతిమ్ ముస్తఖీం.

(ముస్లిం 770).

అబూ జర్ (ర) గారి కథనం – దైవ ప్రవక్త (స) అల్లాహ్ మాటను తెలియజేశారు; ఓ నా దాసులారా! మీరందరూ మార్గం తెలియనివారే, నేను మార్గం చూపినవారు తప్ప. కాబట్టి మార్గం చూపని నన్ను వేడుకొండి. నేను మీకు మార్గదర్శి అవుతాను. (ముస్లిం)

‘మీ ప్రభువును క్షమాపణ కోరుకోండి. ఆయన గొప్ప క్షమాశీలి. ఆయన మీకోసం ఆకాశం నుండి వర్షం కురిపిస్తాడు. మీకు సంతానం సిరిసంపదలు అనుగ్రహిస్తాడు. మీకోసం తోటలు పండిస్తాడు; సెలయేరులు ప్రవహింపజేస్తాడు. (నూహ్: 10–12)

"జాగ్రత్త! దైవసాక్షి! నేను మీ అందరికంటే ఎక్కువగా దైవానికి భయపడేవాడ్ని, అందరికంటే ఎక్కువగా ఆయన పట్ల భీతిగలవాడ్ని. కాని నేను ఉపవాసాలూ ఉంటాను, (అప్పుడప్పుడూ) వాటిని వదలుతాను కూడా. (రాత్రి పూట) నమాజూ చేస్తాను. పడుకుంటాను కూడా. ఇంకా నేను స్త్రీలను వివాహం కూడా చేసుకుంటాను. (కనుక ఈ పనులన్నీ నా సంప్రదాయాలే).



ఫ్రాన్స్‌లోని క్యాథలిక్ మతాధికారులు 1950 నుండి 216,000 మంది మైనర్ పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే దిగ్భ్రాంతికరమైన నివేదికపై వాటికన్ విచారం వ్యక్తం చేసింది.

కాథలిక్ పాఠశాలలు మరియు యువజన కార్యక్రమాలు వంటి చర్చితో ఇతర సంబంధాలను కలిగి ఉన్న మతాధికారులు కాని వ్యక్తుల బాధితులతో సహా దుర్వినియోగానికి గురైన మైనర్‌ల సంఖ్య 330,000. అంచనా వేయబడింది. చర్చి అధికారుల అభ్యర్థన మేరకు స్వతంత్ర దర్యాప్తు కమిటీ ఈ నివేదికను రూపొందించింది.

వాటికన్ అధికార ప్రతినిధి మాథ్యూ బ్రూనీ మాట్లాడుతూ.. "పోప్ ఫ్రాన్సిస్ ఆలోచనలు: మేము బాధితులను చాలా విచారంతో మరియు వారి గాయపడిన భావాలతో సంబోధిస్తాము, "ఉల్లంఘనలను ఖండించడంలో బాధితులు చూపిన ధైర్యానికి అతను కృతజ్ఞతలు."



బాధితుల సంఘం వ్యవస్థాపకుడు ఫ్రాంకోయిస్ డెఫో అన్నారు: లా పరోల్ లిబెరే ప్రకారం, మతాధికారులు "విశ్వాస ద్రోహానికి, నమ్మక ద్రోహానికి, బాల ద్రోహానికి పాల్పడ్డారు.







సౌభాగ్యం, సాఫల్యం, జీవనోపాధికి సంబంధించిన తాళంచెవులు

ఆనందం, సంతోషం, సౌభాగ్యం, విజయవంతమైన జీవిత రహస్యాల గురించి బహుశా మీరు చాలానే చదివి ఉంటారు, చదువుతారు. కానీ ఇస్లాం మీకు ఈ మార్గాలన్నింటిని ఉత్తమమైన పద్ధతిలో చూపుతుందని మీరు త్వరలోనే గ్రహిస్తారు.

ఇస్లాం మీకు జీవనోపాధికి మార్గాలను చూపిస్తుంది, మీరు గనక వాటిని అనుసరిస్తే, అల్లాహ్ మీ జీవనోపాధి మీకు సులభంగా చేరే ఏర్పాటు చేయడమే కాక, అందులో సమృద్ధిని, శుభాన్ని కలుగజేస్తాడు. ఉత్తమ జీవనోపాధికి అత్యంత ముఖ్యమైన మార్గం – దైవభక్తి మరియు ఇస్తిగ్ఫార్ – పశ్చాత్తాపం. దానధర్మం, బంధుత్వ సంబంధాలను బల పర్చడం, జీవనోపాధిని చేరుకోవడానికి ప్రారంభ వేళలో బయలుదేరడం.

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: ఎవరికయితే, అతని జీవనోపాధి విస్తృతం అవ్వాలని, అతని ఆయువు పెరగాలని కోరిక ఉంటుందో వారు బంధుత్వ సంబంధాలను బలపర్చాలి. (బుఖారీ, ముస్లిం)

మరో సందర్భంలో ఆయన ఇలా అన్నారు: మీరు మీలోని బలహీనుల కారణంగా ఉపాధి ప్రసాదించబడుతున్నారని, వారి మూలంగా దైవ సహాయం మీకు అందుతూ ఉందని మీకు తెలుసా? (బుఖారీ)

అల్లాహ్ కు భయపడుతుండేవాడికి అల్లాహ్ కష్టాలనుంచి బయటపడే దారి చూపుతాడు. (ఒకవేళ ఆర్థిక ఇబ్బందులుంటే) అతనికి దేవుడు అతని ఊహ సైతం పోని దిశ నుండి ఉపాధినిస్తాడు. అల్లాహ్ ను నమ్ముకునేవాడికి అల్లాహ్ యే చాలు. అల్లాహ్ తన పని తప్పకుండా నెరవేరుస్తాడు. ఆయన ప్రతిదానికీ ఓ లెక్క నిర్ణయించిపెట్టాడు..... అల్లాహ్ తనకు భయపడేవారికి తగిన సౌలభ్యం కలిగిస్తాడు. ఎవరు అల్లాహ్ కు భయపడతాడో అల్లాహ్ అతనిలోని చెడులు తొలగించి అతనికి గొప్ప ప్రతిఫలం ప్రసాదిస్తాడు. (అత్–తలాఖ్: 4 – 2)

అల్లాహ్ మార్గంలో సంపద ఖర్చు చేసేవారి (ఖర్చు) పోలిక, ఒక విత్తనం నాటగా అది ఏడు వెన్నులు ఈని ప్రతి వెన్నులో వందేసి గింజలున్నట్లు ఉంటుంది. అదే విధంగా అల్లాహ్ తాను తలచుకున్న వారి కర్మఫలాన్ని అనేక రెట్లు పెంచుతాడు. అల్లాహ్ ఎంతో ఉదార స్వభావుడు, సర్వం తెలిసినవాడు. (అల్–బఖరహ్: 261)